

ఈనాడు



హైదరాబాద్ 24-3-2018 శనివారం సిటీ సంపుటి 44. సంచిక 223

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 24+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



మూడు స్థానాలూ తెరాస ఖాతాలోకే

(మొదటి పేజీ తరువాయి)

ఓటును చెల్లనిదిగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించడంతో దానిని పరిగణనలోకి తీసుకోలేదు. కాంగ్రెస్‌లో గెలిచిన ఏడుగురు సభ్యులు తెరాసకు అనుకూలంగా ఓటు వేయడంపై కాంగ్రెస్ ఫిర్యాదు చేయగా ఈసీ తోసిపుచ్చింది. మరోవైపు కాంగ్రెస్‌లో చేరిన తెదేపా ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఓటు హక్కును వినియోగించుకోలేదు. శాసనసభ కమిటీ హాలులో జరిగిన ఎన్నికల ఫలితాలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ శుక్రవారం రాత్రి ప్రకటించారు.

తొలి ఓటు ఈటల.. చివరి ఓటు జీవన్‌రెడ్డి

రాజ్యసభ ఎన్నికల్లో తొలి ఓటును ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ వినియోగించుకున్నారు. తర్వాత మంత్రులు, సీఎం, కాంగ్రెస్ సభ్యులు ఓటు వేశారు. శాసన సభ్యుడు రాజేందర్‌రెడ్డి తిరుపతి నుంచి నేరుగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చివరిగా కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఓటు వేశారు. సాయంత్రం నాలుగింటికి పోలింగు ముగిసింది. భాజపా, తెదేపా, సీపీఎంలు పోలింగుకు దూరంగా ఉన్నాయి.

ఓట్ల లెక్కింపులో జాప్యం..

ఓట్ల లెక్కింపులో జాప్యం జరిగింది. దొంతి మాధవరెడ్డి ఓటు విషయమై రిటర్నింగ్ అధికారి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయగా, అక్కడి నుంచి సమాచారం కోసం గంటసేపు ఎదురుచూశారు. చివరికి సాయంత్రం ఆరింటికి ఓట్ల లెక్కింపు మొదలవగా..ఏడింటికి ముగిసింది. అనంతరం ఎన్నికల సంఘానికి సమాచారం ఇచ్చి మాధవరెడ్డి ఓటు పరిగణనలోకి తీసుకోలేదన్న అంశాన్ని ఎన్నికల అధికారులు వారి దృష్టికి తీసుకెళ్లారు. చివరికి ఎన్నికల సంఘం ఆమోదం తెలపడంతో ఎన్నికల ఫలితాన్ని ప్రకటించారు.

రాజ్యసభలో పెరిగిన తెరాస బలం

రాజ్యసభ ఎన్నికల్లో తెరాస వ్యూహం ఫలించింది. పకడ్బందీగా వ్యవహరించి మూడు స్థానాలను కైవసం చేసుకుని.. రాజ్యసభలో తన బలాన్ని పెంచుకుంది. సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాలపై దృష్టి సారించిన నేపథ్యంలో రాజ్యసభ తాజా ఫలితాలను శుభసూచకంగా తెరాస భావిస్తోంది. తమ ప్రాధాన్యం మరింతగా పెరుగుతుందని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్లు తెలిసింది. తెరాసకు ప్రస్తుతం రాజ్యసభలో ముగ్గురు సభ్యులున్నారు. తాజాగా గెలిచిన వారితో కలిపి తెరాస రాజ్యసభ సభ్యుల సంఖ్య ఆరుకు చేరింది. లోక్‌సభలో ఆ పార్టీకి ప్రస్తుతం 14 మంది సభ్యుల మద్దతు ఉండగా, రాజ్యసభలో ఆరుగురితో కలిపి మొత్తం ఎంపీల సంఖ్య 20కి చేరింది. ప్రత్యామ్నాయ కూటమి రూపకల్పన ద్వారా జాతీయ రాజకీయాల్లో ముఖ్యపాత్ర పోషించాలని సీఎం కేసీఆర్ అనుకుంటున్నారు. ఎంపీల సంఖ్య పెరగడం ద్వారా తమ పార్టీ మరింత బలోపేతమైనట్లుగా సీఎం కేసీఆర్ భావిస్తున్నారు.



అసెంబ్లీలో నిర్వహించిన రాజ్యసభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటున్న సీఎం కేసీఆర్

అభ్యర్థుల నేపథ్యం

జోగినపల్లి సంతోష్‌కుమార్

వయస్సు- 42 సంవత్సరాలు
పుట్టిన తేదీ- 21.07.1975.
విద్యార్హత- ఎంబీఏ.

- చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండలం కొదురుపాకకు చెందినవారు. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత సీఎం కేసీఆర్ వెంట నడిచారు. ఆది నుంచి ఆయనకు వెన్నుదన్నుగా ఉన్నారు. రాజకీయపరంగా సీఎం వ్యూహాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇటీవలే ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.

బడుగుల లింగయ్య యాదవ్

వయస్సు- 58 సంవత్సరాలు.
విద్యార్హత బీఏ, బీఈడీ.
స్వస్థలం- నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం బీమారం.

- 1982లో తెదేపాలో చేరిన ఆయన సుదీర్ఘ కాలం ఇదే పార్టీలో కొనసాగారు. 2009లో మహాకూటమి అభ్యర్థిగా నేతి విద్యాసాగర్‌పై స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2015 మార్చి 16న తెదేపాకు రాజీనామా చేసి తెరాసలో చేరగా ఆయనను తెరాస ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

బండా ప్రకాశ్ ముదిరాజ్

వయస్సు- 63 సంవత్సరాలు
విద్యార్హత- ఎంఏ, పీహెచ్‌డీ.
నివాసం- వరంగల్ హంటర్ రోడ్డులోని నందిహిల్స్

- తెలంగాణలోని పలు సామాజిక, స్వచ్ఛంద సంఘాలకు అధ్యక్షునిగా, కార్యదర్శిగా ఉన్నారు. వరంగల్ పురపాలక సంఘం ఉపాధ్యక్షునిగా, కౌన్సిలర్‌గా పనిచేశారు. గతేడాది తెరాసలో చేరగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.

విమానాశ్రయమే బ్రాండ్ అంబాసిడర్

ఈనాడు, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లో అత్యుత్తమ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసినందుకు జీఎంఆర్ బృందానికి, కుటుంబానికి ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని (జీహెచ్ఐఏఎల్) ప్రారంభించి పదేళ్లయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవ కార్యక్రమాన్ని జీఎంఆర్ గ్రూప్ శుక్రవారమిక్కడ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా విమానాశ్రయ విస్తరణ పనులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. విమానాశ్రయ ప్రాంగణంలో నిర్మించనున్న దక్షిణాసియాలోనే అతిపెద్ద సమావేశ మందిరం (కన్వెన్షన్ సెంటర్) పనులనూ ముఖ్యమంత్రి ప్రారంభించారు. విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి అనుసంధాన (కనెక్టివిటీ) కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు ప్రపంచ శ్రేణి కంపెనీలను ఆకర్షించడానికి దేశంలోనే తొలి ఎయిర్‌పోర్ట్ సిటీని అభివృద్ధి చేసే పనులకు తెలంగాణ ఐటీ, పరిశ్రమల పరిశ్రమల మంత్రి కేటీఆర్ శ్రీకారం చుట్టారు.

కేటీఆర్ మాట్లాడుతూ.. "హైదరాబాద్‌ను ప్రపంచ నగరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకు హైదరాబాద్ విమానాశ్రయం బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేయగలదని భావిస్తున్నాను. హైదరాబాద్‌కు కనెక్టివిటీ పెంచడానికి, మరిన్ని అంతర్జాతీయ విమానయాన సంస్థలను ఆకర్షించడానికి ముఖ్యమంత్రి అనుమతితో విమాన ఇంధనంపై వ్యాట్‌ను 16 శాతం నుంచి ఒక శాతానికి తగ్గిస్తున్నాం. దేశంలోని మొదటి, కొత్త ఎయిర్‌పోర్ట్ సిటీ అభివృద్ధి ప్రభుత్వ దృక్పథానికి అనుగుణంగా ఉంది. విమానాశ్రయంలో నిర్మించే సమావేశ మందిరం సమావేశాలు, ప్రదర్శనలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తుంది. విమానాశ్రయానికి ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.4,650 కోట్లతో దీన్ని అభివృద్ధి చేస్తున్నాం. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ విమానాశ్రయ సమీపంలో డ్రైపోర్టును, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్‌ను అభివృద్ధి చేస్తోంది. జీఎం.రావు మరిన్ని విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నా" అని కేటీఆర్ పేర్కొన్నారు.

హైదరాబాద్ భద్రమైన నగరం..

"రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా, హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడంలో కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న కృషిలో జీఎంఆర్ గ్రూప్ పాలుపంచుకుంటోంది. మిషన్ భగీరథ, టీఎస్-ఐపాస్ వంటి అనేక కీలక నిర్ణయాలను కేసీఆర్ తీసుకున్నారు. వ్యాపారాన్ని ఏర్పాటు చేయడానికి సులభ విధానాలు, నిబంధనలు (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ప్రవేశపెట్టిన రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. నాణ్యమైన జీవనంలోనూ హైదరాబాద్ నగరం ముందువరసలో నిలిచింది. హైదరాబాద్ ఎంతో భద్రమైన నగరం. భారత్‌లో పెట్టుబడులకు హైదరాబాద్ ప్రాధాన్య నగరంగా మారింది. హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్మించేటప్పుడు అనేక సవాళ్లు ఎదురయ్యాయి. వాటన్నింటిని అధిగమించి గడువు కంటే 5 నెలల ముందే నిర్మించాం. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో దీన్ని అభివృద్ధి చేశాం. తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ విమానాశ్రయం కోహినూర్ వజ్రం" అని జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ జి.ఎం.రావు తెలిపారు. ప్రస్తుతం శంషాబాద్ విమానాశ్రయం ప్రయాణికుల వార్షిక సామర్థ్యం 1.2 కోట్లు. ఇప్పటికే సామర్థ్యానికి మించి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల వార్షిక సామర్థ్యాన్ని 3 ఏళ్లలో 2.6 కోట్లకు, 5-6 ఏళ్లలో 3.5-4 కోట్లకు (మొదటి టెర్మినల్) పెంచనున్నారు. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీని బట్టి రెండో టెర్మినల్ కూడా ఏర్పాటు చేసి ఏడాదికి 10 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు నిర్వహించడానికి వీలుగా అభివృద్ధి చేస్తామని జి.ఎం.రావు తెలిపారు. తొలిదశ విస్తరణకు రూ.2 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు.

"విద్యుత్, రహదారుల రంగంలో జీఎంఆర్ గ్రూప్ ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ.. విమానయాన రంగంలో జి.ఎం.రావు విజయం సాధించారు. ప్రపంచ స్థాయి విమానాశ్రయాలను అభివృద్ధి చేశారు. దిల్లీ విమానాశ్రయంలోని టెర్మినల్ 3 ప్రపంచ ఇంజినీరింగ్ ప్రతిభకే ఒక గుర్తింపు" అని విమానయాన శాఖ కార్యదర్శి రాజీవ్ నయన్ చౌబే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎస్ ఎస్‌కే జోషి, తెలంగాణ రవాణా మంత్రి పి.మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి.ప్రకాశ్ గౌడ్, తీగల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. విమానాశ్రయ దశాబ్ది ఉత్సవాన్ని పురస్కరించుకుని తపాలా శాఖ ప్రత్యేక స్టాంప్, కవర్‌ను విడుదల చేసింది.

ప్రపంచ స్థాయి సమావేశ మందిరం..

సమావేశాలు, ప్రదర్శనలు (మైస్ రంగం) వంటి కార్యక్రమాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రపంచ స్థాయి సమావేశ మందిరాన్ని (కన్వెన్షన్ కేంద్రం) విమానాశ్రయంలో ఏర్పాటు చేస్తున్నారు. 1,50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఈ కేంద్రంలో 10,000-12,000 మంది సమావేశం కావచ్చు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ముందు హైదరాబాద్ విమానాశ్రయం ద్వారా రాకపోకలు నిర్వహిస్తున్న ప్రయాణికులు ఏడాదికి సగటున 7 శాతం వృద్ధి చెందితే, 2014 తరవాత ఈ సంఖ్య 21 శాతం చొప్పున వృద్ధి చెందుతోంది. అంటే వృద్ధిరేటు మూడింతలైంది. విమానయాన కంపెనీలకు అయ్యే వ్యయంలో అధిక శాతం ఇంధనమే ఉంటుంది. వ్యాట్ తగ్గింపు వల్ల విమానయాన కంపెనీల నిర్వహణ వ్యయాలు బాగా తగ్గుతాయి.



రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దశాబ్ది ఉత్సవ కార్యక్రమంలో చిన్నారులతో ముఖ్యమంత్రి కేసీఆర్, జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి.ఎం.రావు, మంత్రులు మహేందర్‌రెడ్డి, కేటీఆర్ తదితరులు

ఒప్పంద ఉద్యోగుల వేతనాల పెంపు!

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఒప్పంద ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వైద్య ఆరోగ్య శాఖలో ఆశాలు, రెండో ఏఎన్ఎంల వేతనాల పెంపుపై ఇప్పటికే నిర్ణయానికొచ్చిన ప్రభుత్వం.. ఇదే శాఖలో ఇతర ఒప్పంద ఉద్యోగులతోపాటు ఇతర శాఖల్లోని ఒప్పంద ఉద్యోగులకూ వేతనాలను పెంచడంపై దృష్టిపెట్టినట్లు తెలిసింది. శుక్రవారమిక్కడ ఉన్నతాధికారులతో సీఎం సమావేశంలో దీనిపై చర్చ జరిగినట్లు సమాచారం. ఆశా ఆరోగ్య కార్యకర్తలకు మరో దఫా పారితోషికాన్ని పెంచాలనే ప్రతిపాదననూ సిద్ధం చేసింది. ప్రస్తుతమిస్తున్న రూ.6 వేలకు మరో రూ.3 వేలను అదనంగా చేర్చి మొత్తంగా రూ.9 వేలను ఆశాలకు నెలకు పారితోషికంగా అందజేయాలనే ప్రతిపాదనపైనా శుక్రవారం ముఖ్యమంత్రి వద్ద చర్చ జరిగినట్లు తెలిసింది. దీనిపై సీఎం సానుకూలంగానే స్పందించినట్లు సమాచారం. అయితే ఈ చర్చలో మరిన్ని అంశాలు తెరపైకి వచ్చినట్లు తెలిసింది. జాతీయ ఆరోగ్య మిషన్ కింద వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు కూడా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్నారు. వీరందరికీ కనీస వేతనాన్ని అమలు చేయడాన్ని ప్రస్తావనకొచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు ఇతర శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల గురించి ప్రస్తావించగా అన్ని శాఖల్లోని ఒప్పంద ఉద్యోగులకూ కనీస వేతన పెంపును అమలు చేయాల్సి వస్తే ఎంత అవుతుందో వివరాలు ఇవ్వమని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిసింది. దీనిపై సానుకూల నిర్ణయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించే అవకాశాలున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో సమగ్ర ఆరోగ్య పరీక్షలపైనా ముఖ్యమంత్రి వద్ద సమావేశంలో చర్చించారు. అన్ని రకాల పరీక్షలనూ ఒకే దఫా నిర్వహించడానికి తగినంత కసరత్తు అవసరమనే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. ఈ కార్యక్రమాన్ని కొంత ఆలస్యంగానైనా పక్కాగా నిర్వహించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ వేసవిలో ముందుగా కంటి వైద్య శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఆప్ ఎమ్మెల్యేలకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఆ 20 మందిని అనర్హులుగా ప్రకటిస్తూ కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై ప్రజాప్రతినిధులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. నోటిఫికేషన్‌పై స్టే విధించేందుకు జనవరి 24న హైకోర్టు నిరాకరించింది. అయితే సదరు నియోజకవర్గాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ఉపఎన్నికల తేదీని ప్రకటించడం వంటి చర్యలను చేపట్టరాదని ఈసీని ఆదేశించింది. తాజాగా ఈ అంశంపై తీర్పును వెలువరించింది. ఆప్ ఎమ్మెల్యేలపై వేటు వేస్తూ ఇచ్చిన నోటిఫికేషన్ చట్టప్రకారం సరికాదని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ చందర్ శేఖర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దీనిపై ఈసీ చేసిన సిఫార్సును తప్పుపట్టింది. ఇందులో సహజన్యాయ సూత్రాల ఉల్లంఘన జరిగిందని పేర్కొంది. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి ముందు మౌఖిక వాదనను వినలేదని వ్యాఖ్యానించింది. "ఈ కేసుపై మళ్లీ వాదనలు విని, ఆ తర్వాత.. 'లాభదాయక పదవి అంటే ఏమిటి' వంటి ముఖ్యమైన అన్ని అంశాలపై నిర్ణయం తీసుకోవాలి" అని ఈసీని ఆదేశించింది. ఈ తీర్పుపై దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హర్షం వ్యక్తంచేశారు. ఇది ధర్మ విజయమని పేర్కొన్నారు. "ప్రజాప్రతినిధులపై అక్రమంగా అనర్హత వేటు వేశారు. దిల్లీ ప్రజలకు హైకోర్టు న్యాయం చేసింది" అని ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు. మరోవైపు హైకోర్టు తీర్పు నేపథ్యంలో సదరు 20 మంది ఎమ్మెల్యేలను ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు అనుమతిస్తామని స్పీకర్ రామ్‌నివాస్ గోయెల్ తెలిపారు.

'అయోధ్య' కేసు విస్తృత ధర్మాసనానికి?

దిల్లీ: అయోధ్యలో వివాదాస్పద స్థల సేకరణకు సంబంధించిన 1994 నాటి తీర్పును పునఃపరిశీలించే అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలా? వద్దా? అనే విషయంపై ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు సుప్రీంకోర్టు శుక్రవారం వెల్లడించింది. ముందుగా ఈ తీర్పు విషయంలో నెలకొని ఉన్న వివాదాన్ని పరిష్కరించాలి. అందుకే, ఈ తీర్పు మొత్తాన్ని కానీ....లేదా కొన్ని భాగాలను కానీ విస్తృత ధర్మాసనానికి నివేదించవచ్చు అని చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్ర, జస్టిస్. అశోక్‌భూషణ్, జస్టిస్.ఎస్.ఎ.నజీర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. మందిరం-మసీదు భూ వివాదంపై తొలుత వ్యాజ్యం వేసిన వారిలో ఒకరైన సిద్దిక్ మరణానంతరం ఆయన తరపున వారసులు కేసు కొనసాగిస్తున్నారు. 1994 నాటి తీర్పులో మసీదు అనేది ఇస్లాంలో ఓ అంతర్భాగం కాదనీ..నమాజ్‌ను ఎక్కడైనా చేసుకోవచ్చంటూ పేర్కొనడాన్ని ఖండిస్తూ వారి తరపున సీనియర్ న్యాయవాది డాక్టర్. రాజీవ్ ధావన్ శుక్రవారం తన వాదనలు వినిపించారు. ఈ క్రమంలో దానిని విస్తృత ధర్మాసనానికి నివేదించే అంశంపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీం పేర్కొంది.

కాంగ్రెస్ అవిశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

అవిశ్వాస నోటీసులకు గత ఆరు రోజులుగా మద్దతు పలుకుతూ వచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఇప్పుడు తానే అవిశ్వాస బాణాన్ని సంధించింది. శుక్రవారం సభ వాయిదా పడిన తర్వాత ఈనెల 27వ తేదీ కోసం ఆ పార్టీ లోక్‌సభాపక్షనేత మల్లికార్జున ఖర్గే... లోక్‌సభ సెక్రటరీ జనరల్ కార్యాలయంలో అవిశ్వాస నోటీసును అందజేశారు. మరోవైపు మంగళవారం సభకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ తమ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ విప్ కూడా జారీ చేసింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అవిశ్వాస నోటీసు ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై ఒత్తిడి పెరగనుంది. అయితే, ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు తమ ఆందోళనను యథావిధిగా కొనసాగించే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ నోటీసుపైనా చర్చ కష్టంగానే కనిపిస్తోంది.

వారిని సీట్లలో కూర్చోబెట్టండి.. చర్చిద్దాం

అవిశ్వాసానికి మద్దతిచ్చే వారు సభామధ్యంలో ఉన్న సభ్యులకు నచ్చజెప్పి సీట్లలో శాంతియుతంగా కూర్చోబెడితే దానిపై చర్చను చేపట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని సభాపతి సుమిత్రా మహాజన్ ప్రకటించినప్పటికీ శుక్రవారం సభ అదుపులోకి రాలేదు. అధికారపక్షం కూడా చర్చకు సిద్ధంగా ఉన్నందున సభ్యులంతా సహకరించాలని కోరారు. తెదేపా నేత తోట నరసింహం, వైకాపా నాయకుడు వైవీ సుబ్బారెడ్డిలు ఇచ్చిన అవిశ్వాస నోటీసులు వరుసగా ఆరో రోజు సభ ముందుకు వచ్చిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన రెండు నిమిషాల్లోనే ఏఐఏడీఎంకె, తెరాస సభ్యుల ఆందోళనను ప్రారంభించారు. సభ సజావుగా లేకపోతే అవిశ్వాస నోటీసులకు మద్దతిచ్చే 50 మందిని లెక్కించడం కష్టం కాబట్టి అందరూ తమ సీట్ల దగ్గరకు వెళ్లాలని కోరారు. ఈ మాటలను వినిపించుకోకుండా సభామధ్యంలో ఉన్న సభ్యులు మరింత బిగ్గరగా నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సభాపతి... కాంగ్రెస్ సభ్యులవైపు చూస్తూ మీరు అవిశ్వాసానికి మద్దతిచ్చేటట్లయితే వీరందర్నీ కలిసి శాంతియుతంగా కూర్చోబెట్టండి అని సూచించారు. ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు తమ నినాదాలు కొనసాగించడంతో స్పీకర్ లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని సోమవారం సభకు సెలవు ప్రకటించారు. 25వ తేదీన పార్లమెంటు సభ్యులు తమ తమ నియోజకవర్గాల్లో రామనవమి కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున మరుసటి రోజు సెలవు కావాలని అడిగారని, అందుకోసం సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు సుమిత్రా మహాజన్ వెల్లడించారు.

ఆత్మపరిశీలన చేసుకోవాలి: వెంకయ్యనాయుడు

విపక్ష పార్టీల సభ్యులు తమ ఆందోళనలను కొనసాగించటంతో రాజ్యసభ కూడా ఎలాంటి కార్యకలాపాలనూ చేపట్టలేకపోయింది. మూడు వారాలుగా కార్యకలాపాలను చేపట్టలేకపోవటంపై సభాధ్యక్షుడు వెంకయ్యనాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే ఆయన దీనిపై ఒక ప్రకటన చేశారు. 'మూడు వారాలుగా పెద్దల సభ తన బాధ్యతలను నిర్వర్తించలేకపోయింది. సభాధ్యక్షుడిగా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. దేశ ప్రజలకు ఎందుకిలా అన్యాయం చేస్తున్నామని సభ్యులంతా ఆత్మపరిశీలన చేసుకోవాలి. వచ్చే వారమైనా మార్పు ఉంటుందేమో చూడాలి" అని సభ్యులనుద్దేశించి అన్నారు. ప్రతిష్టంభన తొలగించడానికి అధికార, ప్రతిపక్షాలు చొరవ చూపాలని వెంకయ్య కోరారు. ఆ తర్వాత మంత్రులు సభావ్యవహారాల కాగితాలు ఉంచిన వెంటనే ఏఐఏడీఎంకె, తెదేపా, కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి వచ్చి ఆందోళన కొనసాగించారు. దాంతో ఆయన సభను తొలుత సోమవారానికి వాయిదా వేశారు. శ్రీరామనవమి కారణంగా లోక్‌సభ ఆ రోజు సెలవు ఇవ్వడంతో రాజ్యసభకూ అదే రోజున సెలవు మంజూరుచేస్తూ తర్వాత నిర్ణయం తీసుకున్నారు.

'ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదు'

ప్రస్తుతం ప్రత్యేక హోదా మనుగడలో లేదని, అందువల్ల భవిష్యత్తులో ఏ రాష్ట్రానికీ ఆ హోదాను ప్రకటించే ప్రశ్నే ఉత్పన్నం కాదని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి శివ్‌ప్రసాద్ శుక్లా తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో కరీంనగర్ ఎంపీ బి.వినోద్‌కుమార్‌తో పాటు, ఒడిశా, బిహార్‌కు చెందిన మరో ఇద్దరు ఎంపీలు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 14వ ఆర్థికసంఘం ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలు, సాధారణ రాష్ట్రాల మధ్య ఎలాంటి తేడా చూపనందున ప్రస్తుతం ప్రత్యేకహోదా మనుగడలో లేదని స్పష్టంచేశారు.



రాజ్యసభలో ఛైర్మన్ వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేస్తున్న ప్రతిపక్షాలు

మైసూరు నుంచి తెలుగు పీఠం తరలింపుపై నిర్ణయం తీసుకోలేదు

మైసూరులోని తెలుగు పీఠాన్ని తెలుగురాష్ట్రాల్లో ఎక్కడోచోటికి తరలించే అంశంపై ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయమంత్రి సత్యపాల్ సింగ్ తెలిపారు. రాజ్యసభలో తెదేపా సభ్యుడు టీజీ వెంకటేష్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన ఈ సమాధానమిచ్చారు.

గ్రహం అనుగ్రహం

24-3-2018 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; చైత్ర మాసం; శుక్ల పక్షం
సప్తమి: ఉ. 9-58 తదుపరి అష్టమి
మృగశిర నక్షత్రం: మ. 3-37 తదుపరి ఆర్ద్ర
అమృత ఘడియలు: ఉ. 7-21 నుంచి 8-51 వరకు తిరిగి తె. 4-40 నుంచి
వర్జ్యం: రా. 11-26 నుంచి 12-56 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-05 నుంచి 7-41 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-05; సూర్యాస్తమయం: సా.6-07

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	41.0	26.0
తిరుపతి	40.2	27.5
మహబూబ్‌నగర్	39.6	24.6
రామగుండం	39.0	19.2
ఆదిలాబాద్	39.0	13.7
సూర్యాపేట	38.0	28.0
హన్మకొండ	38.0	22.0
కరీంనగర్	38.0	21.5
నిజామాబాద్	38.0	21.0
మెదక్	38.0	16.7
హైదరాబాద్	37.8	21.3
ఖమ్మం	37.0	23.0

వెల్‌స్పన్ జౌళి పార్కుకు రాయితీలు

ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న వెల్‌స్పన్ ఇండియా లిమిటెడ్ సాంకేతిక జౌళి ఉత్పత్తుల పార్కుకు పారిశ్రామిక రాయితీలచ్చేందుకు అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దుస్తుల తయారీ విధానం, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి ప్రోత్సాహక పథకాల కింద రాయితీలు ఇవ్వాలని నిర్దేశించింది.

లోక్‌పాల్ ఏర్పాటు కోసం మళ్లీ అన్నాహజారే నిరవధిక దీక్ష

దిల్లీ: లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ....సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే శుక్రవారం నుంచి ఇక్కడ నిరవధిక నిరాహార దీక్షను మొదలు పెట్టారు. ఇక్కడి రామ్‌లీలా మైదాన్‌లో ఆయన నిరశన దీక్ష మొదలైంది. 2011లో ఇక్కడి నుంచే ఆయన అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించిన విషయం గమనార్హం. కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్తలను ఏర్పాటు చేయాలంటూ హజారే ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న విషయం గమనార్హం. వ్యవసాయరంగ సమస్యలకు పరిష్కారాలను సూచించిన స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేయాలన్నది కూడా అన్నాహజారే డిమాండ్‌గా ఉంది.

నిరశన దీక్షకు ఉపక్రమించడానికి ముందు అన్నాహజారే రాజ్‌ఘాట్ వద్ద జాతిపిత మహాత్ముడికి ఘన నివాళి అర్పించారు. ఈ దఫా దేశవ్యాప్తంగా ఉన్న రైతులు రామ్‌లీలా మైదాన్‌లో అన్నాహజారేకు మద్దతుగా దీక్షలో పాల్గొంటారు. అన్నాహజారే నిరశన దీక్ష నేపథ్యంలో దిల్లీ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

2010 తర్వాత నేతన్నలు తీసుకున్న రుణాలు మాఫీ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : రాష్ట్రంలో ఎక్కువ మంది చేనేత కార్మికులకు రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతంలో జారీచేసిన జీవోను సవరించి.. శుక్రవారం నూతనంగా జీవో.ఎం.ఎస్.46ను విడుదల చేసింది. దీని ప్రకారం 2010, ఏప్రిల్ 1 నుంచి 2017, మార్చి 31 మధ్య మూలధన వ్యయంగా నేత కార్మికులు తీసుకున్న రూ.లక్షలోపు రుణాలు మాఫీ కానున్నాయి. ఈ లెక్కన సుమారు 8,500 మంది కార్మికులకు మాఫీ వర్తించనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.40 కోట్లు ఖర్చుచేయనుంది. గత ప్రభుత్వం 2010, మార్చి కంటే ముందున్న రుణాలను మాఫీ చేసిందని.. ఆపై కార్మికులకు ఎలాంటి రుణమాఫీ జరగలేదని చేనేత, జౌళిశాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. ఈ విషయాన్ని పలువురు నేతన్నలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. సాధారణంగా ప్రభుత్వ పథకాలకు 2014, జూన్ 2ను పరిగణనలోకి(కటాఫ్‌డేట్‌గా) తీసుకుంటున్నామని.. నేతన్నల సంక్షేమాన్ని ప్రత్యేక అంశంగా భావించి ..2010 నుంచి మాఫీ వర్తింపజేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని ఆయన తెలిపారు. రుణాలు చెల్లించని వారికే గతంలో మాఫీ వర్తించేదని.. కానీ సకాలంలో రుణాలను తిరిగి చెల్లించిన కార్మికులు నష్టపోకూడదనే ఉద్దేశంతో.. ఆ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమచేయనున్నట్లు చెప్పారు. మాఫీ అయిన రుణ మొత్తానికి తగ్గకుండా.. తిరిగి రుణసౌకర్యం పొందేందుకు చేనేత వృత్తిలో కొనసాగుతున్న కార్మికులకు హామీ సైతం లభించనున్నట్లు మంత్రి వివరించారు. 2010 నుంచి చేనేతలకు రుణమాఫీ చేయడంపై ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు ఆప్కో మాజీ అధ్యక్షుడు మండల శ్రీరాములు, చేనేత సంఘాల ఇతర నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

సరిలేరు 'హిందూజా' కుటుంబానికెవ్వరూ!

- వరుసగా ఐదో ఏడాది అపర కుబేరులే

లండన్: యూకేలో నివసిస్తున్న బ్రిటిష్ ఆసియన్లలో తమకు తామే సాటి అని హిందూజా కుటుంబం మరోసారి రుజువు చేసింది. వరుసగా ఐదో ఏడాది కూడా అత్యధిక సంపన్న వ్యాపార కుటుంబంగా నిలిచింది. లండన్ ప్రధాన కేంద్రంగా ఐదు ఖండాల్లో విస్తరించిన వీరి వ్యాపార సామ్రాజ్యం విలువ అక్షరాలా సుమారు రూ.2,02,250 కోట్లు అని 'ఆసియన్ మీడియా గ్రూప్' ఏటా విడుదల చేసే ఆసియాన్ సంపన్నుల జాబితాలో వెల్లడించింది. హిందూజా సోదరులైన శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్, అశోక్‌ల ఆస్తులు 2017లో సుమారు రూ.27,577 కోట్లు పెరిగినట్లు తెలిసింది. హిందూజాల తరువాత భారతీయ స్టీల్ దిగ్గజం లక్ష్మీ నివాస్ మిట్టల్ రూ.1,28,704 కోట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఈయన ఆస్తులు రూ.12,870 కోట్లు పెరిగాయి. ఇండోరమా కార్పొరేషన్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అయిన శ్రీప్రకాశ్ లోహియా రూ.46,885 కోట్లతో తరువాతి స్థానంలో నిలిచారు.

ఇదీ సంగతి!



ఇదిగో అన్నా. లోక్‌పాల్ తేవట్లేదని ఎవరన్నారు. ఊరేశామంతే!

ఈనాడు

హైదరాబాద్ 24-3-2018 శనివారం సిటీ సంపుటి 44. సంచిక 223

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 24+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



రాజ్యసభ ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన తెరాస అభ్యర్థులు జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య, బండ ప్రకాశ్

మూడు స్థానాలూ తెరాస ఖాతాలోకే

రాజ్యసభ ఎన్నికల్లో ప్రకాశ్, లింగయ్య, సంతోష్‌కుమార్ గెలుపు

- కాంగ్రెస్ ఏజెంటుకు చూపి ఓటేసిన స్వతంత్ర అభ్యర్థి మాధవరెడ్డి
- ఆ ఓటు చెల్లదని తేల్చిన ఎన్నికల సంఘం
- తెరాసకు ఓటేసిన కాంగ్రెస్ సభ్యులపై ఫిర్యాదును తోసిపుచ్చిన ఈసీ

మొత్తం పోలైన ఓట్లు	107
తెరాస అభ్యర్థులకు	33, 32, 32
కాంగ్రెస్ అభ్యర్థికి	10

ఈనాడు – హైదరాబాద్


తెలంగాణలో శుక్రవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి మూడింటిని కైవసం చేసుకుంది. ఎన్నికల్లో మొత్తం 107 ఓట్లు పోల్‌కాగా తెరాసకు ఊహించిన విధంగానే 97 ఓట్లు వచ్చాయి. బండ ప్రకాశ్ ముదిరాజ్‌కు 33, బడుగుల లింగయ్య యాదవ్, జోగినపల్లి సంతోష్‌కుమార్‌లకు 32 చొప్పున ఓట్లు రాగా వారిని విజేతలుగా ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరామ్‌నాయక్ 10 ఓట్లు మాత్రమే పొంది ఓటమి పాలయ్యారు. స్వతంత్ర సభ్యుడిగా ఉన్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పోలింగు సమయంలో కాంగ్రెస్ ఏజెంటుకు తమ ఓటును చూపించడంతో దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) ఈసీకి ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం ఆయన (మిగతా 2లో)

ఇదీ.. ఇసుక మతలబు

తేదీ వేయకుండానే వే బిల్లులు జారీ

- తనిఖీ జరిగితే ఆరోజు తేదీ వేసుకుని ఇసుక దందా
- ఎంత నింపినా వేబిల్లు ప్రకారం ఉన్నట్లు రశీదు

ఎన్ని చర్యలు తీసుకున్నా ఇసుక దందా కొనసాగుతూనే ఉంది. వ్యక్తిగత అవసరాల పేరుతో అనుమతి పత్రాలు పొంది యథేచ్ఛగా అక్రమాలు కొనసాగిస్తున్నారు. తనిఖీలు జరిగినప్పుడు ఈ పత్రాలు చూపించి తప్పించుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తాళ్లపాము, పొగుళ్లపల్లి మధ్యలోని ముర్రేడు వాగు నుంచి ఇసుక వాహనాలకిచ్చిన అనుమతి పత్రాలను 'ఈనాడు' పరిశీలించగా విస్తుపోయే వాస్తవం బయటపడింది. ఒకే తేదీతో ఉన్న రెండు బిల్లుల నెంబర్ల మధ్య వ్యత్యాసం 40వేల పైచిలుకు. అంటే అన్ని వాహనాల నుంచి ఇసుక ఆ రోజు వెళ్లినట్లా? ఇదెలా సాధ్యం? సిబ్బంది సహకరిస్తే సాధ్యమే మరి.. తేదీలు వేయకుండా వే బిల్లులిస్తుండటంతో అక్రమార్కులు రోజులు, వారాల తరబడి ఒకే అనుమతి పత్రంతో తరలిస్తున్నారు. ఎప్పుడైనా తనిఖీలు జరిగితే ఆరోజు తేదీ వేసుకొని తప్పించుకుంటున్నారు...ఇలా జనవరి 22వ తేదీ ఓ వ్యక్తి ట్రాక్టర్ ఇసుక తీసుకెళ్లారు. రవాణాపత్రం సంఖ్య 1,77,131. అదేరోజు ఆ వాగు నుంచే కొత్తగూడెంకు చెందిన మరో వ్యక్తి ఇసుక ట్రాక్టర్ తీసుకెళ్లినట్లు బిల్లు ఉంది. దీని రవాణా పత్రం సంఖ్య 1,36,818. ఏ బిల్లు వాస్తవమైందో అక్రమార్కులకే ఎరుక....



22న (తాళ్లపాము, పొగుళ్లపల్లి నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతిస్తూ ఇచ్చిన పత్రం నెంబరు **1,77,131**

అదే తేదీ చూపుతూ ఉన్న మరో పత్రం నెంబరు **1,36,818**

ఇలా కొనసాగుతున్న ఇసుక దందాపై ప్రత్యేక కథనం... -6లో



రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణ పనులను ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు మహేందర్‌రెడ్డి, కేటీఆర్, జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి.ఎం.రావు

విశ్వనగరానికి విమానాశ్రయమే

బ్రాండ్ అంబాసిడర్

- తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్
- ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేసిన జీఎంఆర్‌కు మంత్రి కృతజ్ఞతలు
- విమానాశ్రయ విస్తరణ పనులను ప్రారంభించిన ముఖ్యమంత్రి కేసీఆర్
- కోహినూర్ వజ్రం హైదరాబాద్ విమానాశ్రయం: జీఎంఆర్

-2లో



ఆస్ట్రేలియా ఆశలకూ గండి!

457 వీసా రద్దు..
కొత్తగా 'టీఎస్ఎస్'
భారతీయులకు
తగ్గనున్న ఉద్యోగాలు!

ఆస్ట్రేలియా కూడా అమెరికా బాటలోనే నడుస్తోంది. విదేశీ నైపుణ్య ఉద్యోగాలకు కీలకమైన వీసాలను రద్దు చేసి కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులోని కఠిన నిబంధనల కారణంగా విదేశీ నిపుణులకు గండి పడినట్లే!

వివరాలు 13లో

ఆప్ ఎమ్మెల్యేలకు

ఊరట

- 'లాభదాయక కేసు'లో అనర్హత వేటును కొట్టేసిన దిల్లీ హైకోర్టు
- సహజ న్యాయ సూత్రాలు పాటించలేదని వ్యాఖ్య
- మరోసారి విచారించి నిర్ణయం తీసుకోవాలని ఈసీకి ఆదేశం

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి పెద్ద ఊరట! లాభదాయక పదవుల కేసులో ఆ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలపై పడిన అనర్హత వేటును దిల్లీ హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. ఈ అంశంపై మరోసారి విచారించి, నిర్ణయం తీసుకోవాలని కేసును తిరిగి ఎన్నికల సంఘానికి అప్పగించింది.

ఈ ఎమ్మెల్యేలు 2015 మార్చిలో దిల్లీ ప్రభుత్వంలోని మంత్రులకు పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమితులయ్యారు. ఇది లాభదాయక పదవి అని ఆరోపణలు వచ్చాయి. ఈ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ ఈసీ.. ఈ ఏడాది జనవరి 19న రాష్ట్రపతికి సిఫార్సు చేసింది. మరుసటి రోజే (మిగతా 2లో)

కాంగ్రెస్ అవిశ్వాసం

- లోక్‌సభ సెక్రటరీ జనరల్ కార్యాలయంలో నోటీసు అందజేత
- 27న లోక్‌సభ ముందుకు వచ్చే అవకాశం

ఈనాడు, దిల్లీ: పార్లమెంటులో ప్రతిష్టంభన శుక్రవారం కూడా కొనసాగింది. మలి విడత బడ్జెట్ సమావేశాల్లో వరుసగా 15వ రోజు కూడా ఉభయ సభలు కార్యకలాపాలేవీ చేపట్టకుండానే మంగళవారానికి వాయిదాపడ్డాయి. తెదేపా, వైకాపాలు ఇస్తున్న (మిగతా 2లో)



లోక్‌పాల్ ఏర్పాటు కోసం

మళ్లీ అన్నా నిరవధిక దీక్ష

-2లో

వీడిన చెక్కుముళ్లు!

- 4 వేల గ్రామాల సమాచారాన్ని ఎన్ఐసీకి ఇచ్చిన వ్యవసాయశాఖ
- 60 లక్షలమంది రైతులకు రూ.4 వేల చొప్పున పంపిణీ
- ఏప్రిల్ 18– మే15కల్లా రూ.2,400 కోట్లు బ్యాంకుల్లో జమ

-6లో

ఒప్పంద ఉద్యోగుల వేతనాల పెంపు!

- కనీస వేతనం అమలు చేసే యోచన
- ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించే అవకాశం

-2లో

ఈనాడు

సాకల్య క్షాళన తప్పనిసరి

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో మేటవేసిన నిష్పూచీతనమే కొండంత అండై భారీ కుంభకోణాల వరదలో దేశంలో అంతటిలేని వింత కథగా కొనసాగుతోంది. బ్యాంకుల్ని నిలువునా ముంచి తట్టాబుట్టా సర్దుకుని దర్జాగా విదేశాలకు ఉడాయిస్తున్న బడాబాబుల ఉదంతాలు నిశ్చేష్టపరుస్తున్నాయి. ఆ వరసలో సరికొత్తగా హైదరాబాదుకు చెందిన టోటెం ఇన్‌ఫ్రా సంస్థపై కేంద్ర నేర పరిశోధన సంస్థ (సీబీఐ) కేసు నమోదైంది! వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతడి సంబంధీకులు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) అధికారులతో జట్టుకట్టి వివిధ బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టిన మొత్తం ఇప్పటికి పద్నాలుగున్నర వేలకోట్ల రూపాయలకు పైబడింది. ఆ ప్రహసనాన్ని వెన్నంటి రొటోమ్యాక్ సంచాలకుల విక్రం కొఠారీ బాగోతం నెల్లాళ్ల క్రితం వెలుగుచూసింది. ఏడు బ్యాంకులతో కూడిన సహవ్యవస్థ (కన్సార్టియమ్)ను కొఠారీ కుటుంబం రూ.3,695 కోట్లకు ముంచేసింది. ఎస్‌బీఐ నేతృత్వంలోని పద్నాలుగు బ్యాంకుల సహవ్యవస్థకు కనిష్క్ గోల్డ్ యాజమాన్యం అసలు, వడ్డీ కలిపి దాదాపు రూ.1,000 కోట్ల మేర టోకరా వేసి విదేశాలకు ఎగిరిపోయిన వైనం రెండు రోజుల క్రితమే వెల్లడైంది. ఆ కథనాలపై సిరా తడి ఆరకముందే ఎనిమిది బ్యాంకులు, ఆర్థిక సంస్థల సమాఖ్యకు టోటెం ఇన్‌ఫ్రా రమారమి రూ.1,400 కోట్ల దాకా ఎగవేసినట్లు బహిర్గతమైంది. కీలక స్థానాల్లోని అధికారుల్ని ప్రతి మూడేళ్లకోసారి బదిలీ చేయాల్సి ఉన్నా ఆ నిబంధనల్ని పట్టించుకోకపోవడమే బ్యాంకులకు ఈ దుస్థితి తెచ్చిపెట్టిందని సీవీసీ (కేంద్ర నిఘా సంఘం) ఆక్షేపించగా- కేంద్రం ఇక బదిలీల కొరడా ఝళిపిస్తామంటోంది. అంతర్గత నియంత్రణల్ని మెరుగుపరచడంతోపాటు అసలు ప్రభుత్వరంగ బ్యాంకుల గతిరీతులు, యాజమాన్య బాధ్యతలన్నింటినీ సాకల్యంగా పరిశీలించాల్సి ఉందని ప్రధానికి ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ స్పష్టీకరిస్తున్నారు. పైపూత పరిష్కారాలకు ఇది తరుణం కాదు!

ఖాతాల నిర్వహణలో ప్రభుత్వరంగ బ్యాంకులు పారదర్శకత పాటించాలని ఇంచుమించు మూడు దశాబ్దాలనాడు ఆర్‌బీఐ దిశానిర్దేశం చేసింది. ఆ ఉద్బోధ అరణ్యరోదనమైన దుష్పరిణామాలు నేడు అడుగడుగునా ప్రస్ఫుటమవుతున్నాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల్లో సిబ్బంది తోడ్పాటుతో జరిగే మోసాల సంఖ్య అధికమని, ఇంటి దొంగల కారణంగా వాటిల్లుతున్న ఆర్థిక నష్టాల పరిమాణం ప్రాతిపదికన రాజస్థాన్ తొలిస్థానమని రిజర్వ్‌బ్యాంకు గణాంకాలే ధ్రువీకరిస్తున్నాయి. కొందరు వ్యాపారవేత్తలు, బ్యాంకర్లు కుమ్మక్కై దేశ భవిష్యత్తును దోచుకుంటున్నారని ఇటీవల ఆక్రోశించిన ఆర్‌బీఐ సారథి ఉర్జిత్ పటేల్- బ్యాంకుల నియంత్రణ చట్టానికి సవరణల ఆవశ్యకతను ప్రత్యేకంగా ప్రస్తావించారు. పీఎన్‌బీలో వేలకోట్ల రూపాయల మహావంచనను ఆడిట్, నియంత్రణ సంస్థలు ఏడేళ్లుగా పసిగట్టలేక పోవడమేమిటన్న కేంద్ర విత్తమంత్రి జైట్లీ సూటిప్రశ్న- వ్యవస్థాగత లోటుపాట్లను కళ్లకు కట్టింది. మరే బ్యాంకూ అనధికారిక అంగీకార పత్రాలు జారీ చేయకుండా, ఉద్దేశపూర్వక ఎగవేతదారులు విదేశాలకు పారిపోకుండా నట్లు బిగిస్తున్నామంటున్న కేంద్రం- బ్యాంకు దొంగల ఆస్తుల జప్తుపైనా దృష్టి సారించింది. రుణాలు రాబట్టి ఎగ్గొట్టిన వాళ్లు మాత్రమే మోసగాళ్లు కాదు. హర్షద్ మెహతాలకు, కేతన్ పరేఖ్‌లకు, నీరవ్ మోదీలకు, భూపేష్ జైన్లకు లోపాయికారీగా సహకరించి అప్పనంగా కోట్లకు కోట్లు దోచిపెట్టి జేబులు నింపుకొన్న విద్రోహ అనుపానుల్నీ గుర్తించి బోనెక్కించాలి. అటువంటి భారీ రుణ సందేరాలకు సమ్మతి తెలిపిన బోర్డు సభ్యుల్నీ వదిలిపెట్టకూడదు. వందలు, వేలకోట్ల రూపాయల నిధుల్ని నిక్షేపంగా వేరే ఖాతాలకు మళ్లించుకొని కుంభకోణాసురులు భద్రమైన ప్రాంతాలకు తరలిపోవడాన్ని గుట్టురట్టు కానివ్వని వాళ్లందరినీ ఆర్థిక కుట్రలో భాగస్వాములుగా పరిగణించి, కఠినంగా శిక్షించాల్సిందే!

పదహారేళ్ల క్రితం జాన్ రుస్నక్ అనే వ్యక్తి అమెరికాలో 691 మిలియన్ డాలర్ల (ప్రస్తుత రేటు ప్రకారం, నాలుగున్నర వేలకోట్ల రూపాయల) మేర బ్యాంకు మోసానికి పాల్పడి న్యాయాధికారుల్ని ప్రలోభపెట్టినట్లు రుజువై ఏడున్నర సంవత్సరాలు జైలుపాలయ్యాడు. వంచనకు తెగబడ్డారన్న అభియోగాలపై వాంగ్ లైమింగ్, మియావ్ పింగ్ అనే బ్యాంకర్లకు 2004లో చైనా మరణ దండన అమలుపరిచింది. సత్వర న్యాయ విచారణ వ్యవస్థలు నెలకొనని భారత్‌లో మోసాలు, ఉద్దేశపూర్వక ఎగవేతలు ఇంతలంతలై మొన్న డిసెంబరునాటికి బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.8.41 లక్షల కోట్లకు విస్తరించాయి. 2004-15 సంవత్సరాల మధ్య బ్యాంకులు పారుబాకీలుగా మాఫీ చేసిన మొత్తం రూ.2.11 లక్షల కోట్లు! నిరర్థక ఆస్తుల మెరుకు గుదిబండై కూలబడిన ప్రభుత్వరంగ బ్యాంకుల పునర్ మూలధనీకరణ పేరిట కేంద్రం వెచ్చిస్తున్నదంతా ప్రజాధనమే. జనం సొమ్మును యథేచ్ఛగా దారిపోస్తున్న ఏ ప్రజాప్రభుత్వమైనా బ్యాంకుల్లో తిరుగులేని జవాబుదారీతనానికి, పనిపోకడల పరంగా పారదర్శకతకు ఇదమిత్థ చర్యలు చేపట్టాల్సిందే. ప్రభుత్వరంగ బ్యాంకుల ఛైర్మన్, ఎమ్‌డీ, డైరెక్టర్లను సాగనంపే అవకాశం గాని, బ్యాంకుల లైసెన్సులు రద్దుచేసే అధికారం గాని లేని తాను వాటిని ఎలా నియంత్రించగలనని రిజర్వ్‌బ్యాంకు వాపోతోంది. 1949 నాటి బ్యాంకింగ్ నియంత్రణ చట్టం, 1955నాటి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1970నాటి బ్యాంకింగ్ కంపెనీల చట్టం, 1980నాటి జాతీయీకరణ శాసనం- కేంద్రం ముందస్తు అనుమతి లేకుండా బ్యాంకు బోర్డులు ఏమీ చేయగల వీల్లేదని నిర్దేశిస్తున్నాయి. అయినా అవకతవకలు పెచ్చరిల్లుతుండటం, రకరకాల లోటుపాట్లలో బ్యాంకింగ్ రంగం కూరుకుపోయిన దయనీయ దుస్థితికి అద్దం పడుతోంది. బ్యాంకింగ్ వ్యవస్థను తిరిగి సవ్యంగా పట్టాలకు ఎక్కించే సమగ్ర సంస్కరణలే దేశార్థికాన్ని తేజరిల్లజేయగలుగుతాయి!

కాడి వదిలి... కదం తొక్కి!


డాక్టర్ పరిటాల పురుషోత్తం

ప్రస్తుత, పూర్వ ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేసినందువల్లే రైతులు నేడు ఉద్యమపథం పట్టారు. ఇటీవల నాసిక్ నుంచి ముంబయి వరకు 35 వేలమంది రైతులు మహా పాదయాత్ర జరపడం, వారిలో ప్రజ్వరిల్లుతున్న తీవ్ర అసంతృప్తికి నిదర్శనం. ఈ నెల ఆరు నుంచి 11వ తేదీ వరకు జరిపిన ఈ యాత్రలో రైతులు తమ రుణాలు, విద్యుత్ బిల్లులను బేషరతుగా మాఫీ చేయాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, రైతులకూ పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడగళ్ల వాన, అకాల వర్షాల వల్ల పంటనష్టం జరిగినప్పుడు ఎకరాకు రూ.40 వేల చొప్పున నగదు పరిహారం చెల్లించాలన్నారు. అన్నింటినీమించి తాము దీర్ఘకాలంగా సాగుచేస్తున్న అటవీ భూములపై తమకు యాజమాన్య హక్కులు దఖలుపరచాలని కోరారు. అదే సమయంలో ఆదివాసులకు భూ హక్కులు ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే రైతులు గిట్టుబాటు ధరలకోసం పిడికిలి బిగించారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని ఒత్తిడి పెంచారు.


మహారాష్ట్ర రైతుల మహా పాదయాత్ర

పెరుగుతున్న అప్పులు

నీతి ఆయోగ్ 2017 మార్చిలో వెలువరించిన విధానపత్రం ప్రకారం 2015-16 ముందు అయిదేళ్లకాలంలో రైతుల వాస్తవ వ్యవసాయాదాయం ఏటా 0.44 శాతం చొప్పున మాత్రమే పెరిగింది. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని లెక్కిస్తే వాస్తవ ఆదాయం వస్తుంది. 1993-94 నాటి వాస్తవ ఆదాయంతో పోలిస్తే 2015-16 నాటికి రైతుల ఆదాయం 108.5 శాతం పెరిగిన మాట నిజమే కానీ, ఈ ఆదాయవృద్ధి ప్రధానంగా 1993-94 నుంచి 2011-12 వరకు మాత్రమే సంభవించింది. అక్కడి నుంచి వారి ఆదాయాల పెరుగుదల నెమ్మదించింది. వివరంగా చెప్పాలంటే 1993-94లో రూ. 21,110గా ఉన్న వ్యవసాయాదాయం 2011-12నాటికి రూ.43,258కి చేరింది. అప్పటి నుంచి 2015-16 వచ్చేసరికి రూ.44,027కు స్వల్పవృద్ధి నమోదైంది. మరోవైపు వ్యవసాయ ఖర్చులూ అధికమై రైతు చేతిలో ఏమీ మిగలని దుస్థితి ఎదురైంది.

1990ల నుంచి కార్పొరేట్ విత్తన సంస్థలు ధరలను 500 నుంచి 700 శాతం వరకు పెంచేశాయి. ఆ విత్తనాల్లో నికరంగా మొలకెత్తేవాటి శాతం 80 నుంచి 60 శాతానికి పడిపోయింది. ఎరువులు, ఇతర ఉత్పత్తి సాధనాల వ్యయాలు పైకెగబాకి రైతుల నిజఆదాయం మాత్రం కోసుకుపోయింది. 27 రకాల పంటల రైతులు విపణిలో ధరల భారీపతనం వల్ల నష్టపోయారని వ్యవసాయ శాఖ ఇటీవలి అధ్యయనమొకటి తేల్చింది. ఒక్క శెనగ రైతులే ఈ ఏడాది పంట వైఫల్యం వల్ల రూ.6,087 కోట్ల నష్టపోనున్నారు. వ్యాపారులు, దళారులు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కన్నా బాగా తక్కువ మొత్తం చెల్లిస్తున్నందువల్ల ఇప్పటికే రైతుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. తెలంగాణ రైతులు కంది, శెనగ పప్పును కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)కన్నా రూ.1,000 తక్కువకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. పంటకోసం చేసిన అప్పులూ తీర్చలేక రైతులు ఆత్మహత్య చేసుకోవడం ఎక్కువైంది. 2015లో దేశంలో 8,007మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వారి సంఖ్య 2016లో 21 శాతం తగ్గి 6,351కి పరిమితమైందని గణాంకాలు చాటుతున్నాయి. మొత్తంగా వ్యవసాయ రంగంలో 2015లో 12,602 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా, 2016లో ఆత్మహత్యల సంఖ్య పది శాతం తగ్గి 11,370కి దిగివచ్చిందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి ఇటీవల లోక్‌సభకు తెలియజేశారు. రైతుల బలవన్మరణాలకు రుణభారమే కారణమన్నది నిర్వివాదం. 2013లో ప్రతి మూడు గ్రామీణ కుటుంబాల్లో ఒకటి అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఇది 2002 నాటి కన్నా 26.5 శాతం ఎక్కువ. 2013లో ప్రతి రుణగ్రస్త గ్రామీణ కుటుంబం తలసరిన రూ.1.03 లక్షల అప్పు మోస్తోంది. 2013లో మొత్తం గ్రామీణ రుణభారంలో 56 శాతం వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ

రైతన్నల్లో రగులుతున్న ఉద్యమస్ఫూర్తి

బ్యాంకులు, బీమా కంపెనీల ఖాతాల్లోనే ఉంది. రైతులు మిగతా 44 శాతం రుణాలను వడ్డీ వ్యాపారులు, బంధుమిత్రుల నుంచి తీసుకున్నారు. ఇందులోనూ అత్యధిక (28.2 శాతం) రుణాలను వడ్డీ వ్యాపారులే ఇచ్చారు. అప్పులు తేలిగ్గా లభిస్తాయని రైతులు వారి వద్దకు పరుగులు తీస్తున్నారు. గ్రామీణ రుణభారంలో వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల వాటా 25.1 శాతం. సహకార సంఘాలు, బ్యాంకుల వాటా 24.8 శాతం. వ్యవసాయం, అనుబంధ వృత్తుల్లో 2016 మార్చిలో రూ.51,964 కోట్లుగా ఉన్న మొండి బకాయిలు 2017 మార్చికల్లా రూ.62,307 కోట్లకు చేరినట్లు రిజర్వ్‌బ్యాంకు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది 20 శాతం పెరుగుదల.

రెట్టింపు ఆదాయానికి మార్గమేదీ?



రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తానంటూ ప్రధానమంత్రి ఇచ్చిన హామీని ఏ విధంగా నెరవేరుస్తారో కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో వివరించలేదు. అయితే ఇప్పటికీ కనీస మద్దతు ధర తక్కువగానే ఉందని జైట్లీతోపాటు ప్రధాని మోదీ కూడా ఒప్పుకొన్నారు. వ్యవసాయ ధరల మార్కెట్ కమిటీ (ఏపీఎమ్‌సీ) యార్డులు ఇవ్వజూపుతున్న ధర కనీస ధరకన్నా తక్కువైతే, ప్రభుత్వమే ఆ ధరపై పంట కొనుగోలు చేస్తుందని, లేదా మరేదైనా సంస్థ చేత చేయిస్తుందని ఆర్థిక మంత్రి భరోసా ఇచ్చారు. రైతులకు కచ్చితంగా గిట్టుబాటు ధర చెల్లించే యంత్రాంగాన్ని నెలకొల్పే విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో నీతి ఆయోగ్ చర్చిస్తోంది. 2018-19 రబీ సీజనులోనే ఇలాంటి యంత్రాగాన్ని రంగంలో దించాలి.

వాతావరణ మార్పులవల్ల తరచూ పంట వైఫల్యాలు సంభవించి గ్రామీణ ఆదాయాలు పడిపోవడం వల్ల మొండి బకాయిలూ పైకెగబాకుతున్నాయి.

మద్దతు ధర కీలకం

భారత వ్యవసాయ విధానం ఇంతకాలం పంట దిగుబడి పెంచడం మీదే శ్రద్ధ పెట్టింది తప్ప రైతుల ఆదాయాలు ఇనుమడింపజేయడానికి ప్రాధాన్యమివ్వలేదు. దేశంలో పప్పు, నూనె గింజల దిగుబడి భారీగా వృద్ధి చెందడంతో వాటి దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం ఇటీవల హెచ్చించినా, అది ఆలస్యంగా తీసుకున్న చర్యేనని చెప్పాలి. కొంతకాలం క్రితం ఉల్లిపాయల ధరలు ఆకస్మికంగా పెరిగి ప్రభుత్వాన్ని చిక్కుల్లోకి నెట్టడంతో, ఇటువంటి ఆహార పంటల ధరల నియంత్రణకు ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి ఎంతో ప్రాముఖ్యమిస్తోంది. కనీస మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు పెంచడంతోపాటు ప్రభుత్వమే మొత్తం పంటను సేకరిస్తుందని ఇంతకుముందు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. అన్ని ఖరీఫ్ పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం ఎక్కువ కలిపి కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని 2018 బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. కానీ, ఇక్కడో మెలిక ఉంది. పంట ఉత్పత్తి వ్యయాన్ని లెక్కించేటప్పుడు అందులో రైతు శ్రమ విలువను చేర్చకపోవడం పెద్ద లోపం. 2017-18 ఖరీఫ్ సీజనులో రైతులు ఎమ్ఎస్‌పీకన్నా తక్కువ ధరకు పంటలు అమ్ముకోవలసి రావడంతో వారికి రూ.32,702 కోట్ల నష్టం వాటిల్లింది. ప్రస్తుత రబీ సీజనులోనూ రైతుల నుంచి పంటల సేకరణ మందకొడిగా సాగుతోంది. ఎమ్ఎస్‌పీ అమలులో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం లోపించింది. అసలు ఎమ్ఎస్‌పీని చెల్లించాల్సిన బాధ్యత ఎవరిదనే అంశంపైన రెండింటి మధ్య ఏకాభిప్రాయం లేదు. వ్యవసాయాన్ని రాష్ట్ర జాబితా నుంచి తొలగించి ఉమ్మడి జాబితాలో చేర్చాలనేవారూ ఉన్నారు.

వ్యవసాయానికి సంస్థాగత రుణాలను ఇప్పుడున్న రూ.10 లక్షల కోట్ల నుంచి రూ.11 లక్షల కోట్లకు పెంచుతామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. గతేడాది చిన్న రైతులకు 26 శాతం వ్యవసాయ రుణాలే ముట్టగా, కౌలు రైతులకు ఒక శాతం రుణాలైనా దక్కలేదు. 74 శాతం రుణాలు వ్యవసాయ ప్రాసెసింగ్, వ్యవసాయ రిటైల్ తదితర అనుబంధ రంగాలకు మళ్లాయి. రైతు రుణమాఫీ చాలా లోపభూయిష్టంగా తయారైంది. ఇక్కడ బ్యాంకు రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయన్నది వాస్తవం. రైతులు వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకునే రుణాలే అత్యధికం కాబట్టి వాటికి మాఫీ వర్తించదు. మాఫీ వల్ల రుణాలు సక్రమంగా తీర్చివేయాలన్న స్పృహ రైతులకు లోపించి, బాధ్యతారాహిత్యం పెరుగుతుందని కొందరు పండితులు వాదించినా వాస్తవం వేరుగా ఉంది. ఈ దేశంలో కౌలు చట్టబద్ధం కాదు. కాబట్టి కౌలు రైతులకు బ్యాంకు రుణాలు లభించవు. అలాంటప్పుడు అవి మాఫీ అయ్యే ప్రసక్తి ఎక్కడ? అందుకే రైతుల పట్ల ప్రభుత్వ యంత్రాంగం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మహారాష్ట్ర రైతులు ఇటీవల పాదయాత్ర జరిపారు.

పట్టణాలకే ప్రాధాన్యం

నేడు గ్రామీణ యువత తీవ్ర నిరుద్యోగ సమస్యతో సతమతమవుతోంది. ప్రభుత్వం నగరాల్లో మెట్రో రైళ్లు, పై వంతెనల నిర్మాణంపై చూపుతున్నంత శ్రద్ధ, గ్రామాల్లో విద్యావైద్య ఉపాధి సౌకర్యాలు కల్పించడంపై చూపడం లేదు. వ్యవసాయోత్పత్తుల గ్రేడింగ్, నిల్వ సౌకర్యాలను విస్తరించడానికి ప్రాధాన్యమివ్వడం లేదు. నగరాల్లోని పరిశ్రమలకు రుణాలను ప్రవహింపజేస్తోందే తప్ప గ్రామాలను, వ్యవసాయాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో పల్లె జనం పట్టణాలకు పోలోమంటూ వలసపోతున్నారు. దీన్నిబట్టి పట్టణాలకు చౌకగా శ్రమశక్తి, పాలూ వ్యవసాయోత్పత్తులు లభించేలా చూడటం ప్రభుత్వ విధానమని స్పష్టమవుతోంది. రైతు అన్ని విధాల అన్యాయమైపోతుండటం వల్లే నేడు అనేక రాష్ట్రాల్లో వ్యవసాయదారులు ఉద్యమ పథం పడుతున్నారు. వీరిలో అన్ని కులాలవారూ ఉన్నారు. ఈ ఉద్యమాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటోంది. కొన్ని రాష్ట్రాల్లో రుణమాఫీ కోసం, మరికొన్నింటిలో రిజర్వేషన్ల కోసం, పలు రాష్ట్రాల్లో గిట్టుబాటు ధరల కోసం ఉద్యమాలు నడుస్తున్నాయి. వీటన్నింటినీ కలిపే అంతస్సూత్రం- రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టనష్టాలే. అయితే, ఈ ఉద్యమాలను అనుసంధానించే రాజకీయ వ్యూహం, యంత్రాంగం కొరవడటం పెద్దలోపం. కేరళ దీనికి మినహాయింపు. ఆ రాష్ట్ర రైతుల్లో చైతన్యం, అవగాహన ఎక్కువ. వారు గ్రామస్థాయి నుంచి సంఘటితమై ప్రభుత్వ విభాగాలు, బీమా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, వ్యవసాయ మార్కెట్ యార్డుల నుంచి తమకు కావలసిన సేవలను డిమాండ్ చేసి సాధించుకోగలుగుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ పరిస్థితి కనిపించదు. ప్రతి రాజకీయ పార్టీకి రైతు విభాగాలు ఉన్నా అవి గ్రామీణులకు సమర్థ సేవలు అందించడం లేదు. రాష్ట్రాలు ఇకనైనా రైతుల్లో ప్రజాతంత్ర నాయకత్వ సత్తాను పెంపొందించాలి. తద్వారా తమ సమస్యలు తామే పరిష్కరించుకునేలా సమాయత్తం చేయాలి. వారికి సొంత రాజకీయ వేదిక ఏర్పడాలి. రైతు సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించకపోతే ప్రస్తుత ప్రభుత్వాలకు తీవ్ర సవాలు ఎదురవడం ఖాయం!

(రచయిత- 'సెస్'లో ఆచార్యులు)

రాజకీయ ప్రదక్షిణలు

'దేవుడనేవాడున్నాడా' అని మనిషికి కలిగిన సందేహం పటాపంచలైంది. దేవుడి దేహం కనిపించకపోతేనేం, దేవుడు కనిపించలేదని ఇకముందు ఎవ్వరికీ సందేహం కలగదు గాక కలగదు. చివరకు కరడుగట్టిన నాస్తికుడైనా కళ్లముందు 'దేవుడి ప్రభావం' కనిపిస్తుంటే ఎలా కాదనగలడు? రాజకీయనాయకులకు దేవుడు కనిపిస్తున్నాడు. రాజకీయ వాతావరణం, రణం మారిపోయింది. జనం 'రాజకీయమో రామచంద్రా, అభివృద్ధో లక్ష్మణా' అంటున్నారు.

'రాజకీయ భూమి' తన చుట్టూ తాను తిరగకున్నా, దేవుడి చుట్టూ తెగ తిరుగుతోంది. దేవుడి గుండె రాజకీయ గొంతుకలో వినిపిస్తోంది. ఇందుకు అడుగుజాడ ఎన్టీఆర్‌ది. తిరుమలలోని టీటీడీకి వెంకటేశ్వరస్వామే అధ్యక్షుడని, తాను ఉపాధ్యక్షుణ్ని అని ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్టీఆర్ ప్రకటించి సంచలనం సృష్టించారు. వెంకన్న ఏమిటి, పదవిని నిర్వహించడం ఏమిటి అనుకున్నా- దేవతా పాత్రల్ని ఎన్టీఆర్‌లో చూసుకోవడం అలవాటైన తెలుగు ప్రజలు సర్దుకుపోయారు. దాని సంగతేమైనా, ఇప్పుడు దేవుడు నేరుగా రాజకీయాల్లోకి వచ్చేశాడు.

'ఏడుకొండల స్వామీ!
ఎక్కడున్నావయ్యా
ఎన్ని మెట్లెక్కినా
కానరావేమయ్యా' అని ఇప్పుడు వెతకాల్సిన అవసరమే లేదు.

అంతేకాదు-
'నను బ్రోవమని చెప్పవే
సీతమ్మ తల్లీ
నను బ్రోవమని చెప్పవే' అని భక్త రామదాసు లాగా సీతమ్మను సైతం సిఫార్సు అడగాల్సిన అవసరమూ లేదు. నాయకులూ దేవుడి నామజపం చేసేస్తున్నారు. దేవుడూ సహకరిస్తున్నాడు.

నాయకులతో మాట్లాడేస్తున్నాడు. ఇవి గాలి మాటలేం కావు. విధాన నిర్ణయాలు. ఈ విషయంలో దేవుణ్ని శంకించాల్సిన అవసరమూ లేదు. ఇందుకు 'ప్రత్యక్ష' ఉదాహరణలున్నాయి. దేవుడు ఏ అనుభవమూ అర్హతా లేకుండానే జగన్నాటక సూత్రధారి అనిపించుకున్నాడా, అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు అనిపించుకున్నాడా? తేరగా వచ్చే బిరుదులా ఇవి?

రాజకీయనాయకులు అచ్చంగా దేవుడికి దూతలైపోయారు. ఆన్‌లైన్‌లో కన్నా వేగంగా ఆయనతో సంప్రతింపులు జరుపుతున్నారు. ఆమధ్య రాజకీయ తీర్థం పుచ్చుకుని రాజకీయరంగ ప్రవేశం చేసిన 'పవర్ స్టార్' పవన్ కల్యాణ్ ఒక సభలో ఇలా మాట్లాడేశారు... '2019 సంవత్సరంలో రానున్న ఎన్నికల్లో డబ్బు తీసుకుందామని మీరు అనుకుంటే తీసుకోండి. దేవుడి మీద ఒట్టు వేయమన్నా వేయండి. ఓటు మాత్రం 'జనసేన'కే వేయండి. దేవుడు ఎలాగూ వాళ్లను క్షమించడు. మీకు ఏమీ ఫర్వాలేదు. అవసరమైతే దేవుడితో నేను మాట్లాడతాను...' అని ఆయన చెప్పేశారు. ఈ దెబ్బకు అన్నీ ఎదురుచూపులే. బెదురుచూపులుండవు.

దేవుడిమీదే భారం వేయడం తాజా రాజకీయ పరిణామం. ఏ రాష్ట్రమేగినా ఎందుకాలిడినా ఇది కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. తమిళనాట కూడా 'దేవుడు' తన తడాఖా చూపించేస్తున్నాడు. ఈమధ్య రాజకీయ రంగస్థలం మీద 'అరంగేట్రం' చేసిన చలనచిత్ర 'సూపర్ స్టార్' రజనీకాంత్ ఆధ్యాత్మిక రాజకీయాల గురించి చెప్పి ఊరూవాడా ఊరించేస్తున్నారు. 'ఇదే నీతివంతమైన పాలన' అంటున్నారు. ఆయన మహిమాలయాలైన హిమాలయాలకీ వెళ్లివచ్చారు.

'23 ఏళ్ల కిందటే కుర్చీ నన్ను వెతుక్కుంటూ వచ్చినా, వద్దు పొమ్మన్నాను. అప్పుడు నాకు 45 ఏళ్లు. ఇప్పుడేమో 68 ఏళ్లు. అప్పుడు లేని పదవీ వ్యామోహం ఈ వయసులో నాకు వస్తుందా, ఆధ్యాత్మికవేత్త అనిపించుకునే అర్హత నాకు లేదా?



తమిళనాడులో రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయి. అందుకే ఆధ్యాత్మిక రాజకీయాలు అవసరం' అని రజనీకాంత్ అంటుంటే 'ఔను నిజం... ఔను నిజం... నీవన్నది నిజం నిజం' అని ఆయన అభిమాన జనసందోహం సందేహం లేకుండా చెబుతున్నారు.

ఇంతకీ దేవుడి రాజకీయాలు ఎలా ఉంటాయన్నది ఎవరి శక్తికొద్దీ... కాదు...కాదు భక్తికొద్దీ వారు ఊహించుకోవాల్సిందే, వ్యూహించుకోవాల్సిందే. దేవుడే రాజకీయ పాత్ర పోషిస్తున్నప్పుడు, ఆయన గురించి దిగులుపడాల్సిందే తప్ప రాజకీయ నాయకుల గురించి ఆలోచించాల్సిన అవసరమే లేదు. వారు చాంద్రమానంలోనైనా, సౌరమానంలోనైనా వారి మానాన వారు పోతుంటారు. జరగరానిదేదైనా జరిగితే ఎవరి పాపాన వారు పోతారని ధీమాగా ఉండొచ్చు. అదే బీమా. కేసులు, విచారణలు, శిక్షలు అవసరమే లేదు. ఒక తప్పునకు భూమ్మీద జైలు శిక్షలు, నరకంలో శిక్షలు సహజ న్యాయానికి విరుద్ధం. అంతా పైవాడే చూసుకుంటాడు. 'చిత్రగుప్తుల గాలం' తలచుకుంటే భూమ్మీద 'గుప్తుల కాలం' టకటకా వచ్చేస్తుంది. అంతకన్నా ఏం కావాలి?

చిత్రమేమిటంటే దేవుడికన్నా ముందే ఆధ్యాత్మిక పదజాలం 'అర్థం మార్చుకుని' రాజకీయాల్లోకి వచ్చేసింది. పరమ పవిత్ర దేవతా సన్నిధానమైన పట్టణం పేరు 'కుంభకోణం' అక్రమాలకు పర్యాయపదమైపోయింది. గుడిలో తప్ప, దానికి సంబంధించిన వార్తల్లో తప్ప, మీడియాలో ఎక్కడ 'గోవిందా' అని కనిపించినా, వినిపించినా జనం అపార్థం చేసుకుంటున్నారు. ముడుపులు, భజన, ధ్వజమెత్తడం, ప్రదక్షిణలు, అక్షింతలు, మొక్కుబడి, శఠగోపం, కైంకర్యం వంటివి పవిత్ర ఆధ్యాత్మిక శబ్దాలు. కాలక్రమంలో అవి రాజకీయ విమర్శనాత్మక శబ్దాలుగా రూపుదిద్దుకున్నాయి. ఇంతకాలం దేవుడు రాజకీయాల్లో లేకపోవడం వల్ల, వాటికి ఆయన నుంచి ఖండనలు రాలేదు. ఇక ముందైనా దేవుడు కళ్లు తెరిచి ఖండిస్తాడేమో చూడాలి. జీవుడికే కాదు... దేవుడికీ న్యాయం జరగాలి కదా?

జీవుడి సుత్తికి రెండు వైపులా పదునే. దేవుడు గెలిస్తేనేమో, దేవుడు కాబట్టి గెలిచాడులే అనొచ్చు. పొరపాటున దేవుడు ఓడిపోతేనేమో, ఓటరు దేవుణ్ని గెలిచాడని మాట్లాడొచ్చు. దేవుడి కష్టాలు దేవుడివి. జీవుడికి ఉన్న మార్గం ఆయనకు లేదు. 'నీవే తప్ప ఇతః పరం బెరుగ' అని పాడుకునే అవకాశం జీవుడికి ఉంది. అది దేవుడికి లేదుగా?

పాపం దేవుడు!

– శంభు

ఈనాడు లేఖలు

చూచిరాతల్ని అరికట్టాలి

పదో తరగతి పరీక్షల్లో చూచిరాతలు ఆగడం లేదు. ఏదో విధంగా ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకోవాలన్న కొన్ని పాఠశాలల యావ, దానికితోడు సిబ్బందే అక్రమాలకు పాల్పడుతుండటం గమనార్హం. గతంలో సరైన ఫలితాలు రాని స్కూళ్లకు, తక్కువ శాతం కృతార్థత పొందినవాటికి విద్యాశాఖ అధికారులు నోటీసులిచ్చారు. ఫలితాల శాతం పెరగకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలలు పరీక్షల నిర్వహణలో అనుచిత వ్యవహారాలకు పాల్పడుతున్నాయి. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల అమరిక పట్ల అధికారులూ కనీస శ్రద్ధ వహించడం లేదు. ప్రభుత్వం ముఖ్యంగా సంబంధిత ప్రైవేటు పాఠశాలలపై నియంత్రణ పెంచాలి. అక్రమాలకు తెరతీస్తున్నవాటిపై ఉక్కుపాదం మోపాలి. అంతటా నిఘా ఉంచడం వల్లనే, చూచిరాతలకు అడ్డుకట్ట పడుతుంది.

- పొడిశెట్టి సత్యనారాయణ, భీమారం, వరంగల్ అర్బన్

అడుగంటుతున్న భూగర్భ జలాలు

వ్యవసాయ పనులకు ప్రభుత్వం అనేక గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తోంది. దీన్ని సంస్కరణల్లో భాగంగా అభివర్ణిస్తోంది. కానీ కొన్ని ప్రాంతాల్లో అవసరం లేకున్నా విద్యుత్ మోటార్లు నడవటం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆ యంత్రాలు నిరంతరం పనిచేస్తున్న కారణంగా, భూగర్భ జలాలు తగ్గిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. మరికొన్ని చోట్ల జలాలు పూర్తిగా అడుగంటుతున్నాయని, అందుకు మూలం మోటార్ల అధిక వినియోగమేనని సంబంధిత శాఖలు చెబుతున్నాయి. పంటల అవసరాల మేరకే విద్యుచ్ఛక్తిని రైతులు వాడుకొనేలా తగినంత అవగాహన కలిగించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.

- ఎం.భాస్కర్, దేశాయిపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా

అత్యాశ... దురాశ

మనిషి ఆశాజీవి. అది అతడి సహజ లక్షణం, అవసరం. ఆశ లేకుంటే, సంకల్పం కలగదు. అది లేనిదే ప్రయత్నం మొదలు కాదు. ప్రయత్నంపైనే కార్యసాఫల్యం ఆధారపడి ఉంది. కార్యశీలి కాని మనిషి మనిషే కాడు.

సంపద, ఆరోగ్యం, పదవి, అధికారం, నాయకత్వం, కీర్తి- ఏదో ఒకటి అతడు ఆశిస్తుంటాడు. పొందగలిగినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మరో అడుగు ముందుకేస్తాడు. ఇంకా ఎంతెంతో సాధించాలనుకుంటాడు. సంతృప్తి కలగదు. మాన్యుల్లో ఆశ ఆశయంగా మారి, సమాజ శ్రేయస్సుకు కారణమవుతుంది. సామాన్యుల సంగతి వేరు.

ఒక ఆశ పుట్టిందంటే, మానవుడు అంతటితో సంతృప్తి చెందడు. లభించిన వైభవం, సుఖశాంతులు చాలని అనుకోడు. ఇంకా ఏదో కావాలన్న తపన, ఆవేదన, నిరీక్షణతో సతమతమవుతుంటాడు. పొయ్యిలో ఒక్కో కర్ర పెడుతున్నకొద్దీ మంట పెరుగుతుంటుంది. అలాగే అతడి కోరికలు, ఆశలు తీరినా మనసులో కొత్తవి ఊరుతూనే ఉంటాయి. అప్పుడే ఆశ అత్యాశగా మారి, మనిషిని అధఃపాతాళం వైపు తీసుకెళుతుంది. ఆశ తృష్ణగా మారిందంటే, బతుకు పెడదారి పట్టిందన్నమాటే!

అత్యాశ వైపు మనిషి చిత్రమైన పరుగు 'భారతం'లోని యక్ష ప్రశ్నల్లో కనిపిస్తుంది. ఇంద్రుడు తన పదవి నిలబెట్టుకునేందుకు ఎందరో రుషుల తపస్సును భంగం చేయడానికీ వెనకాడలేదు. ధర్మమా, అధర్మమా అనే యోచనను అత్యాశ చెరిపివేసింది. స్త్రీ సౌందర్యానికి ప్రలోభం చెంది సుందోపసుందులు ఒకరినొకరు హతమార్చుకుంటారు. అమృతాన్ని సంగ్రహించాలన్న అత్యాశకు పోయి రాహుకేతువులు అంతరిస్తారు. అత్యాశ దురాశగా మారిందంటే, ఎదుటివాడికి ఎంతటి హాని చేయడానికైనా మనిషి సిద్ధపడతాడు. ఎంతమంది సర్వనాశనమైనా, తానే విశ్వవిజేత కావాలన్న దురాశకు అలెగ్జాండర్ దాసుడయ్యాడు. అతడి బతుకు ఎలా ముగిసిందో అందరికీ తెలిసిందే. దురాశకు లోబడినవాడు ఎంతటి ఘాతుకానికైనా సందేహించడు. రావణుడు, దుర్యోధనుడు, హిరణ్యకశిపుడు, బలిచక్రవర్తి, విశ్వామిత్రుడి చరిత్రలే అందుకు ఉదాహరణలు.

అత్యాశ అశాంతినిస్తుంది. దురాశ దుఃఖాన్ని, విధ్వంసాన్ని కలిగిస్తుంది. అతి సంశయేచ్ఛ అనర్థానికి దారితీస్తుందని 'నీతి చంద్రిక'లోని 'మిత్రలాభం'లో నక్క కథ వివరిస్తుంది. ఆహారం కోసం అన్వేషిస్తున్న దానికి ఒకేచోట చనిపోయి పడిఉన్న అడవి పంది, పాము కనిపిస్తాయి. బోయవాడి శవమూ కంటపడుతుంది. వాటన్నింటినీ కొంచెం కొంచెంగా తింటూ హాయిగా బతకవచ్చని నక్క అనుకుంటుంది. అంతలో దానికి బోయవాడి విల్లు కూడా కనిపిస్తుంది. ఆ వింటికి కట్టిన నారి- ఒక జంతువుకు చెందిన నరం. ముందు నరాన్ని తినాలనుకున్న నక్క, ఆ వింటి మొదలును కాలితో తొక్కిపడుతుంది. పైచివరను నోట పట్టుకొని, నరాన్ని కొరుకుతుంది. అది తెగటంతో, వింటిబద్ద నోటిలోకి చొచ్చుకుపోయి నక్క చనిపోతుంది. లోభిత్వం, దురాశ ఎంతటి వినాశనాన్ని తెచ్చిపెడతాయో స్పష్టం చేస్తుందా కథ!


అంతర్యామి

'తృష్ణారాహిత్యమనే సద్బుద్ధిని మనిషి అలవరచుకోవాలి. తాను పడే శ్రమకు ధర్మబద్ధంగా ఏ ప్రతిఫలం లభిస్తుందో, దానితోనే సంతృప్తి చెందాలి. అత్యాశను, దురాశను వదిలిపెట్టాలి' అని జగద్గురువు ఆదిశంకరులు ప్రబోధించారు.

పవిత్ర సంకల్పబలం, అత్యాశారహితమైన కృషి, దురాశారహిత ప్రవర్తనను బట్టి ఫలితం లభిస్తుంది. సంకల్పమైనా, ఆశయమైనా ధర్మబద్ధంగా ఉండాలి. అంతవరకు మానవ జీవన ప్రస్థానం విజయవంతంగా సాగుతుంది. ధర్మరహితంగా అతడు ఏదీ ఆశించకూడదు. అప్పుడు విజయపరంపర అతణ్ని వీడదు. కోరికలు, ఆశల్ని తగ్గించుకున్నవాడే 'సంతృప్తి' అనే సంపదను పెంచుకుంటాడు. నలుగురి మెప్పు సంపాదిస్తాడు. వ్యసనాలు దురాశ కలిగిస్తాయి. అవి అనంతమైనప్పుడు, మనిషిని అన్నివిధాలా అధముణ్ని చేస్తాయి.

ఆశను అంతవరకే ఉంచాలి తప్ప, మృత్యుపాశంగా మార్చుకోకూడదు. ప్రమిదలోని వత్తి లాంటిది ఆశ. తగినంత తైలం పోస్తేనే వెలుగునిస్తుంది. వత్తి మునిగేలా నూనె పోస్తే, దీపం కొండెక్కి చివరికి చీకటే మిగులుతుంది. సదాశయం లేని ఆశ- వాసన లేని పువ్వు వంటిది. మనిషికి అది అనవసరం!

– చిమ్మపూడి శ్రీరామమూర్తి

కార్తీ చిదంబరంనకు బెయిల్ మంజూరు

- **రూ. 10 లక్షల పూచీకత్తుతో..**

దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంనకు దిల్లీ హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో కార్తీని ఫిబ్రవరి 28న సీబీఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం అతనికి విధించిన 12 రోజుల జ్యుడీషియల్ కస్టడీ శనివారంతో ముగుస్తున్న నేపథ్యంలో బెయిల్ మంజూరైంది. ఈమేరకు కార్తీ రూ. 10 లక్షల పూచీకత్తు సమర్పించాలని.. దేశం విడిచి వెళ్లాలంటే సీబీఐ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని.. తదితర షరతులను జస్టిస్ ఎస్.పి.గార్గ్ విధించారు. అలాగే కేసుకు సంబంధించిన సాక్ష్యాలు వేటినీ నాశనం చేయరాదని న్యాయస్థానం ఆదేశించింది. కాగా ఇప్పటికే కార్తీ సాక్ష్యాలను నాశనం చేశారంటూ.. అతని బెయిల్ అభ్యర్థనను సీబీఐ వ్యతిరేకించింది. ఈ ఆరోపణలను కార్తీ న్యాయవాదులు ఖండించారు. కార్తీ పాస్‌పోర్టును అధికారులకు అందజేసినట్లు ఇప్పటికే న్యాయస్థానానికి నివేదించారు.

ట్రంప్‌తో 10 నెలల బంధం నాది!

- మాజీ 'ప్లేబోయ్' మోడల్ వెల్లడి..

మెలానియాకు క్షమాపణలు

- ఖండించిన అమెరికా అధ్యక్షుడు

లాస్ ఏంజెలిస్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకు గతంలో 10 నెలల పాటు సంబంధాలు నడిచినట్లు మాజీ 'ప్లేబోయ్' మోడల్ మెక్ డౌగల్ వెల్లడించారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ముఖాముఖిలో ఆమె పలు అంశాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్‌నకు క్షమాపణలు కూడా చెప్పారు. "2006లో తొలిసారి మేమిద్దరం కలుసుకున్నాం.. అప్పట్లో ట్రంప్ నాకు కొంత సొమ్ము చెల్లించేందుకు కూడా ప్రయత్నించారు. అయితే ఆ మొత్తాన్ని నేను నిరాకరించాను." అని పేర్కొన్నారు. ట్రంప్‌ను చాలా ఆకర్షణీయమైన వ్యక్తిగా ఆమె పదేపదే అభివర్ణించారు. ఆయన కోసం న్యూయార్క్, న్యూజెర్సీ, కాలిఫోర్నియాలకు వెళ్లిన సంగతులను గుర్తు చేసుకున్నారు. అపరాధభావంతోనే 2007 ఏప్రిల్ నుంచి దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. కాగా డౌగల్‌తో తనకు ఎలాంటి సంబంధాలు లేవంటూ ట్రంప్ ఖండించినట్లు శ్వేతసౌధం తెలిపింది. కొద్ది రోజుల క్రితం లాస్ ఏంజెలిస్‌లో ఓ పత్రికను నడుపుతున్న సంస్థపై డౌగల్ దావా వేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో తమ మధ్య ఉన్న సంబంధాలపై కథనానికి హక్కుల కోసం 1,50,000 డాలర్లు చెల్లించి, దాన్ని ప్రచురించలేదంటూ ఆమె దావా వేశారు.

ఇసుక అక్రమాలు.. దారులు వేనవేలు



నేరుగా గోదావరి నదిలోనే ఇసుక నింపుతున్న దృశ్యం

● వాగులు, నదుల నుంచి రాత్రిళ్లు రవాణా ● అటవీ ప్రాంతాల నుంచి తరలింపు

సుతారపు సోమశేఖర్, న్యూస్‌టుడే యంత్రాంగం

నదులు, ఉపనదులు, వాగులన్న తేడా లేదు. ఇసుక అక్రమాలు సాగుతున్నాయి. కట్టడి చేయడంలో సమన్వయంతో పనిచేస్తున్నామని గనులు, రెవెన్యూ, పోలీసుశాఖలచెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వ్యక్తిగత, స్థానిక అవసరాల పేరుతో అనుమతి పొంది తీసుకెళ్లే ఇసుకలో అక్రమాలు ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి. తనిఖీలు జరిగినప్పుడు అనుమతి పత్రాలు చూపిస్తున్నారు. రెండు వేర్వేరు వాహనాల అనుమతి పత్రాల నెంబర్లను పరిశీలిస్తే.. రెండింటి మధ్య వేల సంఖ్యలో తేడాతో ఈ దందా బయటపడుతోంది. భద్రాద్రి-కొత్తగూడెం, సూర్యాపేట తదితర జిల్లాల్లో ఈ అక్రమాలు ఎక్కువగా సాగుతున్నాయి. గతంలోకంటే ప్రభుత్వానికి ఇసుకపై ఆదాయం పెరిగింది. కేసులు కూడా పెరిగినప్పటికీ కొత్తకొత్త పద్ధతుల్లో అక్రమాలు జరుగుతున్నాయి.

జీపీఎస్ బిగించినా..

ట్రాక్టర్లకు జీపీఎస్ బిగించి అక్రమాల్ని అరికట్టేందుకు మహబూబ్‌నగర్ జిల్లాల్లో అమల్లోకి తెచ్చిన 'పాలమూరు ఇసుక' విధానం కొంతకాలమే ఫలితాలనిచ్చింది. దుందుభి, కోయిల్‌సాగర్, ఊకచెట్టు వాగుల్లో ఏడు ఇసుక రేవుల(రీచ్) నుంచి ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకే ఇసుక తవ్వాలి. కానీ ఇక్కడ అర్ధరాత్రి, తెల్లవారుజామున పెద్దఎత్తున అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

- జనవరి 25న బాలానగర్ మండలం గుండేడులో ఇసుకనింపే పనికివెళ్లి విద్యార్థి మృతి చెందాడు.
- అడ్డాకుల మండలం కందూరు శివారు పెదవాగు.. నుంచి జనవరి 27న ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న 100 ట్రాక్టర్లను స్థానికులు పట్టుకున్నారు.
- మిడ్జిల్ మండల పరిధిలో దుందుభి వాగు నుంచి రాత్రి 11 గంటల నుంచి తెల్ల వారుజాము 4 గంటల వరకు రోజూ 100ట్రాక్టర్ల ఇసుకరవాణా జరుగుతోంది.
- కాళేశ్వరం సమీపంలో అనుమతులు లేకుండానే గోదావరిలో చెన్నూరువైపు తాత్కాలికరహదారి నిర్మించారు.
- తాళ్లగడ్డ అన్నారం క్వారీ నుంచి నిత్యం వందలాది లారీల ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం.
- మహదేవపూర్‌కు సమీపంలోని కుదురుపల్లి, ఎడపల్లి గ్రామాల పరిధిలో 5 ఇసుక క్వారీలున్నాయి. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర భవన నిర్మాణాల కోసం ఇసుకను తరలించేందుకు ఓ క్వారీని కేటాయించారు. ఆయా భవన నిర్మాణాలకు సంబంధించిన చిట్టీల ముసుగులో ఇక్కడ ఇసుక రవాణా కొనసాగుతోంది.
- మహదేవపూర్ నుంచి మేడిగడ్డ ఆనకట్ట వరకు 3 ఇసుక రేవులున్నాయి. అదనంగా రూ.వెయ్యి చెల్లించిన వారికి ఒక్కో బకెట్ ఇసుక అదనంగా వేస్తున్నారు. గోదావరి నుంచి నిత్యం సగటున 500 లారీల్లో దాదాపు రెండువేల టన్నుల ఇసుక అక్రమంగా వెళుతోందని అంచనా.

- అక్రమాలు అరికట్టేందుకు 'పాలమూరు ఇసుక' విధానాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో అమలుచేస్తున్నారు. జీపీఎస్ బిగించడంతో వాహనాల రాకపోకలపై నిఘా ఉంది. ఇదంతా పగటి సమయంలోనే. చీకటిపడితే చాలు.. దుందుభి వాగు నుంచి అక్రమంగా రవాణా జరుగుతూనే ఉంది.
- మహదేవపూర్ మండలంలోని ఓ ఇసుక క్వారీ నుంచి 8వ తేదీన ఓ లారీ 36 టన్నుల ఇసుకతో వచ్చింది. కాటారం సమీపంలోని వేబ్రిడ్జి వద్ద తూకం వేస్తే అక్కడి సిబ్బంది మాత్రం లారీ సామర్థ్యానికి అనుగుణంగా 32 టన్నుల ఇసుక ఉన్నట్లు రశీదు ఇచ్చారు.



అధిక బరువుతో వెళుతున్న లారీల కారణంగా ధ్వంసమైన రహదారి

లారీల వేగంతో గజగజ

ఎక్కువ ట్రిప్పుల ఇసుక రవాణా కోసం లారీలు వేగంగా వెళుతుండటంతో ఆయా మార్గాల్లోని గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భూపాలపల్లి జిల్లాలో ఇటీవల మూడురోజుల వ్యవధిలోనే ఇద్దరు ఇసుకలారీల కారణంగా మరణించారు. దీంతో జిల్లా యంత్రాంగం రాత్రి 10 నుంచి 6 గంటల వరకే ఇసుక లారీల రవాణాకు అనుమతిని పరిమితం చేసింది.



లారీలు వెళ్లేందుకు గోదావరిలో నిర్మించిన దారి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంలో దాదాపు 20 ఇసుకరేవులున్నాయి. ప్రభుత్వ అనుమతితో ఇసుక క్వారీలు దక్కించుకున్న గుత్తేదారులు మాత్రం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. నిబంధనల ప్రకారం గోదావరి నుంచి ఇసుకను తోడి సమీపంలో నిలువచేయాలి. అందుకు విరుద్ధంగా నదిలోనే భారీ యంత్రాలతో లారీల్లో ఇసుకను నింపుతున్నారు. అక్రమరవాణా కోసం టిప్పర్లను కొనుగోలు చేసి తమ వ్యవహారాన్ని గుట్టుగా నడిపిస్తున్నారు.

అడవుల్లోనూ తవ్వేస్తున్నారు: రేవుల నుంచి తీసుకెళ్లే ఇసుక క్యూబిక్‌మీటర్‌కు రూ.550 చెల్లించాలి. అన్నారం, మరికొన్ని ఇసుకరేవుల పక్కనే అటవీప్రాంతం ఉండటంతో అక్రమార్కులు రేవుల నుంచి కాకుండా పైసా ఖర్చులేకుండా అటవీప్రాంతంలో ఇసుక తవ్వి తీసుకెళుతున్నారు. ఇటీవల 30కిపైగా లారీల్లో ఇసుక తీసుకెళితే.. పది లారీలను పట్టుకుని అటవీశాఖకు అప్పగించారు. అన్నారం బ్యారేజ్ వైపు నుంచి నిత్యం వెయ్యి లారీలకు పైగా ఇసుక వెళుతోందని.. వీటిలో అక్రమమైనవాటిని గుర్తించడం కొంత కష్టమే అయినప్పటికీ, శాఖాపరంగా చర్యలు చేపడతామని అటవీశాఖ అధికారి ఒకరు పేర్కొనడం అక్రమాల తీవ్రతకు నిదర్శనం.

లారీకి పది టన్నుల వరకు అక్రమం

- 12 టైర్ల లారీ సామర్థ్యం 22 టన్నులు. ఇది 13.5 క్యూబిక్‌మీటర్లకు సమానం.
- 14 టైర్ల లారీ సామర్థ్యం 27 టన్నులు.

ఇసుక కావల్సిన వాళ్లు క్యూబిక్‌మీటర్ చొప్పున ప్రభుత్వానికి చెల్లిస్తారు. ఇసుక క్వారీల్లో ఈ మేరకే ఇసుక నింపాలి. దాని ప్రకారమైతే లారీబాడీ భాగం కంటే కాస్త కిందివరకు ఇసుక వస్తుంది. కానీ ఏ లారీని చూసినా బాడీకిపైభాగం వరకు ఇసుకతో వెళుతుంది. రూ.వెయ్యి, రూ.రెండువేలు అదనంగా చెల్లిస్తే చాలు గుత్తేదారులు అదనంగా ఇసుక నింపుతున్నారు. 34-36 టన్నుల వరకు ఇసుకతో లారీలు వెళుతున్నాయి. అంటే.. ఒక్కో లారీలో కనీసం 10 టన్నులకుపైగా అక్రమంగా వెళుతున్నట్లు అంచనా. ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు పరిమితికి మించిన లారీలతో రహదారులు దెబ్బతింటున్నాయి.

ఇసుక లారీకి మరొకరి బలి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వద్ద శుక్రవారం ఇసుక లారీ ఢీకొన్న సంఘటనలో పదిర గ్రామానికి చెందిన గోపన్నగారి లస్మయ్య(52) అనే వ్యక్తి మృతిచెందాడు. అతని భార్య రేణ, కుమారుడు మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. లస్మయ్య ఆరోగ్యం బాగాలేనందున భార్య, కుమారుడుతో కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వస్తుండగా వెంకటాపూర్ వద్ద సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపునకు వెళ్తున్న ఇసుక లారీ ఎదురుగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన లస్మయ్య మృతిచెందాడు. కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డిపేటలో ఆందోళన నిర్వహించి లారీలను బంద్‌చేయాలని డిమాండ్ చేశారు.

వీడిన 'చెక్కు'ముళ్లు!

- మూడు విడతల్లో చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు

ఈనాడు - హైదరాబాద్

రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పెట్టుబడి సాయం చెక్కుల పంపిణీ క్రతువు తుది దశకు చేరుకుంది. 'రైతుబంధు' పథకం కింద ఎకరానికి రూ.4 వేల చొప్పున చెక్కుల పంపిణీకి గానూ 4 వేల గ్రామాల రైతుల సమాచారాన్ని 'జాతీయ సమాచార కేంద్రానికి' (ఎన్ఐసీ) వ్యవసాయశాఖ శుక్రవారం అందజేసింది. ఈ గ్రామాల్లోని ప్రతి రైతు పేరుతో చెక్కును ముద్రించడానికి అనుగుణంగా ఈ సమాచారాన్ని ఇచ్చింది.

రెవెన్యూశాఖ ఇచ్చిన సమాచారమే ప్రాతిపదికగా చెక్‌పై రైతు పేరు, ఏ గ్రామం, జిల్లా వంటి వివరాలను ఎన్ఐసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. తరవాత చెక్‌లు ముద్రించే ముద్రణ కేంద్రానికి పంపుతారు. వచ్చే నెల 19, 30, మే 15వతేదీల్లో మూడు దఫాలుగా చెక్‌లను పంపిణీ చేయాలని ఇప్పటికే వ్యవసాయశాఖ నిర్ణయించింది. తొలి దశలో ఈ 4 వేల గ్రామాల చెక్‌లను ముద్రించనున్నారు. మరో 2, 3 రోజుల్లో మిగతా అన్ని గ్రామాల సమాచారం ఇస్తామని రెవెన్యూ శాఖ తెలిపిన నేపథ్యంలో.. అవి అందగానే వాటినీ ముద్రణకు పంపుతారు.

అక్షర క్రమం ప్రాధాన్యంలో

రాష్ట్రంలోని 60 లక్షల మందికి మే 15కల్లా చెక్కులు అందజేయాలని లక్ష్యం. వీటిని నగదుగా మార్చడానికి రూ.2,400 కోట్లు బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేయాల్సి ఉంటుంది. ఒకేరోజు రాష్ట్రమంతా ఇచ్చేస్తే బ్యాంకులకు నగదు అందజేయడం కష్టమవుతుందని భావించిన ప్రభుత్వం మూడు దఫాలుగా ఇవ్వాలని నిర్ణయించింది. దీని ప్రకారం ప్రతి మండలంలో అక్షర క్రమంలో ముందుండే గ్రామాలలో(ఆంగ్ల అక్షరాలు ఎ, బి) తొలి దశలో చెక్‌ల పంపిణీ ప్రారంభమవుతుంది. ఒక గ్రామంలో ఒకేసారి అందరికీ ఇచ్చేస్తారు. మొత్తం 3 దశల్లో అన్ని గ్రామాలు పూర్తవుతాయి. 25 రోజుల వ్యవధిలో పంపిణీ పూర్తవుతుంది.

వాస్తవ లబ్ధిదారులకే

తొలుత వ్యవసాయ భూములకు 71 లక్షలకుపైగా రెవెన్యూ ఖాతాలున్నట్లు గుర్తించినా వివిధ కారణాలతో వాటిని 60 లక్షలకు తగ్గించారు. అసైన్డ్ భూముల్లో వాస్తవ లబ్ధిదారులు సాగుచేస్తున్న విస్తీర్ణం వివరాలు ఇంకా అందాల్సి ఉంది. ఈ కారణంగా ప్రస్తుతానికి వాస్తవ లబ్ధిదారులకు(ప్రభుత్వం సదరు భూమిని ఎవరి పేరుతో పంపిణీ చేసి ఉంటే) మాత్రమే చెక్కులిస్తారు. సదరు భూమిని ఎవరైనా కొని ఉన్న పక్షంలో వారికి చెక్ రాదని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి 'ఈనాడు'కు చెప్పారు.

ఎక్కడైనా మార్చుకోవచ్చు

మొత్తం ఆరు బ్యాంకులను చెక్‌ల పంపిణీకి ఎంపిక చేశారు. ఒక బ్యాంకు పేరుతో ఇచ్చే చెక్‌ను రాష్ట్రంలో ఆ బ్యాంకుకు సంబంధించిన..ఏ శాఖలోనైనా మార్చుకునేలా ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్య కార్యదర్శి వివరించారు. 'నగదు తీసుకోవడానికి రైతుకు బ్యాంకులో ఖాతా ఉండాల్సిన అవసరం లేదు. ఈ ఆరు బ్యాంకుల్లో వ్యవసాయ కమిషనర్ కార్యాలయం తాజాగా ఖాతాలు తెరిచింది. ఆ ఖాతాల పేరుతో చెక్‌లిస్తారు. ఈ ఖాతాల్లోనే ప్రభుత్వం రూ.2,400 కోట్లు జమచేస్తుంది. చెక్‌ను 90 రోజుల్లోగా నగదుగా మార్చుకోకపోతే మురిగిపోతుంది. గ్రామసభలో చెక్ తీసుకోవడానికి రైతులంతా హాజరుకావాలి. అక్కడికి రానివారు తహసీల్దారు, వ్యవసాయ సహాయ సంచాలకుడి ఆమోదంతో వారంలోగా తీసుకోకపోతే వ్యవసాయ కమిషనర్ కార్యాలయానికి వెనక్కి పంపించేస్తారు.' అని కమిషనర్ వెల్లడించారు.

ఆంధ్రుల మనసుల్లో విషబీజం నాటొద్దు

తెరాస ఎంపీ సీతారాంనాయక్

ఈనాడు, దిల్లీ : తెరాస ఎంపీలను దోషులుగా చూపుతూ ఆంధ్ర ప్రజల మనసుల్లో విషబీజం నాటొద్దని తెరాస ఎంపీ సీతారాంనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం లోక్‌సభ వెల్‌లో తెరాస ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, సీతారాంనాయక్, బూరనర్సయ్యగౌడ్, గొడెం నగేశ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బాల్క సుమన్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డిలు నిరసన కొనసాగించారు. రిజర్వేషన్ల హక్కు రాష్ట్రాలకు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎంపీ సీతారాంనాయక్ మీడియాతో మాట్లాడారు. ఆంధ్ర ప్రజల ముందు తెలంగాణ ఎంపీలను దోషులుగా చూపాలని యత్నించడం సమంజసం కాదన్నారు. ప్రజాప్రయోజనాల కోసం సభ నడవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగంలో ఎస్సీ,ఎస్టీలకు కల్పించిన హక్కులనే తాము అడుతున్నామన్నారు. దేశంలో ఉన్నగిరిజనులతో కేంద్రం ఆడుకుంటోందని విమర్శించారు. సంఖ్యాబలం ఉందన్న అహంకారంతోనే ఇలా చేస్తున్నారని భాజపాపై ఆయన ధ్వజమెత్తారు. ప్రధాని మోదీతో భేటీ కావాలని యత్నిస్తున్నామని.. అనుమతి రావడంలేదని వెల్లడించారు. తమ సమస్యలు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, భాజపా అగ్రనేత అడ్వాణీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ నిరసనలు కొనసాగిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ వేరు తెలంగాణ వేరు కాదన్నారు. ఎవరికి న్యాయం జరగాలన్నా వారితో కలిసి పోరాటం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అవిశ్వాస తీర్మానంపై నిజంగా చర్చ జరగాలని భాజపా భావిస్తే వెల్‌లోకి వచ్చిన వారిని సస్పెండ్ చేయొచ్చుగా అని ఎంపీ సీతారాంనాయక్ వ్యాఖ్యానించారు.

గుబాళించిన గులాబీ సంబురాలు

- తెరాస శ్రేణుల విజయోత్సవాలు
- అభ్యర్థులకు సీఎం, మంత్రుల అభినందనలు

ఈనాడు, హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థుల విజయంపై తెరాస శ్రేణులు పెద్దఎత్తున ఉత్సవాలు చేసుకున్నాయి. ఎన్నికల ఫలితాలను వెల్లడించిన వెంటనే సంబురాలు అంబరాన్ని అంటాయి. శాసన సభ, తెలంగాణభవన్ సహా పలుచోట్ల పెద్దఎత్తున బాణసంచా పేల్చి తెరాస నేతలు, కార్యకర్తలు తమ సంతోషాన్ని చాటుకున్నారు. ఫలితాల అనంతరం అభ్యర్థులు సంతోష్, లింగయ్య, ప్రకాశ్‌లను సభాపతి మధుసూదనాచారి తన కార్యాలయంలో ఘనంగా సత్కరించి, అభినందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు అభినందనలు తెలిపారు. ఫలితాల వెల్లడి అనంతరం శాసనసభ నుంచి అభ్యర్థులు బయటికి రాగానే హర్షధ్వానాలు మిన్నంటాయి. అనంతరం అభ్యర్థులు గన్‌పార్క్ వద్దకు వెళ్లి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. తర్వాత తెలంగాణభవన్‌కు చేరుకున్న వారికి కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు.

విజేతల అంతరంగం: ఫలితాల అనంతరం సంతోష్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ..'కేసీఆర్ మాకు అప్పగించిన బాధ్యతలను సంపూర్ణంగా, చిత్తశుద్ధితో నిర్వహిస్తాం. ఆయనకు మేం జీవితాంతం రుణపడి ఉంటాం. మా గెలుపునకు సహకరించిన ఎమ్మెల్యేలకు కృతజ్ఞతతో ఉంటాం' అని అన్నారు. బండా ప్రకాశ్ మాట్లాడుతూ..'తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని, సామాజిక న్యాయాన్ని దేశం మొత్తం చూస్తోంది. గొర్రెలు, చేపల ద్వారా చేతివృత్తులకు ఆసరా కావడమే కాదు బడుగులకు రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన సీఎం కేసీఆర్‌ను మేం ఎప్పటికీ మరిచిపోం' అని అన్నారు. లింగయ్య యాదవ్ మాట్లాడుతూ..'అట్టడుగు వర్గాలకు టికెట్ ఇచ్చి ప్రోత్సహించిన సీఎం కేసీఆర్ మాకు దైవంతో సమానం. ఆయన అడుగుజాడల్లో మేమూ నడుస్తాం' అన్నారు.



రాజ్యసభ ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం బండ ప్రకాశ్, సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యలను అభినందిస్తున్న సభాపతి మధుసూదనాచారి, మంత్రులు ఈటల రాజేందర్, నాయిని నర్సింహారెడ్డి

సీఎం అభినందనలు: రాజ్యసభ ఎన్నికల్లో గెలిచిన సంతోష్, లింగయ్య, ప్రకాశ్‌లు శుక్రవారం రాత్రి ప్రగతిభవన్‌లో సీఎంను కలిశారు. ఈ సందర్భంగా వారికి సీఎం అభినందనలు తెలిపారు. సీఎంకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. తెరాస బలోపేతానికి, బంగారు తెలంగాణ సాధనకు కృషి చేయాలని ఆయన సూచించారు.

శాసనసభ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు.. మంత్రులు: ఈ సందర్భంగా మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డిలు మాట్లాడుతూ..వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు వస్తాయని, తమ పార్టీ ఘన విజయం సాధిస్తుందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఉన్న ఓట్లను సైతం ఆ పార్టీ వేయించుకోలేని దుస్థితిలో ఉందన్నారు. ఏ మాత్రం బలం లేకపోయినా కాంగ్రెస్ పోటీ చేసిందని, గిరిజన అభ్యర్థిని బరిలో నిలిపి అవమానపరిచిందని నాయిని విమర్శించారు. సీఎం కేసీఆర్ బలహీనవర్గాల ఆశాజ్యోతి అని, ముదిరాజ్‌లకు రాజ్యసభ టికెట్ ఇచ్చి తన సహృదయతను చాటుకున్నారని ఈటల అన్నారు. ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, రసమయి బాలకిషన్‌లు మాట్లాడుతూ.. బీసీలు ఎన్నికల్లో పోటీ చేయడం కాంగ్రెస్‌కు మింగుడు పడలేదని, వారు ఏకగ్రీవంగా గెలవద్దనే దురుద్దేశంతోనే తమ అభ్యర్థిని పోటీకి నిలిపిందని విమర్శించారు.

ముఖ్యమంత్రి ఆహ్వానిస్తే తెరాసలో చేరుతా

- సినీ నటుడు సుమన్ వెల్లడి
- గౌడ జాతికి కేసీఆర్ చేసిన మేలు మరువలేనిదని వ్యాఖ్య



మాట్లాడుతున్న సుమన్

భువనగిరి టౌన్, న్యూస్‌టుడే: రాజకీయంగా ఇంకా నిర్ణయం తీసుకోలేదని.. కేసీఆర్ ఆహ్వానిస్తే తెరాసలో చేరుతానని సినీనటుడు సుమన్ అన్నారు. శుక్రవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ జాతికి కేసీఆర్ చేసిన మేలు మరువలేనిదని పేర్కొన్నారు. ఆయన తమ జాతికి చేసిన సహాయానికి పాదాభివందనం చేస్తున్నానన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి ఏ ముఖ్యమంత్రి తీసుకోని నిర్ణయాలు తీసుకున్నందున.. జాతి మొత్తం ఆయనకు అండగా నిలిచి రుణం తీర్చుకోవాలని ఆకాంక్షించారు. కేసీఆర్ తన నుంచి ఎలాంటి సహాయం పొందాలనుకున్నా.. చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ప్రస్తుతం సినిమా రంగంలో బిజీగా ఉన్నానని, తెలుగు, కన్నడ, ఒరియా, హిందీ, తమిళ సినిమాలు చేస్తున్నానని తెలిపారు.

ట్యాంపరింగ్‌పై 'బార్క్' చర్యలు

- ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: టీవీ ఛానెళ్ల రేటింగ్‌లను ప్రభావితం చేసేందుకు అవకతవకలకు పాల్పడుతున్న వారిపై 'బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చి కౌన్సిల్-ఇండియా (బార్క్)' సంస్థ కొరడా ఝుళిపించింది. టీవీ కార్యక్రమాల వీక్షణ సమాచారాన్ని గుర్తించే బార్-ఓ-మీటర్లను ఏర్పాటు చేసిన గృహాలకు సంబంధించిన సమాచారం విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు బార్క్ నిఘా బృందం గుర్తించింది. దీనిపై ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రాంతంలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై ట్యాంపరింగ్, మోసం, నమ్మకద్రోహం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ట్యాంపరింగ్‌ను అరికట్టేందుకు బార్క్ ఇండియా ఎన్నో ఏళ్లుగా పలురకాల చర్యలు తీసుకుంటోందనీ, అయినా కొంతమంది ఈ తరహా అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారని బార్క్ ఇండియా సీఈవో పార్థో దాస్‌గుప్తా పేర్కొన్నారు. అక్రమ చర్యల్ని అడ్డుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, క్షేత్రస్థాయిలో నిఘా వంటి చర్యలు తీసుకుంటున్నట్లు ఓ ప్రకటనలో వివరించారు.

394 డిగ్రీ కళాశాలల మూత తప్పదు!

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని 394 డిగ్రీ కళాశాలలు మూత పడకతప్పని పరిస్థితి కనిపిస్తోంది. వరుసగా మూడేళ్ల నుంచి 25 శాతంలోపు సీట్లు భర్తీ అయ్యే కళాశాలలను మూసివేయాలన్నది తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయం. దాన్ని అమలు చేసే అధికారం విశ్వవిద్యాలయాలకే ఉండటంతో ఇప్పటికే దానిపై వర్సిటీలకు ఆదేశాలిచ్చారు. మొత్తం 394 కళాశాలల్లో కేవలం 15 శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయి. వాటిల్లోనూ 51 కళాశాలల్లో గతేడాది ఒక్కరూ చేరకపోవడం గమనార్హం. రాష్ట్రంలో దాదాపు 1100 వరకు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. కొన్ని పట్టణాల్లో జూనియర్ కళాశాలల కంటే డిగ్రీ కళాశాలలే అధికం. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4.15 లక్షల డిగ్రీ సీట్లుంటే 2.30 లక్షలు మాత్రమే భర్తీ అవుతున్నాయి.

లేని చేపల చెరువుల పేరిట రూ.226.79 కోట్ల రుణాలు

- హైదరాబాద్, విశాఖపట్నం ఐడీబీఐ బ్రాంచిల్లో రూ.192.98 కోట్లు
- గుంటూరు బ్రాంచిలో రూ.33.81 కోట్లు
- తనఖా పెట్టిన ఇతర ఆస్తులూ తక్కువ విలువవే
- ఇంటి దొంగలతో కలిసి కుచ్చుటోపీ పెట్టిన వైనం
- బ్యాంకు అధికారులతోసహా 42 మందిపై కేసు నమోదు
- రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన హైదరాబాద్ సీబీఐ

ఈనాడు - హైదరాబాద్

చెరువులు లేవు.. చేపలు లేవు.. కానీ, వాటి పేరుతో భారీగా రుణం తీసుకున్నారు. బ్యాంకులు కళ్లు తెరిచేలోపే తీసుకున్న రుణం సొంత ఖర్చులకు వాడేసుకున్నారు. కనీసం తనఖా పెట్టిన ఆస్తులైనా స్వాధీనం చేసుకుందామంటే వాటి విలువ కూడా పెంచి చూపించారని తేలడంతో అధికారులు కంగుతిన్నారు. ఇంటి దొంగల సాయంతో కొందరు ఐడీబీఐకి సంబంధించిన వివిధ బ్యాంకుల్లో మొత్తం రూ.226.79 కోట్లు కొల్లగొట్టారు. బషీరాబాగ్, హబ్సిగూడా, విశాఖపట్నం బ్రాంచిల్లో రూ.192.98 కోట్లు, గుంటూరు బ్రాంచిలో రూ.33.81 కోట్లు కొల్లగొట్టారు. దీనికి సంబంధించి హైదరాబాద్ సీబీఐ అధికారులు శుక్రవారం న్యాయస్థానంలో రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

ఇదీ మోసం..

మొత్తం 22 సంస్థలకు చెందిన 222 మంది కలిసి ఐడీబీఐ బ్యాంకు అధికారులతో కుమ్మక్కయ్యారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, ఆదిలాబాద్ జిల్లాల్లో తమకు చేపల చెరువులు ఉన్నాయని తప్పుడు పత్రాలు సృష్టించారు. బ్యాంకులకు తనఖా పెట్టిన ఆస్తుల విలువ భారీగా పెంచి చూపించారు. ఐడీబీఐ బ్యాంకుకు చెందిన హైదరాబాద్‌లోని బషీరాబాగ్, హబ్సిగూడా, విశాఖపట్నంలోని సిరిపురం, గుంటూరులలోని వ్యవసాయ వాణిజ్య గ్రూప్ (ఏబీజీ) శాఖల నుంచి 2009-10, 2010-11, 2011-12 ఆర్థిక సంవత్సరాలలో పెద్దమొత్తంలో మత్స్యపరిశ్రమ పేరుతో రుణం తీసుకున్నారు. కానీ, ఎంతకాలం గడచినా తీసుకున్న రుణానికి సంబంధించిన వాయిదాలు చెల్లించడంలేదు. గడువు దాటిపోవడంతో తనఖాపెట్టిన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు బ్యాంకు అధికారులు ప్రయత్నించారు. కానీ, రుణం తీసుకునేటప్పుడు చూపించిన ఆస్తులలో చేపల చెరువులు లేవు. అంతేకాదు ఇతర ఆస్తుల విలువ కూడా పెంచి చూపించినట్లు వెల్లడైంది. సంస్థల పేర్లతో తీసుకున్న రుణాన్ని ఆ తర్వాత ఎవరికివారు తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకొని వాడుకున్నట్లు తేలింది. వడ్డీతో కలిపి 2017 సెప్టెంబరు 30 నాటికి ఇది రూ.445.32 కోట్లు అయింది.

ఇంటి దొంగల పనే..

జరిగిన మోసాన్ని గుర్తించిన తర్వాత గత ఏడాది డిసెంబరు 14న హైదరాబాద్‌లోని ఐడీబీఐ బ్యాంకు రీజనల్ హెడ్, జనరల్ మేనేజర్ మంజునాథ్ హైదరాబాద్ సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం సీబీఐ ఎస్పీ వివేక్ దత్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభమైంది. ఐడీబీఐ బ్యాంకు దక్షిణ చెన్నై అప్పటి రీజనల్ హెడ్, జనరల్ మేనేజర్, ప్రస్తుత చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్.దామోదరన్, బషీరాబాగ్‌లోని ఏబీజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ బట్టు రామారావులు నిందితులతో కుమ్మక్కై ఈ కుంభకోణానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. కీలక నిందితుడు బట్టు రామారావును బ్యాంకు విధుల నుంచి తొలగించారు. అతనితోపాటు హబ్సిగూడ, బషీరాబాగ్, విశాఖపట్నం బ్రాంచిలలో కుంభకోణానికి సంబంధించి 31 మందిపై సీబీఐ అధికారులు కేసులు నమోదు చేశారు. వీరిలో విశ్రాంత సీజీఎం ఆర్.దామోదరం, ఆదిలక్ష్మి సంస్థకు చెందిన ముప్పిడి లక్ష్మణరావు, ఎస్.సుధాకర్ గ్రూపునకు చెందిన సమయామంతుల సుధాకర్ తదితరులు ఉన్నారు.

గుంటూరులో..

గుంటూరు ఐడీబీఐ బ్రాంచిలోనూ ఇదే తరహా కుంభకోణం జరిగిందని హైదరాబాద్‌లోని ఐడీబీఐ సహాయ జనరల్ మేనేజర్ ధనుంజయ్ లేలే గత ఏడాది డిసెంబరు 15వ తేదీన సీబీఐ అధికారులకు మరో ఫిర్యాదు చేశారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని వివిధ గ్రామాల్లో తమకు చేపల చెరువులు ఉన్నాయని తప్పుడు పత్రాలు సృష్టించిన 142 మంది రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఐడీబీఐ గుంటూరు బ్రాంచి అప్పటి సహాయ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ హరీష్ చెన్నపగరి వీరితో కుమ్మక్కై 2010-2012 మధ్యకాలంలో మొత్తం రూ.33.81 కోట్ల రుణం మంజూరు చేశాడు. తీసుకున్న రుణం ఎంతకీ తిరిగి చెల్లించకపోవడంతో రుణం కోసం తనఖా పెట్టిన ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు బ్యాంకు అధికారులు రంగంలోకి దిగారు. కానీ, రుణగ్రహీతలు బ్యాంకుకు సమర్పించిన పత్రాల ప్రకారం ఎక్కడా చేపల చెరువులు లేవు. పోనీ ఉన్న ఆస్తులు అమ్ముదామంటే దేనికి కూడా లింకు డాక్యుమెంట్లు లేవు. రుణం తీసుకున్నప్పుడు భూములకు న్యాయసలహా ఇచ్చిన న్యాయవాది ప్రభాకర్‌రావు మాత్రం అన్నీ సరిగానే ఉన్నాయని ధ్రువీకరించారు. తీసుకున్న రుణం వడ్డీతో కలిసి గత ఏడాది సెప్టెంబరు 30 నాటికి రూ.93.73 కోట్లయింది. దీనికి సంబంధించి సీబీఐ అధికారులు బ్యాంకు సహాయ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ హరీష్, న్యాయవాది ప్రభాకర్, వాల్యూవర్ నాగరాజులతోపాటు మొత్తం 11 మందిపై కేసు నమోదు చేశారు.

వంద గంటల ముందే... గుండెపోటు ముప్పును కనిపెట్టొచ్చు

- **ఆవిష్కరణకు రూపమిచ్చిన ఐఐటీ పరిశోధకులు**
- **పరికరాన్ని విపణిలోకి తెచ్చే ప్రయత్నాలు**

ఈనాడు, సంగారెడ్డి: గుండెపోటు సంభవించడానికి వంద గంటల ముందుగానే దాన్ని గుర్తించడానికి వీలయ్యే సాంకేతికతను అభివృద్ధి చేసినట్లు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్ (ఐఐటీ హెచ్)కు చెందిన పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే ప్రొటోటైప్ (నమూనా పరికరం) బయోచిప్‌ను రూపొందించిన వీరు ప్రయోగశాలలో విజయవంతంగా పరీక్షించారు. ఈ పరికరాన్ని విపణిలోకి తెచ్చేందుకు వీలుగా సాయం చేయాలని ఐఐటీ హెచ్ పరిశోధకులు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు నివేదించారు. ఈ ఆవిష్కరణకు వారి ఆమోదముద్ర లభించింది.



ప్రయోగశాలలో బయోచిప్ రూపకల్పన

సహాయ ఆచార్యులు శివగోవింద్ సింగ్ పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థి దుర్గాప్రసాద్ ఈ సాంకేతికతను ఆవిష్కరించారు. ఇక్కడే పీజీ చదువుతున్న సూర్యస్నాత త్రిపాఠి అనే మరో విద్యార్థి తన సహకారాన్ని అందించారు. తీవ్ర అలసట, విపరీతంగా చెమటలు పోయడం లాంటి లక్షణాలు కనిపించడంతో పాటు అధిక రక్తపోటు సంభవించిన సమయంలో ఆ వ్యక్తి రక్తాన్ని తీసుకొని ఈ పరికరంపై ఉంచితే ముందుగానే గుండెపోటును ముప్పును కనిపెట్టి సత్వరం చికిత్స అందించి ప్రాణాలు కాపాడొచ్చని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి తెచ్చేందుకు కృషి



మేం రూపొందించిన ఈ పరికరం గుండెపోటుతో జరిగే మరణాలను తగ్గించడానికి దోహదం చేస్తుంది. దీంతో పరీక్షలు చేయడమూ చాలా సులభం. ఇన్‌ప్రింట్ ద్వారా నిధులు కావాలని కోరాం. ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలెవరైనా ముందుకొచ్చినా సమాజానికి చాలా ప్రయోజనం చేకూరుతుంది.

– శివ్‌గోవింద్ సింగ్,
సహాయ ఆచార్యులు, ఐఐటీహెచ్

చంద్రయాన్-2 ప్రయోగం అక్టోబర్‌కు వాయిదా

చెన్నై: చంద్రుడిపై మరిన్ని పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నిర్వహించ తలపెట్టిన 'చంద్రయాన్-2' అంతరిక్ష ప్రయోగం అక్టోబర్‌కు వాయిదా పడింది. ఏప్రిల్‌లో దీన్ని ప్రయోగించాలని ఇస్రో భావించింది. అయితే నిపుణులు కొన్ని పరీక్షలు చేపట్టాలని సూచించడంతో.. తాజాగా నిర్ణయం మార్చుకుంది. ఈ విషయాన్ని ఇస్రో ఛైర్మన్ కె.శివన్ శుక్రవారం పాత్రికేయులకు వెల్లడించారు. పూర్తిగా దేశీయ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని రూ.800 కోట్ల వ్యయంతో ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపడుతోంది. జీఎస్‌ఎల్‌వీ ద్వారా ఆర్బిటర్, ల్యాండర్, రోవర్‌లను చంద్రుడిపైకి పంపుతోంది. తొలిసారి చంద్రుడి దక్షిణ ధ్రువంలో రోవర్‌ను దింపేందుకు ఇస్రో ప్రయత్నిస్తోంది.

29న జీశాట్-6ఏ ప్రయోగం: జీశాట్-6ఏ ఉపగ్రహాన్ని మార్చి 29న ప్రయోగించనున్నట్లు ఇస్రో ప్రకటించింది. జీఎస్ఎల్‌వీ-ఎఫ్08 ద్వారా దీన్ని ఆకాశంలోకి పంపనున్నట్లు తెలిపింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రంలోని రెండో లాంచ్‌పాడ్ నుంచి ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు.

లోకాయుక్తను ఎందుకు నియమించలేదు?

- **తెలంగాణ సహా 11 రాష్ట్రాలకు సుప్రీం కోర్టు ప్రశ్న**

దిల్లీ: చట్టం అమల్లోకి వచ్చి ఐదేళ్లు గడిచినప్పటికీ లోకాయుక్త, ఉప లోకాయుక్తలను నియమించకపోవడానికి కారణాలు చెప్పాలని తెలంగాణ సహా 11 రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను సుప్రీం కోర్టు శుక్రవారం ప్రశ్నించింది. ఒడిశాలో ఈ సంస్థలు పనిచేస్తున్నాయా లేదో చెప్పాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగింది. తమ ముందున్న వివరాల ప్రకారం తెలంగాణ, జమ్మూకశ్మీర్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పుదుచ్చేరి, తమిళనాడు, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో లోకాయుక్త లేదా ఉపలోకాయుక్తల నియామకం జరగలేదని స్పష్టమవుతున్నట్లు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్.బానుమతితో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. సదరు నియామకాలకు ఈ 11 రాష్ట్రాలు ఏమైనా చర్యలు చేపట్టాయా అని ప్రశ్నించింది. ఒకవేళ చేపడితే అవి ఏ దశలో ఉన్నాయి.. వంటి వివరాలను రెండు వారాల్లోగా తెలియజేయాలని ఆదేశించింది. ఎప్పటిలోగా నియామకాలు చేస్తారో కూడా చెప్పాలంది. దిల్లీకి చెందిన భాజపా నేత, న్యాయవాది అశ్వనీ కుమార్ ఉపాధ్యాయ్ వేసిన ప్రజాహిత వ్యాజ్యంపై వాదనల సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. లోకాయుక్త ఉన్న రాష్ట్రాలు, లేని రాష్ట్రాల వివరాలు కావాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని న్యాయమూర్తులు ప్రశ్నించారు. చాలా రాష్ట్రాలు నియామకం చేయలేదని న్యాయవాది బదులిచ్చారు. "మాకు నిర్దిష్ట సంఖ్య కావాలి. ఇంత తీవ్రత ఉన్న కేసును వాదిస్తున్న న్యాయవాది నుంచి మేం ఆశిస్తున్న సమాధానం ఇది కాదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను వచ్చే నెల 12కు వాయిదా వేసింది. లోకాయుక్తలు సమర్థంగా పనిచేయడానికి వీలుగా సరిపడా బడ్జెట్ కేటాయింపులు, మౌలిక వసతులు సమకూర్చేలా రాష్ట్రాలకు ఆదేశాలివ్వాలంటూ పిటిషనర్ కోరారు. సరైన వసతులు కల్పించకుండా.. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు లోకాయుక్తను ఉద్దేశపూర్వకంగా నీరుగారుస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో లోక్‌పాల్‌ను నియమించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ మునుపటి విచారణ సందర్భంగా ధర్మాసనానికి తెలిపారు.

జీనత్ అమాన్‌పై లైంగికదాడి!.. వ్యాపారవేత్త అరెస్టు

- **రూ.15 కోట్ల మేరకు మోసం చేశారంటూ ఆరోపణ**

ముంబయి: అలనాటి బాలీవుడ్ కథానాయిక జీనత్ అమాన్(68)పై అత్యాచారానికి పాల్పడ్డారనీ, రూ. 15 కోట్ల మేరకు ఆమెను మోసం చేశారన్న ఆరోపణలతో సర్ఫరాజ్ అలియాస్ అమాన్ ఖన్నా(38) అనే వ్యాపారవేత్తను అరెస్టు చేశారు. జీనత్ అమాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు ఖన్నాను గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఆయనను శుక్రవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కేసును క్రైం బ్రాంచ్‌కు అప్పగించారు. ఆమె అమాన్ ఖన్నాపై ఇక్కడి జుహు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాస్తవానికి ఆమె జనవరిలో అతడిపై అసభ్యప్రవర్తన కేసును పెట్టారు. అప్పట్లో అతడిని అరెస్టు చేసి అనంతరం బెయిలుపై విడుదల చేశారు. కాగా, ఆమె తాజాగా గురువారం మరో ఫిర్యాదు దాఖలు చేస్తూ...అతడు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారనీ...ఆస్తి వ్యవహారానికి సంబంధించి రూ.15.40 కోట్ల మేరకు మోసం చేశారనీ ఆరోపించారు. 2001-2015 మధ్య ఈ వ్యవహారం జరిగినట్లు పేర్కొన్నారు.

ఆ భూములు వెనక్కి తీసుకుంటాం

- ఐటీ, ఈడీ శాఖలతో సంప్రదిస్తున్నాం
- ఐటీశాఖ మంత్రి కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్



తెలంగాణలో జెమ్స్ అండ్ జ్యువెల్లర్స్ పార్కుకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఐటీశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. పార్కుకు కేటాయించిన భూముల్లో 95 ఎకరాలు నీరవ్ మోదీ కంపెనీ పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయని పేర్కొన్నారు. ఈ భూములను ఈడీ, ఐటీ శాఖలు అటాచ్ చేశాయని, ఆయా శాఖలతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. హైదరాబాద్ నగరానికి తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిక్కుల్లో ఐటీ పార్కులు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగానే బుద్వేల్ ఐటీ పార్కుకు ప్రాథమికంగా ఆమోదం తెలిపామని శాసనమండలిలో వెల్లడించారు. "తెలంగాణ ఏర్పాటైన తరువాత 46 వేల ఎకరాలతో 53 పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేశాం, వీటిలో 26 పార్కులు కార్యకలాపాలు ప్రారంభించాయి. భూములు తీసుకుని పనులు చేపట్టని సంస్థల నుంచి వెనక్కి తీసుకోనున్నాం. ఇప్పటికే బ్రాహ్మణి, ఇందూటెక్ లాంటి 14 కంపెనీల నుంచి 1035 ఎకరాలు స్వాధీనం చేసుకుని, అర్హత కలిగిన ఇతర కంపెనీలకు కేటాయించేందుకు పరిశీలిస్తున్నాం." అని కేటీఆర్ చెప్పారు.

అన్నీ ఉచితంగా ఇవ్వలేం: జగదీష్‌రెడ్డి

తెలంగాణలో అందరికీ విద్యుత్తు ఉచితంగా ఇస్తూ వెళ్తే డిస్కమ్‌లు మనుగడ సాగించబోవని విద్యుత్తు శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి తెలిపారు. విద్యుత్తు ఛార్జీల సవరణపై సభ్యులు మాట్లాడిన అంశాలకు సమాధానమిచ్చారు. కొందరు ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా ఇవ్వాలని, ఉచిత పరిధిలోకి మరికొందరిని తీసుకురావాలని అడిగినపుడు అన్నీ ఉచితంగా సాధ్యం కాదన్నారు. గృహ అవసరాలకు విద్యుత్తు ఛార్జీలు పెంచలేదని వివరించారు. వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్తుకు అయ్యే సబ్సిడీని పూర్తిస్థాయిలో అంచనా వేస్తున్నామని ఎంఐఎం ఎమ్మెల్సీ జాఫ్రీ అడిగిన ప్రశ్నకు సమాధంగా చెప్పారు.

ప్రత్యేక సమాఖ్య ఆలోచన లేదు: జోగురామన్న

సంచార జాతుల కోసం ప్రత్యేక సమాఖ్య ఏర్పాటు చేయాలనే ఆలోచన లేదని బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న వెల్లడించారు. భాజపా ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రారావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తెలంగాణలో 36 కులాలు సంచారజాతులుగా ఉన్నాయని, 6.5 లక్షల జనాభా ఉందని మంత్రి తెలిపారు. వీరంతా ఎంబీసీల్లో ఉంటారని వివరించారు. బీసీ కమిషన్ నుంచి నివేదిక వచ్చిన వెంటనే ఎంబీసీల్లో ఏయే కులాలు ఉంటాయో స్పష్టం చేస్తామన్నారు. సంచారజాతుల పిల్లలకు ప్రవేశపరీక్ష లేకుండా 1200 మందికి గురుకులాల్లో ప్రవేశాలు కల్పించామని వెల్లడించారు. తెలంగాణలోని బీసీల్లో కొన్ని కులాలు కేంద్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాలో లేవని.. ఆ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలంటూ నివేదిక పంపించామన్నారు. సంచార జాతుల కోసం ప్రత్యేక సమాఖ్య ఏర్పాటు చేసే ఆలోచన లేదని మంత్రి మండలిలో ప్రకటించినా ఆ ఫెడరేషన్ పేరిట రూ.10 కోట్లు పేర్కొంటూ 2018-19 బడ్జెట్ పద్దులో పొందుపరచడం గమనార్హం.

రూ.100 కోట్లతో గండిపేట చెరువు అభివృద్ధి

- వారాంతపు ఆహ్లాద కేంద్రంగా మారుస్తాం
- జులైకల్లా ఎల్‌బీనగర్- అమీర్‌పేట మెట్రో ప్రారంభం
- శాసనసభలో మంత్రి కేటీఆర్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్ : గండిపేట చెరువు నీళ్లు తాగితే బాగుపడతారని చెబుతారు.. ఈ చెరువు తవ్వి 2020 నాటికి వందేళ్లవుతున్న సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తామని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. చెరువు చుట్టూ 46 కిలోమీటర్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేసి నగరవాసులకు వారాంతపు ఆహ్లాద కేంద్రం (వీకెండ్ డెస్టినేషన్)గా మారుస్తామన్నారు. పురపాలక శాఖ పద్దులపై శుక్రవారం శాసనసభలో జరిగిన చర్చలో కేటీఆర్ సమాధానమిచ్చారు. 'ఎల్‌బీనగర్- అమీర్‌పేట మెట్రో రైలును ఈ జులైకల్లా ప్రారంభిస్తాం. ఈ ఏడాది చివరినాటికి నాగోల్- హైటెక్‌సిటీ, జూబ్లీ బస్టాండ్- ఎంజీబీఎస్ మార్గాల్లో మెట్రో రైళ్లను ప్రాంభిస్తాం. నగరంలో బస్తీ దవాఖానాలను త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. నగరంలో నిర్మాణ రంగ వ్యర్థాలను శుద్ధి చేసేందుకు 1000 టన్నుల సామర్థ్యంతో శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తాం. రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. స్వచ్ఛ హైదరాబాద్ పనుల్లో భాగంగా 2,600 టిప్పర్లు ఇస్తాం. జవహర్‌నగర్ డంపింగ్ యార్డును వచ్చే వర్షాకాలంలోగా హరితప్రాంతంగా మారుస్తాం. పురపాలక సంస్థల్లో పౌరసేవా కేంద్రాలను అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేస్తాం. పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధుల సేకరణకు పురపాలక బాండ్లు జారీ చేస్తున్నాం. జీహెచ్ఎంసీ కోసం రూ.1000 కోట్ల సేకరణకు బాండ్లు జారీచేస్తే రెండు గంటల్లోనే అమ్మకాలు జరిగాయి. వీటి ద్వారా 8.9 శాతం వడ్డీకి రూ.200 కోట్లను ఇప్పటికే తీసుకున్నాం. ఆధునిక ప్రమాణాలతో 820 బస్‌షెల్టర్లు నిర్మిస్తున్నాం. నగరానికి కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే నీటిని ఒకచోట కలిపే సమగ్ర సరఫరా వ్యవస్థను నిర్మిస్తున్నాం. భవిష్యత్తులోనూ నగరానికి నీటికొరత రాకుండా ఉండేందుకు ప్రత్యేక రిజర్వాయర్ తవ్విస్తున్నాం. హెచ్ఎండీఏ ఆదాయం రూ.1,062 కోట్లకు పెరిగింది.' అన్నారు.

ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం

ప్రభుత్వం రూ.1,700 కోట్లతో రెండేళ్లుగా గ్రామాల్లో సీసీ రోడ్లను నిర్మిస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ పద్దులపై సభలో ఆయన సమాధానమిచ్చారు. 'మిషన్ భగీరథ పథకం కింద 22 వేల గ్రామాల్లో నీరందిస్తాం. గ్రామాల్లో శ్మశానాల సమస్యలను తీర్చడానికి 4,500 చోట్ల వైకుంఠధామాలు మంజూరు చేయగా 1,201 నిర్మాణాలు ప్రారంభించాం' అన్నారు.

ఉదయ సముద్రంతో లక్ష ఎకరాలకు సాగునీరు



వేగంగా కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పనులు • నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఉదయసముద్రం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దీని పరిధిలో లక్ష ఎకరాల వరకు సాగునీరిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్యేలు వేముల వీరేశం, నల్లమోతు భాస్కర్‌రావు (తెరాస) అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. '2007లోనే ప్రాజెక్టు మంజూరు అయింది. రూ.197 కోట్లు ఖర్చు చేసి బిల్లులు తీసుకున్నా కేవలం మోటార్లు మాత్రమే కొన్నారు. ప్రస్తుతం పనులు చేపట్టాం. ఈ ప్రాజెక్టు ద్వారా 40 చెరువులను నింపుతాం' అని చెప్పారు. మేములవాడ గుడిచెరువును రూ.74 కోట్లతో విస్తరిస్తున్నట్లు ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ ప్రశ్నకు సమాధానమిచ్చారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టుపై ఎమ్మెల్యే ఆళ్ల వెంకటేశ్వరరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. 'కోయిల్‌సాగర్ ఎడమ కాల్వ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. కుడికాల్వ ఆధునికీకరణ అంశం పరిశీలనలో ఉంది. పునరాకృతి ద్వారా కాల్వలను విస్తృతం చేస్తాం. పాలమూరు ఎత్తిపోతల పథకం నుంచి ఒక స్లూయిస్ సదుపాయాన్ని కల్పిస్తే భువనగిరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు ఉపయోగంగా ఉంటుందన్న అంశాన్ని పరిశీలిస్తున్నాం" అన్నారు.

గుడుంబా తయారీ మానేసినవారికి పునరావాసం

గుడుంబా తయారీ నుంచి బయటకు వచ్చినవారి పునరావాసం కోసం 7,886 మందిని గుర్తించాం. ఇప్పటికి 6,180 మంది ఆర్థిక చేయూత కల్పించాం. ఒక్కో కుటుంబానికి పూర్తిగా రాయితీతో రూ.రెండు లక్షలు ఇస్తున్నాం. ఎమ్మెల్యే రాజాసింగ్ కోరినట్లు ధూల్‌పేటలోని అయిదెకరాల విస్తీర్ణంలో పరిశ్రమ పెట్టే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతాం.

- ఎమ్మెల్యేలు రామలింగారెడ్డి, రాజాసింగ్, సతీష్‌కుమార్‌ల ప్రశ్నలకు ఆబ్కారీ మంత్రి పద్మారావు సమాధానం

50 వేల మందికి పునరావాసం కల్పించాలి

అన్ని నియోకవర్గాల్లో గుడుంబా సమస్య ఉంది. మీ లెక్కల ప్రకారం ఆరు వేల మందికి మాత్రమే పునరావాసం కల్పిస్తున్నట్లు అర్థమవుతోంది. కనీసం 50 వేల మందికైనా సాధ్యమైనంత పునరావాసం కల్పించకపోతే గుడుంబా తయారీ మళ్లీ మొదటికొచ్చే ప్రమాదముంది.

- సభాపతి మధుసూదనాచారి

3 వేల ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలు

రాష్ట్రంలో 1,805 ఆలయాలకు ధూప, దీప నైవేద్యాలకు నెలకు రూ.6వేల చొప్పున అందజేస్తున్నాం. మరో 3వేల ఆలయాలకు అందజేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చాం. గిరిజన పూజారులకు సాయమందించే అంశాన్నీ పరిశీలిస్తాం.

- ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, సతీష్‌కుమార్, పుట్టా మధు, ఎం.సుధీర్‌రెడ్డి, రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నలకు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జవాబు

47,121 మంది మహిళలకు ఉపయుక్తం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన 102 వాహన సేవలను ఇప్పటి వరకు 47,121 మంది మహిళలు వినియోగించుకున్నారు. ప్రస్తుతం 241 వాహనాలు నడుపుతున్నాం. ప్రతి మండలానికి వాహనం ఇవ్వటం సాధ్యం కాదు.

- ఎమ్మెల్యేలు అజ్మీరా రేఖ, కోవా లక్ష్మి, బొడిగ శోభ అడిగిన ప్రశ్నలకు మంత్రి లక్ష్మారెడ్డి జవాబు

ప్రాజెక్టులపై కాంగ్రెస్ కుట్రలను ఎండగడతా

- సభలోనే బయటపెట్టాలని ఆధారాలు తెచ్చా: హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తికాకుండా కాంగ్రెస్ నాయకులు ఎలా కుట్రలు చేస్తున్నారు, కోర్టుల్లో ఎవరు కేసులు వేస్తున్నారో పూర్తి సాక్ష్యాధారాలను సభకు తీసుకొచ్చినట్లు నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాస్తవాలు తెలిపి కాంగ్రెస్ నేతలను ప్రజల ముందు ముద్దాయిగా నిలబెట్టడానికి సభకు ఆధారాలు తీసుకొచ్చానన్నారు. కోర్టుల్లో కేసులు వేసి న్యాయవాదులకు ఫీజులు, రాకపోకలకు ఛార్జీలు ఏయే నాయకులు బ్యాంకు ఖాతాలు, కార్డుల ద్వారా చెల్లించారో పూర్తి ఆధారాలు తన దగ్గరున్నాయన్నారు. ఈసారి కాకపోయినా వచ్చే సమావేశాల్లోనైనా వారి బండారం బయటపెడతామన్నారు. 'కాంగ్రెస్ నాయకుడు హర్షవర్దన్ రెడ్డి పాలమూరు ఎత్తిపోతలపై హరిత ట్రైబ్యునల్‌లో కేసు వేశారు. మరోవైపు ఎమ్మెల్యే రాంమ్మోహన్‌రెడ్డి పరిగికి నీళ్లు కావాలని, కాల్వలు తవ్వడం లేదని ధర్నా చేయడం విడ్డూరం. కాంగ్రెస్‌వి ఏం డ్రామాలు, ఎవరిని మోసం చేస్తున్నారు? పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులను కాంగ్రెస్ 55 శాతం పూర్తి చేసి 47 వేల ఎకరాలకే నీరిచ్చింది. మేం మిగిలిన 45 శాతం పూర్తి చేసి ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లిచ్చాం. సిరిసిల్లలో కేకే మహేందర్‌రెడ్డి కాళేశ్వరంపై ఆరు కేసులు వేశారు. దేవరకద్ర కాంగ్రెస్ నాయకుడు పవన్‌కుమార్ హైకోర్టులో కేసు పెట్టారు. ముఖ్యమంత్రి సంకల్పం గొప్పది. రాష్ట్రంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు, చిన్నతరహా నీటిపారుదల కింద కలిపి 1.25 కోట్ల ఎకరాలకు నీళ్లిచ్చి తీరతాం. రాష్ట్రంలో ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ కార్యక్రమాలతో సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగింది. పంటలకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.8 వేలు ఇస్తుండటంతో రైతుల్లో విశ్వాసం పెరిగింది. అందువల్లే ఆత్మహత్యలు 53 శాతానికి తగ్గాయి. ఇది సాక్షాత్తూ కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్ పార్లమెంటు సాక్షిగా ప్రకటించిన విషయం. గోదావరిలో ఏడాది పొడవునా 274 కిలోమీటర్ల మేర నీళ్లు ఉండేలా పాత బ్యారేజీలకు తోడు కొత్తవి ప్రారంభించాం. ప్రాజెక్టుల కింద 3.78 లక్షల ఎకరాల భూసేకరణకుగాను 3.10 లక్షల ఎకరాలు సేకరించాం. పునరాకృతితో సీతారామ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 6.75 లక్షల ఎకరాలకు పెంచాం. ప్రాణహితను తాగునీటి ప్రాజెక్టుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తే మేం దాని కింద ఆదిలాబాద్‌కు నీళ్లిచ్చేలా నిర్మిస్తున్నాం. ముంపు లేకుండా మేడిగడ్డ వద్ద కాళేశ్వరం చేపట్టాం. కేసులు వేసి అడ్డుపడి పైగా ప్రాజెక్టుల నిర్మాణంలో వ్యయం భారీగా పెరిగిందని, అవినీతి జరిగిందని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది. స్టీల్, సిమెంట్, ఇంధన ధరలు పెరగడంతో ఇది సర్వసాధారణం. నాగార్జునసాగర్ ప్రాజెక్టును రూ.122 కోట్లతో ప్రారంభిస్తే పూర్తయ్యేసరికి రూ.1,183 కోట్లకు పెరిగింది. ఎస్సారెస్పీ రూ.4,300 కోట్లకు, జూరాల రూ.1,815 కోట్లకు పెరిగాయి. పులిచింతల, సింగూరు, ఎల్లంపల్లి ప్రాజెక్టులు కూడా పూర్తయ్యేనాటికి అంచనాలు పెరిగాయి' అని హరీశ్ చెప్పారు.

ఏప్రిల్, మే నెలల్లో పాస్‌పుస్తకాల పంపిణీ

- భూదస్త్రాల ప్రక్షాళన 93 శాతం పూర్తి
- త్వరలో రెండో దశ ప్రారంభానికి చర్యలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూదస్త్రాల ప్రక్షాళన 93 శాతం పూర్తయిందని, ఏప్రిల్, మే నెలల్లో కొత్త పాస్‌పుస్తకాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ చెప్పారు. శుక్రవారం శాసనసభ ప్రారంభం కాగానే సభాపతి మధుసూధనాచారి ప్రశ్నోత్తరాలను చేపట్టారు. తెరాస సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రాజెక్టులతో సాగుభూమి గణనీయంగా పెరుగుతోంది.. సీలింగు భూముల పరిధులను పెంచుతారా? అని అడిగారు. గతంలో ఎన్టీఆర్.. పటేల్- పట్వారీ వ్యవస్థలను రద్దు చేసి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని, భూదస్త్రాల ప్రక్షాళనతో ముఖ్యమంత్రి అంతకన్నా సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకున్నారని కొనియాడారు.

ఆ భూముల పరిస్థితి ఏమిటి?

వెబ్‌ల్యాండ్‌లో నమోదుకాని భూదస్త్రాల ప్రక్షాళనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఒకే సర్వే నంబరులో వేల ఎకరాలున్నవి, కాందిశీకుల భూముల పరిస్థితి ఏమిటి? తెల్లకాగితాలపై రాసుకున్న భూముల పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకునేందుకు ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు? ఎమ్మెల్యేల అధ్యక్షతన ఉన్న అసైన్డు కమిటీలు ఉన్నట్లా? లేనట్లా?

- సండ్ర వెంకట వీరయ్య, తెలుగుదేశం

హైదరాబాద్‌లో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన ఎలా?

హైదరాబాద్‌లోని 16 రెవెన్యూ మండలాల పరిధిలోని రెవెన్యూ రికార్డులను ఎలా ప్రక్షాళన చేస్తారు? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాని నోటీసులు కూడా తెలంగాణ ప్రభుత్వంలో వస్తున్నాయి. రికార్డుల్లో తప్పిదాలను ఎలా చక్కదిద్దుతారు? కొన్ని భూదస్త్రాల్లో 'జి' అని నమోదు చేశారు. దాని అర్థమేమిటి? ఇదే అంశంపై ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఆరూరి రమేష్, దుర్గం చిన్నయ్య, కౌసర్ మొయినుద్దీన్ తదితరులు కూడా మాట్లాడారు.

- కె.లక్ష్మణ్, భాజపా

భూదస్త్రాల ప్రక్షాళన విజయవంతం

అత్యంత కఠినమైన, దేశంలో ఏ రాష్ట్రంలో చేయలేని భూ రికార్డుల ప్రక్షాళనకు ముఖ్యమంత్రి కేసీఆర్ విస్తృత మేధోమథనంతో ప్రణాళిక రూపొందించారు. అది అద్భుతమైన ఫలితాన్ని ఇచ్చింది. భూదస్త్రాల ప్రక్రియను రాష్ట్రంలోని 10,823 గ్రామాల్లో చేపట్టాం. జగిత్యాల జిల్లాలో నూరు శాతం, మహబూబ్‌నగర్‌లో 97 శాతం ప్రక్షాళన పూర్తయింది. తెలంగాణలో 2,56,70,814 ఎకరాల భూమి ఉంది. అందులో 16,88,976 ఎకరాలకు సంబంధించి వివాదాలు ఉన్నాయి. రాష్ట్రంలో 1,43,15,675 ఎకరాల వ్యవసాయ భూమి, 11,99,488 ఎకరాల వ్యవసాయేతర భూమి ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. ప్రభుత్వం అసైన్డు చేసిన భూములు 20,13,868 ఎకరాలు, అటవీ భూములు 42,35,682 ఎకరాలు, దేవాదాయ భూములు 74,00,155 ఎకరాలు, వక్ఫ్ భూములు 45,570 ఎకరాలు ఉన్నట్లు గుర్తించాం. త్వరలో చేపట్టబోయే రెండోదశ ప్రక్రియలో వీటన్నింటినీ ప్రక్షాళన చేస్తాం. వివాదాస్పద భూములపైనా దృష్టి సారిస్తాం. ప్రభుత్వం గుర్తించిన వక్ఫ్, దేవాదాయ శాఖ భూములను పాసుపుస్తకాల్లో ఆ పేర్లతోనే నమోదు చేస్తాం. 3.10 లక్షల ఎకరాల వక్ఫ్ భూములు వివాదంలో ఉన్నాయి. సైనికులకు ఇచ్చిన భూములను విక్రయించుకునేందుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అసైన్డు భూముల కమిటీ సమావేశాలను త్వరలో నిర్వహిస్తాం.

- ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ సమాధానం

గీత కార్మికులకు పెద్దపీట

ఎంపీ బూర నర్సయ్యగౌడ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్రంలోని రెండు లక్షల మంది గీత కార్మికులకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ మూసివేసిన కల్లు దుకాణాలను కేసీఆర్ తెరపించారన్నారు. ఇప్పుడు చెట్టు పన్ను రద్దు, టీఎఫ్‌టీ కార్మికులకు పింఛన్ సదుపాయం, లైసెన్సు రెన్యువల్ గడువును పెంచడం గొప్పవిషయమని చెప్పారు. అయిదు ఎకరాల్లో రూ.5 కోట్లతో గౌడ భవన్ నిర్మిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గౌడ కులస్థులు, గీతకార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీరాజ్ సంస్థలకు 29 అధికారాలు ఇవ్వాలి

ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీరాజ్ సంస్థలకు 29 అధికారాలను బదలాయించి గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయాలని తెదేపా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య కోరారు. శుక్రవారం బడ్జెట్ పద్దులపై చర్చలో కృష్ణయ్య మాట్లాడారు. పంచాయతీల్లోని తాత్కాలిక ఉద్యోగులకు ఉద్యోగ భద్రత.. జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు అధికారాలు కల్పించాలన్నారు. హెచ్ఎండీఏ స్థలాలను రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణానికి కేటాయించాలని కోరారు. తెరాస ఎమ్మెల్యే జలగం వెంకట్రావు మాట్లాడుతూ పట్టణాల్లో తాగునీటికి సంబంధించి పాత పైపులైన్లను మార్చాలన్నారు. మార్కెట్ యార్డుల్లో రైతులు ఉత్పత్తులను ఉచితంగా అమ్ముకునేలా ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగూడెం, పాల్వంచలో తాము అనుసరిస్తున్న ఈ విధానం రైతులకు బాగా ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు నిర్వహిస్తున్న 4,500 మంది తాత్కాలిక ఉద్యోగులకు పది నెలలుగా జీతాలు లేవని, వెంటనే ఇప్పించాలని తెదేపా ఎమ్మెల్యే సండ్ర వీరయ్య కోరారు. భూరికార్డుల ప్రక్షాళనతోపాటు భూములను సర్వే చేస్తేనే పూర్తి ప్రయోజనం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజలపాలిట దైవమని తెరాస ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏలకు ప్రభుత్వం నామమాత్రంగా నిధులను కేటాయించిందని, పూర్తిస్థాయిలో నిధులివ్వాలని ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ అన్నారు. ఆస్తి పన్నుపై విధిస్తున్న వందశాతం జరిమానాను రద్దు చేయాలని, నగరంలో చిన్నపిల్లల పేర్లను సరిచేసుకునేందుకు జీహెచ్ఎంసీ ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దీనిపై దృష్టి సారించాలని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య కోరారు. ఆర్అండ్‌బీ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. భద్రాచలం వంతెన పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేషన్లకు ప్రత్యేకంగా నిధులివ్వడం ద్వారా నగరాల అభివృద్ధికి దోహదపడుతోందని తెరాస ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా అన్నారు.

ఒకే గొడుగు కిందికి గురుకుల సొసైటీలు

- మే నాటికి ఉపాధ్యాయ నియామకాలు
- గురుకులాల్లో క్రికెట్ అకాడమీలు
- ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి



ఈనాడు, హైదరాబాద్: గురుకులాల్ని మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సాధారణ సొసైటీలను విలీనం చేసి ఒకే గొడుగు కిందికి తీసుకొస్తామని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. వీటిని సంక్షేమ శాఖల పరిధిలో నిర్వహించినా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగిస్తామన్నారు. సంక్షేమశాఖల పరిధిలోని స్టడీసర్కిళ్లను విలీనం చేసి, ఆయా వర్గాల విద్యార్థుల రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పించాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. గురుకులాల్లో మంజూరు చేసిన 8,434 పోస్టుల్లో 857 భర్తీ చేశామని, మిగతా వాటికి మే నాటికి నియామకాలు చేపడతామని ప్రకటించారు. గురుకులాల సొసైటీల ఆధ్వర్యంలో నాలుగు క్రికెట్ అకాడమీలు (రెండు బాలురు, రెండు బాలికలకు) ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. శాసనమండలిలో గురుకుల పాఠశాలలపై జరిగిన చర్చకు సమాధానమిచ్చారు. భాజపా ఛలో అసెంబ్లీ కార్యక్రమం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, నేతలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ.. టీ విరామం తరువాత సభ ప్రారంభమైన వెంటనే మండలి భాజపా పక్షనేత రామచంద్రారావు సభ నుంచి వాకౌట్ చేశారు. గురుకులాల్లో శాశ్వత ప్రాతిపదికన ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకం చేపట్టాలని, కొత్తగా ప్రారంభించిన బీసీ, మైనార్టీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ఎంఐఎం ఎమ్మెల్సీ జాఫ్రి సూచించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, సంస్థల్లో గురుకుల విద్యార్థుల ప్రవేశాల సంఖ్య తగ్గుతోందని ఎమ్మెల్సీ భానుప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు గురుకుల సైనిక పాఠశాలను మంజూరు చేయాలని పురాణం సతీష్ కోరారు. మినీ గిరిజన గురుకులాల్లో సీఆర్టీలకు వేతనాలు పెంచాలని, క్రీడలపై సొసైటీలు దృష్టి పెట్టాలని రాములు నాయక్ తెలిపారు. ఈ చర్చలో గంగాధర్‌గౌడ్, ఫరీదుద్దీన్, నారదాసు లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటైన తరువాత 577 గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశామని డిప్యూటీ సీఎం కడియం తెలిపారు. కొత్తగా మంజూరు చేసిన గురుకులాల్లో 240 పాఠశాలల భవనాల నిర్మాణానికి భూములు కేటాయించి టెండర్లు పిలిచామని, సాంకేతిక కారణాలతో వాటిని రద్దు చేశామని ప్రకటించారు. కరీంనగర్, వరంగల్‌లో గురుకుల సైనిక పాఠశాలకు అనుమతి ఇచ్చామని, అక్కడ ప్రవేశాల డిమాండ్ అంచనా వేసిన తరువాత ఉమ్మడి ఆదిలాబాద్‌కు మంజూరు చేస్తామని ప్రకటించారు. సొసైటీల మధ్య తేడాలు లేకుండా అందరికీ ఒకేమెనూ అమలు చేస్తున్నామన్నారు. అనంతరం డిప్యూటీ ఛైర్మన్ మండలి సమావేశాలను శనివారానికి వాయిదా వేశారు.

సభ్యుల హక్కులకు భంగం... పురాణం సతీష్: గురుకుల పాఠశాలలపై జరిగిన చర్చలో పురాణం సతీష్ మాట్లాడుతుండగా.. మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి అతనికి సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించారు. సతీష్ స్పందిస్తూ.."ప్రశ్నోత్తరాలు, స్వల్పకాల వ్యవధి చర్చలు, పిటిషన్లు అన్నింటిలో ఆయనే ఉంటారు" అని పేర్కొన్నారు.

జాతీయ రహదారులకు రూ.3 వేల కోట్లతో టెండర్లు

మంత్రి తుమ్మల వెల్లడి



ఈనాడు, హైదరాబాద్: కొత్త జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.3 వేల కోట్లతో టెండర్లు పిలిచామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బడ్జెట్‌లో శుక్రవారం వివిధ శాఖల పద్దులపై జరిగిన చర్చలకు మంత్రులు సమాధానమిచ్చారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అదనంగా 3,150 కిలోమీటర్ల జాతీయ రహదారులను మంజూరు చేయించామన్నారు. గత మూడేళ్లలో రూ.4200 కోట్ల విలువైన పనులు చేపట్టినట్లు చెప్పారు. కొత్త రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం బాగుందని శాసనసభ్యులు కూడా ప్రశంసించారన్నారు. ఈ ఏడాది చివరికల్లా 1875 కి.మీ. నిర్మాణం పూర్తవుతుందన్నారు. రహదారులపై 511 వంతెనల నిర్మాణం చేపట్టగా 204 పూర్తయినట్లు తెలిపారు. తీవ్రవాద ప్రాబల్యమున్న జిల్లాల పరిధిలో రూ.1000 కోట్లతో రూ.420 కి.మీ.రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఎమ్మెల్యేల నివాసం కోసం హైదరాబాద్‌లో చేపట్టిన 120 ఫ్లాట్ల నిర్మాణం పూర్తయిందన్నారు. నియోజకవర్గాల్లో శాసనసభ్యులకు క్యాంపు కార్యాలయాలు నిర్మిస్తున్నామన్నారు. రెవెన్యూ రికార్డులను 68 ఏళ్ల చరిత్రలో పూర్తిస్థాయిలో సమగ్రంగా ప్రక్షాళన చేశామని రెవెన్యూ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ చెప్పారు. రెవెన్యూ శాఖలో 1,506 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీకి అనుమతి ఇచ్చామని, త్వరలో భర్తీ అవుతాయని తెలిపారు. ఇప్పసారా తయారీకి గిరిజనులకు అనుమతి లేదని, శాసనసభ్యులు అడుగుతున్నందున దీన్ని పరిశీలిస్తామని ఆబ్కారీ మంత్రి పద్మారావు గౌడ్ చెప్పారు. కొత్తగూడెంలో ఎక్సైజ్ స్టేషన్ నిర్మాణానికి అనుమతిచ్చామన్నారు.

కొత్తగూడెంలో మరో 800 మెగావాట్ల విద్యుత్కేంద్రం

విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.9600 కోట్ల ఆదాయ లోటు ఉందని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి తెలిపాయి. మండలి ఈ లోటు ఎంత ఉందో తేల్చిన తర్వాతే ప్రభుత్వం సొమ్ము విడుదల చేస్తుంది. కొత్తగూడెంలో ప్రస్తుతం 800 మెగావాట్ల విద్యుత్కేంద్రాన్ని నిర్మిస్తున్నాం. ఇది పూర్తయ్యాక దాని పక్కనున్న పాత కేంద్రాల్లో మరో 800 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణానికి పరిశీలిస్తాం. విద్యుత్ టవర్లు, కొత్త లైన్లు ఏర్పాటు చేసినప్పుడు భూములు కోల్పోయే వారికి కలెక్టర్ల నిర్ణయం మేరకు పరిహారం ఇస్తాం. విద్యుత్ ఒప్పంద ఉద్యోగాల క్రమబద్ధీకరణ అంశంపై హైకోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- జగదీశ్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి


ఆర్టీసీ బస్సుల్లో రోజుకు కోటి మంది ప్రయాణం

ఆర్టీసీ బస్సుల్లో రోజుకు కోటిమందికిపైగా ప్రయాణిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు అడిగిన రూట్లలో బస్సులు నడపాలని ఆదేశించాం. రాష్ట్రంలోని 97 ఆర్టీసీ డిపోల్లో 27 మాత్రమే లాభాల్లో ఉన్నాయి. అన్ని డిపోల్లో రూ.60 కోట్లతో రోడ్లు, ఇతర సదుపాయాలు కల్పించాం. రూ.17 కోట్లతో డ్రైవర్లకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశాం.

- పి.మహేందర్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి

విప్‌ను ధిక్కరించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికల సందర్భంగా తమ పార్టీ జారీచేసిన విప్‌ను ధిక్కరించి తెరాసకు ఓట్లేసిన ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ తరపున గెలిచి.. తెరాసలో చేరిన ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎన్.భాస్కర్‌రావు, రెడ్యానాయక్, కె.కనకయ్య, పువ్వాడ అజయ్‌కుమార్, జి.విఠల్‌రెడ్డి విప్‌ను ధిక్కరించినట్లు తెలిపారు. వీరిపై ఫిరాయింపు చట్టం ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏజెంటుగా వ్యవహరించిన రేగ కాంతారావు రిటర్నింగ్ అధికారులకు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. సదరు ఎమ్మెల్యేల ఓట్లను పరిగణనలోకి తీసుకోవద్దని అందులో పేర్కొన్నట్లు చెప్పారు. ఫిర్యాదు అందినట్లుగా ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని రిటర్నింగ్ అధికారిగా ఉన్న అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచారిని కోరగా.. తమ ముందే ఆయన బయటకు వెళ్లి ముఖ్యమంత్రికో, స్పీకర్‌కో ఫోన్‌చేసి మాట్లాడి.. ధ్రువీకరణ పత్రం ఇవ్వడం కుదరదని చెప్పారన్నారు. 63 మంది ఎమ్మెల్యేలున్న తెరాస.. ముగ్గురు అభ్యర్థులను ఎలా బరిలో నిలిపిందని ప్రశ్నించారు. రాజకీయాలను దిగజార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని విమర్శించారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం విప్‌ను ధిక్కరించిన ఎమ్మెల్యేల ఓట్లతో గెలుపొందిన అభ్యర్థి రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగ సమయంలో కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తన బాధాకరం, దుర్మార్గమని శాసనసభ స్పీకర్ వ్యాఖ్యానించారని.. కాంగ్రెస్ నుంచి తెరాసకు వచ్చానని ఎమ్మెల్యే భాస్కర్‌రావు నిండు సభలో చెప్పినా స్పీకర్‌కు ఎందుకు బాధకలగలేదని ప్రశ్నించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు చేపట్టాలని కోరారు.

హైదరాబాద్‌లో మళ్లీ రౌడీయిజం పెరుగుతోంది

నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో మళ్లీ రౌడీయిజం, హత్యలు పెరుగుతున్నాయని నాంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ (మజ్లిస్) చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ శూన్యగంటలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో గంజాయి, గుడుంబా వినియోగం పెరుగుతున్నాయన్నారు. పీడీ యాక్టు కింద కేసులు నమోదైన వ్యక్తి తాజాగా మరో హత్య చేశారని, ఇది ఒక ఉదాహరణ మాత్రమేనని చెప్పారు. నేరగాళ్లను నియంత్రించలేని పోలీసు అధికారులపై కూడా పీడీ యాక్టు పెట్టాలన్నారు.

గ్రూప్-1 నోటిఫికేషన్ ఎప్పుడు: ఆర్.కృష్ణయ్య

జిల్లాలు, మండలాలు పెరిగాయి. అధికారుల అవసరం పెరిగింది. ఇప్పటి వరకు గ్రూప్-1 నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేయలేదు. చాలా పోస్టులు ఖాళీగా ఉండడంతో నిరుద్యోగులు నిరీక్షిస్తున్నారు. నోటిఫికేషన్ ఎప్పుడిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలి.

రోడ్డు లేదు.. రైలూ ఆగిపోయింది: కోరం కనకయ్య

ఇల్లెందు నియోజకవర్గ పరిధిలో గిరిజన గ్రామాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రోడ్లు వేయమని అడిగితే పట్టించుకోవడం లేదు. బ్రిటీషోళ్లు వేసిన రైలు కూడా ఆగిపోయింది. అక్కడి ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచండి: విద్యాసాగర్‌రావు

జీహెచ్ఎంసీ కార్మికుల వేతనాలు పెంచారు. రాష్ట్రంలోని ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికుల వేతనాలు కూడా పెంచుతామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చింది. దాన్ని అమలు చేయాలి.

ఎమ్మెల్యేలు హనుమంతు షిండే, చింతా ప్రభాకర్, బి.గణేష్‌గుప్తా, కూసుకుంట్ల ప్రభాకర్, మదన్‌లాల్, రవీంద్రకుమార్, పుట్టా మధు, పాయం వెంకటేశ్వర్లు, ఎం.సుధీర్‌రెడ్డి (తెరాస), సండ్ర వీరయ్య (తెదేపా), రాజాసింగ్ (భాజపా), సున్నం రాజయ్య (సీపీఎం) వివిధ అంశాలను ప్రస్తావించారు.

ఈనాడు సినిమా



మహేష్‌బాబు

బెజవాడలో... భరత్ స్వరాలు?

మహేష్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'భరత్ అనే నేను'. కొరటాల శివ దర్శకుడు. డివివి దానయ్య నిర్మాత. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. గురువారంతో టాకీ మొత్తం పూర్తయింది. ఓ పాట మాత్రమే మిగిలి ఉంది. ఈనెల 26 నుంచి స్పెయిన్‌లో ఆ గీతాన్ని చిత్రీకరిస్తారు. ఏప్రిల్ 7న విజయవాడలో పాటల్ని విడుదల చేస్తారని సమాచారం. ఈ చిత్రంలో మహేష్ ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నారు. కథకు, కథానాయకుడి పాత్రకూ తగినట్టు... ఆడియో వేడుక దగ్గర అసెంబ్లీని పోలిన ఓ సెట్ వేయాలని చిత్రబృందం భావిస్తోంది. ఇటీవల 'భరత్..' టీజర్‌ని విడుదల చేశారు. 'ఒక్కసారి ప్రామిస్ చేసి ఆ మాట తప్పితే యూ ఆర్ నాట్ కాల్డ్ ఏ మేన్' అనే డైలాగ్‌తో విడుదలైన టీజర్ అభిమానులకు చేరువైంది. ఏప్రిల్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

రాజుగాడి అల్లరి



రాజ్‌తరుణ్, రాజేంద్రప్రసాద్, అమైరా దస్తూర్


రాజ్‌తరుణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'రాజుగాడు'. సంజనారెడ్డి దర్శకురాలిగా పరిచయమవుతోంది. అమైరా దస్తూర్ కథానాయిక. రామబ్రహ్మం సుంకర నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. మే 11న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఓ విచిత్రమైన జబ్బుతో బాధపడే యువకుడి కథ ఇది. అవసరం లేకపోయినా, తనకు తెలియకుండానే దొంగతనాలు చేసేస్తుంటాడు. దాని ద్వారా పుట్టే వినోదం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. రాజ్‌తరుణ్‌తో మా సంస్థలో తెరకెక్కించిన నాలుగో చిత్రమిది. రాజేంద్ర ప్రసాద్ నటన మరోసారి అలరిస్తుంది. టీజర్‌కి మంచి స్పందన వస్తోంద"న్నారు. నాగినీడు, రావురమేష్, సిజ్జు, పృథ్వీ, కృష్ణభగవాన్ తదితరులు నటించారు. సంగీతం: గోపీ సుందర్

పంచ్ డైలాగ్

మీడియా పబ్లిక్ కోసం పనిచేయాలి కానీ పబ్లిసిటీ కోసం కాదు.

చిత్రం: నాయక్

– **పంపినవారు:** కె.రాఘవేంద్ర, గుంటూరు



రిషి కపూర్, అమితాబ్ బచ్చన్

తండ్రి కూల్ కొడుకు ఓల్డ్ స్కూల్

సెంచరీ దాటేసిన తండ్రేమో కుర్రాడిలా చెలరేగిపోతుంటాడు. అతని కొడుకేమో నీరసంగా.. నిరుత్సాహంగా ఉంటాడు. తండ్రే కొడుక్కి సేవలు చేయాల్సిన పరిస్థితి. ఆ వందేళ్ల యువకుడి కథేంటో తెలియాంటే '102 నాట్ అవుట్' చూడాల్సిందే. 102 ఏళ్ల వయసున్న తండ్రి పాత్రలో అమితాబ్ బచ్చన్, 75 ఏళ్ల అతని కొడుకుగా రిషి కపూర్ నటిస్తున్న చిత్రమిది. 27 సంవత్సరాల తర్వాత ఈ ఇద్దరూ కలిసి నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పంచుకొన్నారు అమితాబ్. "బాప్ కూల్...బేటా ఓల్డ్ స్కూల్" అని రాశారు అమితాబ్. మే 4న ఈ చిత్రం విడుదలకానుంది.

కథానాయికల మధ్య 'నువ్వా నేనా' అన్నట్టుంది పోటీ. ఒకరికి దీటుగా మరొకరు కనిపిస్తున్నారు. ఇదివరకు దర్శక నిర్మాతలు తమ సినిమాలకి తగ్గ జోడీని వెదుక్కోవడాన్ని ఓ పెద్ద ప్రహసనంగా భావించేవాళ్లు. స్టార్ భామల కాల్షీట్ల కోసం ఎప్పట్నుంచో వెంటపడితే కానీ దొరికేవి కాదు. సినిమాలన్నీ నలుగురైదుగురు కథానాయికల చుట్టూనే తిరుగుతున్నట్టు అనిపించేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. కథానాయికలు చాలామందే కనిపిస్తున్నారు. ప్రాంతీయ సినిమాకీ, జాతీయ సినిమాకీ మధ్య హద్దులు చెరిగిపోవడంతో బాలీవుడ్ భామలు కూడా ఏ మాత్రం బెట్టు చేయకుండా తెలుగులో నటించేందుకు ముందుకొస్తున్నారు. ఈ దశలో వరుసగా అవకాశాల్ని ఒడిసిపట్టి కాల్షీట్ల డైరీని భర్తీ చేసుకోవడమంటే ఆషామాషీ విషయం కాదు. కానీ కొద్దిమంది కథానాయికలు ఇంత పోటీలోనూ రెండు మూడు చిత్రాల్లో నటిస్తూ బిజీగా గడుపుతున్నారు.

ఆటా మాదే వేటా మాదే!





కథానాయికల విషయంలో ఇదివరకు ప్రత్యామ్నాయం అస్సలు కనిపించేది కాదు. స్టార్ కథానాయకుల సరసన నటించడానికైతే చాలా తక్కువమంది కనిపించేవాళ్లు. కానీ ఇప్పుడు అలా కాదు. ఒకరు కాదంటే, మరొకరు. అందుకు కారణాలు చాలానే ఉన్నాయి. కొత్త తరం దూసుకొస్తోంది. వచ్చీ రాగానే భాషపై పట్టు పెంచుకొని కథలు, పాత్రలకి తాము న్యాయం చేయగలమని దర్శకులకి భరోసా ఇస్తున్నారు. మరోపక్క సీనియర్ భామలు తమ పట్టుని కోల్పోకుండా, తమ అనుభవానికి తగ్గట్టుగా కథల్ని ఎంచుకొంటూ విజయాలు అందుకొంటున్నారు. అభినయం ప్రదర్శించడంతో పాటు, అందాన్నీ కాపాడుకొని కొత్తభామలకి దీటుగా కనిపిస్తున్నారు. దాంతో మన చిత్రసీమలో కథానాయికల సంఖ్య కాస్త ఎక్కువగానే కనిపిస్తోంది. అది దర్శకనిర్మాతలకి ఓ వరంగా మారింది. అయితే కథానాయికల్లో మాత్రం పోటీ బలంగా పెరిగినట్టైంది. ఇదివరకు కొత్త అవకాశాలతో అలవోకగా డైరీ నిండిపోయేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతి అవకాశాన్నీ ఒడిసి పట్టాల్సిందే. అన్ని ప్రయత్నాలు చేసినా కాల్షీట్లు ఇంకా ఖాళీగానే కనిపిస్తున్నాయి. చాలామంది పొరుగు భాషలపై కూడా కన్నేస్తూ తమ మార్కెట్‌ని విస్తరించుకొనే ప్రయత్నంలో ఉన్నారు. అయితే ఇంత పోటీలోనూ కొద్దిమంది భామలు తమ సత్తా చాటే ప్రయత్నం చేస్తున్నారు. సమంత, పూజా హెగ్డే, అను ఇమ్మాన్యుయేల్, అనుపమ పరమేశ్వరన్ డైరీ కొత్త సినిమాలతో కళకళలాడుతోంది.

పూజా హవా

'ముకుంద'తో తెలుగు తెరకు పరిచయమైన కథానాయిక పూజా హెగ్డే. ఆ తర్వాత నాగచైతన్యతో కలిసి 'ఒక లైలా కోసం' చిత్రంలో నటించింది. ఆ వెంటనే హృతిక్ రోషన్ చిత్రం 'మొహంజొదారో'లో నటించే అవకాశం రావడంతో అటువైపు వెళ్లింది. ఆ తర్వాత కూడా ఆమెకి హిందీలో అవకాశాలు తలుపు తడుతున్నప్పటికీ, 'డీజే' కోసం తెలుగుకి తిరిగొచ్చింది. అందులో అల్లు అర్జున్ సరసన ఆమె సందడి చేసిన విధానం ప్రేక్షకులకే కాదు, పరిశ్రమని కూడా ఆకట్టుకుంది. దాంతో పూజ కోసం దర్శకనిర్మాతలు క్యూ కట్టేశారు. ప్రస్తుతం బెల్లంకొండ శ్రీనివాస్‌తో 'సాక్ష్యం'లో నటిస్తున్న ఆమె తదుపరి ఎన్టీఆర్ - త్రివిక్రమ్ సినిమాలోనూ, మహేష్ - వంశీ పైడిపల్లి చిత్రాల కోసం సంతకం చేసింది. త్వరలోనే 'రంగస్థలం'లో ఓ ప్రత్యేక గీతంతో సందడి చేయబోతోంది. వరుసగా స్టార్ కథానాయకుల చిత్రాల్లో అవకాశాలు సొంతం చేసుకొంటున్న ఆమె తెలుగులో జెండా బలంగా పాతేసినట్టే.

సమంత 'సై'

ఎంత పోటీ నెలకొన్నా వెనక్కి తగ్గేదే లేదంటోంది సమంత. మామూలుగా అయితే పెళ్లయ్యాక కథానాయికల కెరీర్ అంత ఆశాజనకంగా ముందుకు సాగదు. కానీ సమంత విషయంలో మాత్రం భిన్నం. పెళ్లయ్యాక కూడా ఆమె వరుసగా అవకాశాల్ని అందుకొంటోంది. త్వరలోనే 'రంగస్థలం'లో రామలక్ష్మిగా సందడి చేయబోతున్న ఆమె, 'మహానటి'తో పాటు, 'యు టర్న్' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ రెండూ కూడా తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాబోతున్నాయి. కొంతకాలంగా విభిన్నమైన కథలు, ప్రాధాన్యమున్న పాత్రలే లక్ష్యంగా సినిమాలు చేస్తున్న ఆమె ఎక్కడ సంతృప్తికరమైన పాత్రలొస్తే అక్కడ నటిస్తున్నారు.



అనుపమ పరమేశ్వరన్



అను ఇమ్మాన్యుయేల్

అను + అను

కేరళ భామలు అను ఇమ్మాన్యుయేల్, అనుపమ పరమేశ్వరన్‌లు కూడా అవకాశాల విషయంలో ముందంజలో ఉన్నారు. అల్లు అర్జున్‌తో కలిసి 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'లో, నాగచైతన్యతో కలిసి 'శైలజారెడ్డి అల్లుడు'లో నటిస్తున్న అను ఇమ్మాన్యుయేల్, ఈ మధ్యే ప్రారంభమైన రవితేజ 'అమర్ అక్బర్ ఆంటోనీ'లోనూ నటించేందుకు పచ్చజెండా ఊపేసింది. అనుపమ పరమేశ్వరన్ ఇప్పుడిప్పుడే గేరు మార్చింది. నానితో కలిసి 'కృష్ణార్జునయుద్ధం'తో పాటు, సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా కరుణాకరన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మరో చిత్రంలో నటిస్తున్న ఆమె, ఇటీవలే ప్రారంభమైన రామ్ 'హలో ప్రేమ గురూ'లోనూ నటిస్తున్నారు. శ్రద్ధాకపూర్, కైరా అడ్వానీ, నిధి అగర్వాల్, మాళవిక శర్మ... ఇలా పలువురు బాలీవుడ్ భామలు ప్రస్తుతం తెలుగులో నటిస్తున్నారు. వీళ్లకి తోడు బోలెడు మంది దక్షిణాది కథానాయికలు అవకాశాల కోసం పోటీ పడుతున్న సమయంలోనూ పూజ హెగ్డే, సమంత, అనుపమ పరమేశ్వరన్, అను ఇమ్మాన్యుయేల్‌ల కాల్షీట్లు కళకళలాడుతుండడం విశేషం. కథానాయికల మధ్య పోటీ పెరగడం దర్శకనిర్మాతలకి కలిసొస్తోంది. పారితోషికం విషయంలోనూ, కాల్షీట్ల విషయంలోనూ కాస్త వెసులుబాటు లభిస్తోంది.

గీతోపదేశం

మనసులో నీవైన భావాలే
బయట కనిపిస్తాయి దృశ్యాలై
నీడలు నిజాల సాక్ష్యాలే
శత్రువులు నీలోని లోపాలే
స్నేహితులు నీకున్న ఇష్టాలే
రుతువులు నీ భావ చిత్రాలే

గీతం: **ఎంత వరకు ఎందుకొరకు...**

చిత్రం: గమ్యం

రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి

– పంపినవారు: టి.ప్రవేశ్, తెనాలి



అక్షిత, మనీష్‌బాబు

ప్రశ్నించే కుర్రాడు

మనీష్‌బాబు కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'ప్రశ్నిస్తా'. అక్షిత కథానాయిక. రాజా వన్నెంరెడ్డి దర్శకుడు. సత్యరెడ్డి నిర్మాత. హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బాబి క్లాప్‌నిచ్చారు. అనంతరం నిర్మాత మాట్లాడుతూ "ఈ చిత్రంతో మా అబ్బాయిని కథానాయకగా పరిచయం చేస్తున్నా. రెండేళ్లుగా మనీష్ నటన, నృత్యంలో శిక్షణ తీసుకుంటున్నాడు. కథానాయిక అక్షిత మన తెలుగమ్మాయే. దివ్యభారతిలా తాను మంచి పేరు తెచ్చుకుంటుంద"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రశ్నించే గుణం ఉన్న కుర్రాడి కథ ఇది. ఇన్నేళ్ల తరవాత కూడా ఇది నా తొలి సినిమాలానే అనిపిస్తోంది. మనీష్‌కి మంచి పేరు తీసుకొచ్చే చిత్రం అవుతుంద"న్నారు. ఎల్.ఎం.ప్రేమ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: యోగిరెడ్డి.

ఈనాడు

విజేత

sports@eenadu.in

హైదరాబాద్ శనివారం, మార్చి 24, 2018 9

సాధారణంగా క్రికెట్లో బౌలింగ్ ఎలా చేస్తారు? ఇదేం ప్రశ్న అనుకుంటున్నారా? ఒక చేత్తోనే కదా.. ఇది అందరికీ తెలుసు. మరి ఒకే ఓవర్లో రెండు చేతులతో బౌలింగ్ చేస్తే! ఇదెలా సాధ్యం! అలాంటి బౌలర్లు ఉన్నారా? అవును.. క్రికెట్లో రెండు చేతులతో బంతులేసే బౌలర్లు ఉన్నారు. అలాంటి సవ్యసాచులు చాలా అరుదు. పాత తరంలో ఇలాంటి క్రికెటర్లు ఒకరిద్దరు ఉండేవాళ్లు. తాజాగా ఇద్దరు బౌలర్లు రెండు చేతులతో బంతులు సంధిస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఒకే ఓవర్లో రెండు చేతులతో బంతులు వేస్తూ వికెట్లు తీస్తున్నారు.

కుడి ఎడమల.. పటాఫట్



ఇటీవలే న్యూజిలాండ్‌లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో శ్రీలంక స్పిన్నర్ కమిందు మెండిస్ రెండు చేతులతో బౌలింగ్ చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. 17 ఏళ్ల కమిందు కుడి చేతి ఆఫ్ బ్రేక్ బౌలర్ మాత్రమే కాదు.. ఎడమ చేతి స్పిన్నర్ కూడా. అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్‌లో అతను ఇలా రెండు చేతులతో బంతులేసి మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆ టోర్నీలో కమిందు లంక జట్టుకు కెప్టెన్ కూడా.

మనోడూ ఉన్నాడు!





రెండు చేతులతో బంతులేసే సత్తా ఉన్న అరుదైన బౌలర్లలో ఒక భారత క్రికెటరూ ఉన్నాడు. విదర్భకు చెందిన అక్షయ్ కర్నెవార్ సవ్యసాచిగా పేరొందాడు. బ్యాట్స్‌మెన్‌ను బట్టి అతను బౌలింగ్ శైలిని మార్చుకుంటాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలింగ్‌తో పాటు కుడి చేత్తో మీడియం పేస్ బౌలింగ్ చేస్తాడతను. ఇటీవలే దేశవాళీ అరంగేట్రం చేసిన అక్షయ్.. విజయ్ హజారే ట్రోఫీలో 7 మ్యాచ్‌ల్లో 16 వికెట్లు తీసి సత్తా చాటాడు. గతేడాది ఆస్ట్రేలియాతో బోర్డ్ ఎలెవన్ ప్రెసిడెంట్స్ ఎలెవన్ మ్యాచ్‌లో ఆడిన అక్షయ్.. రెండు చేతులతో బంతులేసి కంగారెత్తించాడు. ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మన్ అయిన హెడ్, వేడ్‌లకు కుడి చేత్తో మీడియం పేస్ వేసిన అక్షయ్.. కుడి చేతి వాటం బ్యాట్స్‌మెన్ స్టాయినిస్‌కు లెఫ్ట్ ఆర్మ్‌తో బంతులేశాడు.



తిలక్‌రత్నే, గూచ్‌లూ..

శ్రీలంక మాజీ బ్యాట్స్‌మెన్ తిలక్‌రత్నే పార్ట్ టైమ్ బౌలర్. 1996 ప్రపంచకప్‌లో తిలక్‌రత్నే.. కెన్యాతో మ్యాచ్‌లో రెండు చేతులతో బంతులేశాడు. కెన్యాతో మ్యాచ్‌లో లంక విజయానికి చేరువగా ఉన్నప్పుడు ఎడమ చేత్తో బంతులు విసిరిన తిలక్ రత్నే.. అదే ఓవర్లో కుడి చేత్తోనూ బంతులు వేశాడు. ఇంగ్లాండ్ ఆటగాడు గ్రాహం గూచ్ గురించి అందరికీ తెలుసు. అతను మంచి బ్యాట్స్‌మెన్ మాత్రమే కాదు ఉపయుక్తమైన కుడి చేతి వాటం పేసర్ కూడా. అయితే అప్పుడప్పుడూ అతను ఎడమ చేత్తోనూ బంతులు వేసేవాడు. పాకిస్థాన్ మాజీ స్టార్ హనీఫ్ మహ్మద్ కూడా ఇదే కోవకు చెందినవాడు. కుడి చేత్తో ఆఫ్ స్పిన్ వేసే హనీఫ్... లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌తోనూ అలరించేవాడు.

అప్పుడు...
సుశీల్‌కుమార్, యోగేశ్వర్ దత్ లాంటి స్టార్ల సాహచర్యంలో ఎదిగిన వాడు.. ప్రపంచ, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో పతకాలతో సత్తా చాటిన వాడు.. ఒలింపిక్స్ శిబిరంలోనూ పాల్గొన్నవాడు..

ఇప్పుడు..
విగ్రహాలకు రంగులు వేసుకుంటూ..ఏ మట్టిలో ఎదిగాడో ఆ మట్టి విగ్రహాలనే నమ్ముకుంటూ.. కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవితాన్ని గడుపుతున్నాడు.. ఆ ఛాంపియనే దేవిసింగ్. ధూల్‌పేట లాంటి ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి అంతే వేగంగా కింద పడ్డ రెజ్లర్! అందుకే అతను పేరుకే పహిల్వాన్!



కష్టంలో మీ.. పహిల్వాన్

క్రీడా ప్రతిభకు నిలయమైన తెలుగు రాష్ట్రాల్లో కుస్తీ ప్రాచుర్యంలో ఉన్నా.. క్రీడాకారులు మాత్రం ఆర్థిక ఇబ్బందుల కారణంగా అంతర్జాతీయ స్థాయిలో కొనసాగలేకపోతున్నారనడానికి దేవిసింగ్ తాజా ఉదాహరణ. ఎలాంటి సౌకర్యాలు లేని ధూల్‌పేటలో మట్టిలో మాణిక్యంలా ఎదిగాడు దేవి. స్థానిక మినీ స్టేడియంలోని అకాడమీలోనే అతడి సాధన సాగేది. సోదరుడు కిషన్‌సింగ్‌తో పాటు అతను ప్రాక్టీస్ చేసేవాడు. జాతీయ స్థాయిలో 50కి పైగా పతకాలు ఖాతాలో వేసుకున్న దేవి.. స్థానికంగా జరిగే కేసరి పోటీల్లో ఎన్నోసార్లు టైటిళ్లు అందుకుని పహిల్వాన్‌గా మారాడు. అతని బంధువు సాయంతో దిల్లీలో సత్పాల్‌సింగ్ అకాడమీలో తన తమ్ముడు కిషన్‌తో కలిసి చోటు సంపాదించాడు. ఇక్కడే సుశీల్‌కుమార్, యోగేశ్వర్ దత్ లాంటి దిగ్గజ రెజ్లర్ల సాహచర్యంతో ఆటలో ఆరితేరాడతను. ముందు మట్టిలో కుస్తీ పట్టిన వాడికి మ్యాట్‌ల మీద ఎలా ఆడాలో తెలిసింది అప్పుడే. అంతేకాదు కష్టాల్లో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవడానికి దిల్లీలో స్థానికంగా జరిగే ఓపెన్ దంగల్‌కు వెళ్లి డబ్బులు సంపాదించి ఇంటికి పంపేవాడు. చాలాసార్లు డబ్బులు లేని స్థితిలో యోగేశ్వర్ అన్నదమ్ములను ఆదుకునేవాడు. అంతేకాదు రెజ్లర్లకు చాలా అవసరమైన బాదం, నెయ్యి వారితో పంచుకునేవాడు.

ఆసియా ఘనత

ఆసియా ఛాంపియన్‌షిప్‌లో తనకన్నా మెరుగైన రెజ్లర్లను మట్టికరిపించి స్వర్ణం గెలవడం దేవి కెరీర్‌లోనే అతి పెద్ద విజయం. దీంతో ఈ కుర్రాడికి మంచి భవిష్యత్ ఉందని అనుకున్నారు. ఎందుకంటే భారత్‌లో కుస్తీ ఆట మంచి ఊపు మీద ఉంది. అందులోనూ అంతర్జాతీయ రెజ్లర్‌గా మంచి పేరున్న భజరంగ్ పునియాను ఒకటికి రెండుసార్లు ఓడించి దేవి అందరి దృష్టిలో పడ్డాడు. 2012 లండన్ ఒలింపిక్స్ కోసం జరిగిన రెజ్లింగ్ శిబిరంలోనూ... అమెరికాలోని కొలరాడోలో జరిగిన శిక్షణ శిబిరంలోనూ అతను పాల్గొన్నాడు. కానీ ఆర్థిక పరిస్థితి.. వసతుల లేమి.. రెజ్లింగ్ సంఘంలో రాజకీయాలు, స్థానికంగా ప్రోత్సాహం లేకపోవడం లాంటి కారణాలు అతణ్ని ఎదగనివ్వలేదు. పోటీలకు వెళ్లేందుకు డబ్బులు కూడా లేక.. చేసిన అప్పులు తీర్చుకోలేక కుస్తీ పక్కనపెట్టేశాడు. కుటుంబ పోషణ కోసం విగ్రహాలకు రంగులు వేయడం ప్రారంభించాడు. జాతీయ స్థాయి రెజ్లర్ అయిన అతని తమ్ముడు కిషన్ కూడా అన్న బాటే పట్టాడు. వినాయక చవితి లాంటి పెద్ద పండగలు వస్తేనే వాళ్లకు డబ్బులు వస్తాయి.

ఒలింపిక్స్ కల నెరవేరేనా!

ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలనేది దేవి కల. ఆ అవకాశం 2012లో చేతికి అందినట్లే అంది చేజారిపోయింది. ఆర్థిక ఇబ్బందులు భరించలేక తర్వాత హైదరాబాద్‌కు వచ్చేసి పెయింటర్‌గా స్థిరపడిపోయినా ఇప్పటికీ ఆశ పోలేదు. ఎవరైనా తనను ఆదుకోకపోతారా.. మళ్లీ అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లకపోతానా అని! 2020 టోక్యో ఒలింపిక్స్ ట్రయల్స్‌కు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఆదుకుంటే కచ్చితంగా మళ్లీ గాడిలో పడతానని.. ఒలింపిక్స్‌లో పతకం కోసం పోరాడతానని దేవీ అంటున్నాడు. అతను అంతర్జాతీయ పతకాలు సాధించినపుడు ఆదుకుంటాం అని చెప్పిన అధికారులు, నాయకులెవరూ ఇప్పుడు పట్టించుకోవట్లేదు. తనకు ఆర్థికంగా మద్దతు ఇస్తే కచ్చితంగా రాణిస్తానని అతను చెబుతున్నాడు.



"ప్రపంచ క్యాడెట్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించినప్పుడు కంటే ఆసియా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచినప్పుడే చాలా ఆనందంగా అనిపించింది. ఎందుకంటే పతకం స్వీకరించేటప్పుడు జనగణమన ఆలపించారు. ఆర్థిక ఇబ్బందులతో మళ్లీ ఎప్పుడూ ఆ అవకాశాన్ని పొందలేకపోయాను. ఒలింపిక్స్‌లో పాల్గొనడం పెద్ద కల. ఇప్పుడు నాకు 24 ఏళ్లే. ఫిట్‌గా ఉన్నాను. జాతీయ స్థాయికి వెళ్లే స్థోమత లేక పెయింటర్‌గా బతుకుతున్నా. మా కోసం నాన్న బియ్యం మూటలు ఎత్తడం.. రోడ్డు మీద అమ్మ కూరగాయలు అమ్మడం ఇంకా మరిచిపోలేదు. అందుకే ఎంత కష్టమైనా రెజ్లింగ్‌లో కొనసాగాను. కానీ నా వల్ల కాక వదిలేశాను. కామన్వెల్త్, ఆసియా క్రీడలకు ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం లేదు. ఐతే 2020 ఒలింపిక్స్‌కు వెళ్లాలనే కోరిక ఉంది. దానికి ముందు ట్రయల్స్‌లో సత్తా చాటాలి. అంతర్జాతీయ పతకాలు సాధించినా ప్రభుత్వం తరపున ఎలాంటి సాయం లేదు. ఆదుకుంటే పతకాలు తెచ్చే సత్తా నాలో ఇంకా ఉంది. నాలాంటి రెజ్లర్లు ధూల్‌పేటలో చాలామంది ఉన్నారు. వారికి ఉపకార వేతనాలు ఇచ్చి ప్రోత్సహించాలి. అకాడాల నిర్మాణానికి, వసతుల కల్పనకు సాయం చేయాలి"

- దేవీసింగ్

దేవి ఘనతలు

- ఆసియా క్యాడెట్ ఛాంపియన్‌షిప్, (బ్యాంకాక్) స్వర్ణం
- ప్రపంచ క్యాడెట్ ఛాంపియన్‌షిప్ (హంగేరి) కాంస్యం
- జూనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్ (కజకిస్థాన్) కాంస్యం
- అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి పతకం గెలిచిన తొలి ఆటగాడు
- జాతీయ జూనియర్, సీనియర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లలో 50కి పైగా పతకాలు



బైక్‌లు అమ్మేసి..

పాతబస్తీలో రెజ్లింగ్ పోటీలు జరిగితే అక్కడో పెద్ద పండగ వాతావరణం. ఎక్కడెక్కడి నుంచో పహిల్వాన్‌లు పోటీలకు వస్తుంటారు. కేసరి టైటిళ్లు సాధించిన వాళ్లకు ద్విచక్ర వాహనాలు బహుమతిగా ఇస్తుంటారు. ఇలాంటి పోటీల్లో గెలవడంలో దేవి దిట్ట. ఏకంగా ఎనిమిది బైక్‌లు సంపాదించాడతను. అయితే ఆ బైక్‌లు గెలిచింది సరదాగా ధూల్‌పేటలో షికారు కొట్టేందుకు కాదు. అక్కాచెల్లెళ్ల పెళ్లిళ్లు చేయడానికి. అందుకోసం గాయాలతోనూ పోటీల్లో పాల్గొన్న రోజులున్నాయి. వచ్చిన బైకులన్నింటినీ అమ్మేసి సోదరిల పెళ్లిళ్లు చేశాడు. తన కోసం తల్లిదండ్రులు చేసిన అప్పులు తీర్చాడు. జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లే స్థోమత లేక ధూల్‌పేటకే పరిమితం అయిపోయిన దేవి.. రెజ్లింగ్ మీద మమకారం చంపుకోలేక తన విద్యను యువ రెజ్లర్లకు పంచుతున్నాడు. ఇప్పటికే అతను దాదాపు 200 మంది రెజ్లర్లను తయారు చేశాడు. వారిలో గబ్బర్, చందన్‌సింగ్ జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు.

– దాస్యం వెంకట వంశీకృష్ణ

పెద్ద కుటుంబం...
ఉన్నత చదువు...
ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ...
వైద్య రంగంలో సేవలు...
ఇవన్నీ ఇచ్చిన సంతృప్తి ఒకెత్తైతే...
తను రేసర్‌గా పొందే కిక్ ఒకెత్తు!
అందుకే దేశంలో అత్యంత వేగవంతమైన డ్రైవర్‌గా మారాడు.. మోటార్ స్పోర్ట్స్‌లో తిరుగులేని క్రీడాకారుడయ్యాడు... 2017 సంవత్సరానికి గాను ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఎస్‌సీఐ) 'జాతీయ మోటార్ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు అందుకున్నాడు. మోటార్ స్పోర్ట్స్‌లో సంచలనాలు సృష్టిస్తున్న ఆ యువ రేసర్..
కొండా అనింధిత్‌రెడ్డి

మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి ముని మనవడు... అపోలో గ్రూపు సంస్థల ఛైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి మనవడు... ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అపోలో డైరెక్టర్ సునీతారెడ్డిల కుమారుడు... ఇంత పెద్ద కుటుంబ నేపథ్యం ఉందన్న విషయం ఎక్కడా చెప్పుకోలేదు అనింధిత్. అతను మోటార్ స్పోర్ట్స్ రేసర్ అన్న సంగతి కూడా చాలా మందికి తెలియదు. అలా చెప్పుకోవడం అతనికి ఇష్టముండదు. తనకంటూ వ్యక్తిగతంగా గుర్తింపు రావాలన్నదే అతని తపన. నిరుడు ఎంఆర్ఎఫ్ ఎఫ్ఎఫ్ 1600, యూరో జేకే 17 జాతీయ రేసింగ్ ఛాంపియన్‌షిప్‌లలో అనింధిత్ విజేతగా నిలిచాడు. దేశంలో ఒకే సీజన్‌లో 2 టైటిళ్ళు గెలిచిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడీ హైదరాబాదీ. అందుకే ఉత్తమ క్రీడాకారుడి అవార్డు అతడిని వరించింది. 2014లో రేసింగ్ మొదలుపెట్టిన అనింధిత్ మొత్తం 5 ఛాంపియన్‌షిప్‌లు గెల్చుకున్నాడు. గత ఏడాది 33 రేసుల్లో 20 మార్లు పోడియం ఫినిష్ చేయడం విశేషం. ప్రతిష్ఠాత్మక వెంటో కప్‌లో గెస్ట్ రేసర్‌గానూ పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఇప్పుడు అతని దృష్టి అంతర్జాతీయ స్థాయికి మళ్ళింది. వచ్చే సీజన్‌లో ఆసియా స్థాయిలో బరిలో దిగాలని భావిస్తున్నాడు. ప్రస్తుతం ఫార్ములా-3, ఫార్ములా- 4 కార్లు నడిపిస్తున్న అనింధిత్.. రానున్న సీజన్‌లో జీటీ3, జీటీ4 కార్లు డ్రైవ్ చేయాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. ఐరోపాలో బాగా ప్రాచుర్యంలో ఉన్న జీటీ3, జీటీ4తో కెరీర్ సుదీర్ఘంగా కొనసాగించొచ్చన్నది 28 ఏళ్ళ అనింధిత్ అభిప్రాయం.

స్పీడున్నోడు



రేసింగ్‌పై ఉన్న ఇష్టంతోనే ఆటోమొబైల్ ఇంజినీరింగ్ కోర్సు చదివా. 2014 నుంచి ప్రొఫెషనల్ రేసింగ్ చేస్తున్నా. ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. హాబీగా మొదలుపెట్టి ఇలా గుర్తింపు సాధించా. నేను చేసే రేసింగ్‌ను ఎఫ్3, ఎఫ్4 అంటారు. దేశంలో కోయంబత్తూరు, చెన్నై, దిల్లీలో మాత్రమే రేసింగ్ ట్రాక్‌లు ఉన్నాయి. మిగతా క్రీడల్లా రేసింగ్‌లో ప్రాక్టీస్ ఎక్కువగా ఉండదు. ట్రాక్‌లు లేవు కాబట్టి. ఈవెంట్‌కు రెండ్రోజుల ముందువెళ్లి సాధన చేసుకోవాలి. మిగతా సమయమంతా ఫిట్‌నెస్. చేస్తా. రేసింగ్ ప్రమాదాల నుంచి బయటపడేందుకు హెల్మెట్, గార్డ్స్ అన్నీ పక్కాగా ఉంటున్నాయి. దీంతో రేసింగ్ సురక్షితంగా మారాయి. రేస్‌లో మన రక్షణ, ఎదుటి వాళ్ళ రక్షణ చాలా ముఖ్యం. రేసింగ్‌లోనే వేగం థ్రిల్‌గా అనిపిస్తుంది. కానీ, మన రోడ్ల మీదకి వచ్చేసరికి బాధ్యతగా నడుపుతా. విదేశాల్లో రేసులకు వెళితే 6 వారాంతాల్లో 14 రేసులు ఉంటాయి. నిరుడు 11 వారాల్లో 33 రేసుల్లో పాల్గొన్నా. మిగతా సమయమంతా వ్యాపారంలో మునిగిపోతా. ఆఫీసు కార్యకలాపాలకే ప్రాధాన్యం. ఈ మధ్య మన దగ్గర రేసింగ్ సంస్కృతి పెరుగుతోంది. భవిష్యత్తులో రేసింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నా. తెలంగాణతో మొదలుపెట్టి దేశవ్యాప్తంగా ట్రాక్‌లు నిర్మించాలన్నది లక్ష్యం.



'ఎఫ్' ఫర్...

రేసింగ్ ప్రపంచంలో ఎఫ్1 అత్యున్నతమైనది. ఎఫ్4, ఎఫ్3, ఎఫ్2 నుంచి ఎఫ్1కు వెళ్ళాలి. ఇంజిన్ కెపాసిటీ ఒక్కటే. స్పీడ్ భిన్నం. ఎఫ్1లో గంటలకు 325 కిమీ వేగంతో వెళ్తారు. ఎఫ్3, ఎఫ్4లో 200 కిమీ వేగంతో రేసింగ్ చేస్తారు. ఈ కార్లు ఎక్కువ స్పీడ్‌ను తీసుకోలేవు.

తక్కువ వయసుకే ప్రాధాన్యం...

5 నుంచి ఏడేళ్ళ వయసులో రేసింగ్ ఆరంభించాలి. ఎంత చిన్న వయసులో మొదలుపెడితే అంత మంచి భవిష్యత్తు ఉంటుంది. 19 ఏళ్ళ లోపు ఎఫ్3లో ఛాంపియన్ అవ్వాలి. అప్పుడే ఎఫ్1కు వెళ్ళే అవకాశముంటుంది. కొత్త డ్రైవర్‌పై పెట్టుబడి పెట్టాలనుకునే ఎఫ్1 జట్టు తక్కువ వయసున్న డ్రైవర్లను ఎంచుకుంటుంది.

వసుంధర

అది 1980ల నాటి గోదావరి తీరంలోని పల్లె. ఏ వీధి చూసినా పెంకుటిళ్లూ, పచ్చని కొబ్బరిచెట్లూ, ముంగిట్లో అందమైన ముగ్గులతో ఆ పల్లె ఆకట్టుకుంటుంది. పేరుకే అది ఊరు కానీ అక్కడెవరూ ఉండరు. అదేంటీ అంటారా.. అవును మరి ఆ గ్రామం పేరు రంగస్థలం. ఆ సినిమా కోసం మౌనికా రామకృష్ణ సబ్బాని జూబ్లీహిల్స్‌లో వేసిన సెట్టింగు అది. అదొక్కటే కాదు... 'అందాల రాక్షసి', 'సాహసం', 'సుబ్రమణ్యం ఫర్ సేల్'... ఎలా ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలకు పనిచేసి అవార్డులూ.. అంతకు మించి ప్రశంసలెన్నో అందుకుంది. అంతేనా ఎన్టీఆర్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రానికి 1920ల నాటి వాతావరణాన్ని సృష్టిస్తున్న ఆమె తమ గురించి ఏం చెబుతోందంటే...



"నందమూరి తారక రామారావు పేరుచెబితే గర్వించని తెలుగువారుండరు. అంత గొప్ప వ్యక్తి జీవిత గాథ కోసం పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాం. దర్శకుడు మాకు ఆ విషయం చెప్పగానే ఆ మహానుభావుడి గురించి ఇంకా తెలియని విషయాలు తెలుసుకోవడం మొదలుపెట్టాం. ఈ చిత్రంలో ఆయన పుట్టక ముందు నుంచీ చూపిస్తారు. 1920ల్లో వాతావరణం ఎలా ఉంటుందో తెలుసుకోవడం మొదలుపెట్టాం. పుస్తకాలూ, పత్రికలూ, ఆయన చిత్రాలు సేకరిస్తున్నాం. ఇప్పటికే సెట్ నిర్మాణం ప్రారంభమైంది. త్వరలోనే చిత్రీకరణ కూడా మొదలు కాబోతోంది. దీంతోపాటు 'సవ్యసాచి', వరుణ్ తేజ్ సినిమాలు చేస్తున్నాం."


• • • • •

"మేం ఒక సినిమాకి పనిచేస్తే పలు చిత్రాలకు అవకాశాలు వస్తుంటాయి. అలాగని మేం వచ్చిన ప్రతి సినిమాకీ పని చేయాలనుకోం. నాణ్యతతో కూడిన తుది ఫలితాన్ని అందించాలనే ఉద్దేశంతో సమయం వెసులుబాటు చూసుకుంటాం. అందుకే 'నాన్నకు ప్రేమతో' వంటి భారీ బడ్జెట్ సినిమా వచ్చినా వదులుకున్నాం. అయినా ఆ దర్శకుడు 'రంగస్థలం' సినిమా బాధ్యతలను మా మీదే పెట్టారు"

"జీవిత భాగస్వామిగా భార్యాభర్తలు ఒకింట్లో నెగ్గడం ఈ రోజుల్లో కాస్త కష్టమే. అలాంటిది పని వాతావరణంలోనూ మేం భాగస్వాములుగా నెగ్గుతున్నాం. నిజంగా మాకు ఇది సవాలే. ఒక ప్రాజెక్టు రాగానే ఇద్దరం వింటాం. కాసేపటికి వేరువేరుగా ఓ ప్రణాళిక వేసుకుని కొన్ని డ్రాయింగులు గీసుకుంటాం. ఆ తరవాత ఎవరి ఆలోచనలు ఏంటి అనేది చర్చించుకుంటాం. ఇద్దరి ఆలోచనల్లో ఏది బాగుంటే దానికి అనుగుణంగా సెట్టింగుల నిర్మాణం మొదలుపెడతాం. కలిసి పనిచేస్తూ.. సహాయకులతో చేయించుకుంటాం. ముఖ్యంగా మధు, కిరణ్ అనే సహాయకులు ఎప్పుడూ నాకు అండగా ఉంటారు "



రంగస్థలం C/o జూబ్లీహిల్స్





తెలుగు చిత్ర పరిశ్రమలో స్వతంత్ర కళాదర్శకురాలిగా గుర్తింపు కార్డు అందుకున్న తొలి మహిళ మౌనిక. ఆమె ఈ రంగంలోకి రావడానికి చిన్నతనం నుంచీ చూసిన సినిమాలే కారణం అంటుంది. 'అవును.. నాకు చిన్నతనం నుంచీ సినిమాలంటే ఇష్టం. అందుకే పుట్టి పెరిగిన దిల్లీ నుంచి పుణె వెళ్లా. అక్కడ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో ప్రొడక్షన్ డిజైనింగ్ అండ్ ఆర్ట్ డైరక్షన్‌లో శిక్షణ తీసుకున్నా. అక్కడే నాకు మావారు రామకృష్ణ పరిచయం అయ్యారు. కొన్నాళ్లకి మా స్నేహం ప్రేమగా మారి వ్యక్తిగత, వృత్తిగత జీవితంలో భాగస్వాములమయ్యాం.

తొలి చిత్రానికి నంది: మా గురించి వ్యక్తిగతంగా చెప్పుకోవడానికి ఇంతకు మించి లేకపోవచ్చు కానీ వృత్తిగతంగా చాలా ఉంది. ఇద్దరం కలిసి ఇప్పటి వరకూ ఇరవైకిపైగా సినిమాలకు పని చేశాం. దీనికంటే ముందు మేం పుణెలో శిక్షణ పూర్తి చేసుకుని ముంబయి వెళ్లాం. అక్కడ కళాదర్శకులు సాబుసిరిల్, సమీర్ చంద్ర వద్ద సహాయకులుగా చేరి రెండు చిత్రాలకి పనిచేశాం. అదే సమయంలో కొన్ని వాణిజ్య ప్రకటనలూ చేస్తుండే వాళ్లం. ఇంతలో దర్శకుడు హను 'అందాల రాక్షసి'కి పని చేయమన్నారు. ఇందులో నవీన్ చంద్ర మొరటు స్వభావమున్న పాత్ర. కానీ అతను చిత్రాలు గీస్తూ.. స్క్రాప్‌తో కళాకృతులు వేస్తుంటాడు. అవన్నీ చేసింది మేమే. అందులోనే షెడ్డూ, సీసాలతో లావణ్య త్రిపాఠి బొమ్మ మేం చేసిందే. అదే మేం స్వతంత్రంగా చేసిన మొదటి సినిమా. దానికి నంది అవార్డునూ అందుకున్నాం.

ఆ వీడియోలు చూశాం: తరువాత 'సాహసం' సినిమా చేసే అవకాశం వచ్చింది. పాకిస్థాన్ నేపథ్యంలో తీసిన చిత్రమది. పాక్ గ్రామాన్ని లద్దాక్‌లో సెట్ వేశాం. ఈ సినిమాలో మెట్ల బావీ, గదులూ.. ప్రధానంగా ప్రేక్షకుల్ని ఆకర్షిస్తాయి. వాటిని రామోజీఫిలింసిటీలో కట్టాం. ఆ సమయంలో రామోజీరావు సర్ మా సెట్ చూడ్డానికి వచ్చి... అభినందించారు. ఈ చిత్రం కోసం బెలూచిస్థాన్, లాహోర్‌లోని పల్లెటూళ్లు, వాళ్లు వాడే వస్తువులు... ఇలా అన్నింటి గురించి తెలుసుకున్నాం. మానవబాంబుని ఎలా తయారు చేస్తారో తెలుసుకోడానికి చాలా వీడియోలు చూడాల్సి వచ్చింది. అందులో బాంబు పేలుళ్లు చూసి మనసు కల్లోలమైపోతుండేది. కొన్ని సార్లు నిద్ర కూడా పట్టేది కాదు.

నాని అలా అన్నారు: 'జ్యో అచ్యుతానంద' చిత్రం చూసినవారు ఇందులో సెట్టింగ్స్ ఏం ఉన్నాయని ఆశ్చర్యపోతున్నారు. నిజానికి కళాదర్శకులకి అదే పెద్ద ప్రశంస. 'అరే ఆ సెట్ నిజంగానే ఇల్లు అనుకున్నాం' అని చెప్పినప్పుడు సంతోషంగా అనిపిస్తుంది. ఈ చిత్రంలో హీరోల ఇంటిని ఓ కొండ మీద సెట్‌గా వేశాం. మధ్య తరగతి వాళ్ల ఇల్లు.. వారు వాడే వస్తువులు ఇలా అన్నీ పక్కాగా ఆలోచించాం. నిజానికి నాకూ, మావారికి పల్లెటూరి నేపథ్యం లేదు. కానీ హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో 70, 80ల నాటి ఇళ్లు గమనించి ఆ అంచనాలతో సెట్ వేశాం. అదీ నలభై ఐదు రోజుల్లో పూర్తి చేశాం. తీరా పూర్తయ్యాక హైదరాబాద్‌లో పెద్ద గాలీ, వానా. తెల్లవారాక మా సహాయకుడు వెళ్లి ఆ సెట్‌ని చూసి ఏడుస్తూ ఫోన్ చేశాడు. ఆ రోజు నగరంలో ఎన్నో చెట్లూ, హోర్డింగులూ కూలిపోయాయి. అదృష్టం ఏంటంటే... మేం సెట్‌ని కాస్త దృఢంగానే వేయడంతో అద్దాలూ, తలుపులు మాత్రమే పగిలిపోయాయి. దాంతో నీళ్లు లోపలికి వెళ్లిపోయాయి. ఓ నలభై శాతం మళ్లీ కొన్ని మార్పులు చేయాల్సి వచ్చింది. అంత కష్టపడ్డాం కాబట్టే ఆ సినిమా పూర్తి అయ్యాక చాలామంది 'ఆ ఇల్లు ఎక్కడ ఉంది.. మేం చిత్రీకరణ చేసుకుంటాం' అని అడిగారు. నటుడు నాని 'మా అమ్మమ్మగారి ఇల్లు అచ్చం అలానే ఉంటుంది' అన్నారు. ఇక, 'సుబ్రమణ్యం ఫర్ సేల్'లో హీరో పనిచేసే రెస్టారెంట్ బయట ప్రదేశాన్ని విదేశాల్లో, గదుల లోపలి సెట్‌నేమో హైదరాబాద్‌లో వేశాం. ఇవన్నీ ఒకెత్తయితే.. రాబోయే 'రంగస్థలం' గురించి ఎంత చెప్పినా తక్కువే.

మళ్లీ నిర్మించాం: గోదావరి పల్లెటూరి వాతావరణంలో సాగే చిత్రమిది. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణకు అనువుగా ఉంటుందని వెళ్లాం. నిజానికి అక్కడ పల్లెలు చాలా అభివృద్ధి అయ్యాయి. అన్నీ సీసీ రోడ్లూ, విద్యుత్ దీపాలూ, డాబాలూ, ఏసీ సౌకర్యాలు.. అబ్బో ఇలా చాలానే కనిపించాయి. నిజానికి 80ల నాటి వాతావరణం ఉన్నట్టు ఏ పల్లెటూళ్లోనూ కనిపించలేదు. దాంతో పోలవరం పరిసరాల్లో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించాం. పల్లెటూరి సెట్‌ని జూబ్లీహిల్స్‌లోనే ఓ పాతిక ఎకరాల ఖాళీ స్థలంలో వేశాం. అలానే ఆ కాలంలో వాడే వస్తువులూ, మంచాలూ, దుస్తులూ, వంట పాత్రలూ, రోలూ, తిరగలి... ఇలా అన్ని రకాల వాటి గురించి తెలుసుకుని ప్రత్యేకంగా తయారు చేయించాం. గుడిసెలు వేసి.. చుట్టూ తడికెలూ, మట్టిరోడ్లూ, ప్లాస్టిక్‌తో పచ్చని మొక్కలు తయారు చేసి.. అచ్చంగా అది పల్లెటూరేనా అనేలా సెట్ వేశాం. దాదాపు రెండు నెలలు కష్టపడి పనిచేయించాం. ప్రతిరోజూ ఐదొందల మంది కార్మికులు రాత్రీపగలు కష్టపడ్డారు. తీరా అంతా అయ్యాక వర్షం వచ్చింది. దాంతో మా పల్లె నీట మునిగింది. ఈ నీళ్లని ఆ స్థలం పక్కన ఉన్న గుంతలోకి మళ్లించాం. దాంతో నిజంగా గోదావరి ఒడ్డున గ్రామం ఉన్నట్టే కనిపించింది. మళ్లీ మార్పులు చేశాం. వీటితో పాటు స్కూళ్లూ, ఆసుపత్రులూ, నగరం.. ఇలా ఇంకొన్ని కట్టాం. మా సెట్‌ని చూడ్డానికి ప్రత్యేకంగా చిరంజీవి సర్, రాజమౌళి సర్ దంపతులు వచ్చారు. పైగా రామ్‌చరణ్ తరచూ సెట్ విశేషాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ మమ్మల్ని అభినందిస్తుండేవారు' అంటూ ఆనందంగా చెబుతున్నారు మౌనిక.

– పద్మ వడ్డె

మొదటిసారైతే... పుషప్స్ మంచివే

వ్యాయామం చేయాలని మనసులో ఉన్నా... ఎలా మొదలుపెట్టాలో, ఏవి చేయాలో తెలియక చాలామంది వాయిదా వేస్తుంటారు. అది ఓ కొలిక్కి రాక అక్కడే ఆగిపోతారు. మరేం చేయాలంటే...



నిర్ణయించుకోండి... : వ్యాయామం చేయాలన్న ఆలోచన రావడంతోనే మొదలుపెట్టేసినట్లు కాదు. ముందు మీకు ఏ సమయం అనువుగా ఉంటుందో ఓ స్పష్టత తెచ్చుకోండి. దానికి తగ్గట్లుగా ప్రణాళిక వేసుకోండి. అప్పుడే ఎంత సమయం కేటాయించుకోగలుగుతారో ఓ అవగాహన వస్తుంది. గంటయినా, అరగంటయినా సరే... క్రమం తప్పకుండా చేసేలా చూసుకోండి. వ్యాయామం ఉదయం అయితేనే మేలు. లేదంటే సాయంత్రం నాలుగైదుగంటలప్పుడు చేస్తే విటమిన్ డి కూడా శరీరానికి అందుతుంది.

ఎక్కడ చేయాలీ... : అవును.. ఇంతకీ వ్యాయామం ఎక్కడ చేయాలనుకుంటున్నారు... ఇంట్లోనా, జిమ్‌లోనా అంటే... మొదటిసారి ప్రారంభించే వాళ్లు జిమ్‌కి వెళ్లడమే మేలు. ఎందుకంటే రకరకాల సాధనాలు మీలో ఉత్సాహాన్నివ్వడమే కాదు. నిపుణుల ఆధ్వర్యంలో చేయడం వల్ల ఏకాగ్రతా ఉంటుంది.

ఎలాంటి వ్యాయామాలు... : పుషప్స్, స్క్వాట్స్, ప్లాంక్స్, జంప్స్ వంటివన్నీ చేయొచ్చు. అయితే ఎప్పుడూ ఒకే తరహావి కాకుండా రోజూ కనీసం ఓ ఐదు రకాల్ని ఎంచుకుంటే మంచిది. అవి మీ కండరాల్ని దృఢంగా మారుస్తాయి. శరీరంలోని ప్రతి కండరం చురుగ్గా పనిచేయడం మొదలుపెడుతుంది. ఎన్నిసార్లు చేయాలనేదీ నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

ఆహారం: బరువుతగ్గించుకోవడంతోపాటూ దానికి అవసరమయ్యే శక్తిని సమన్వయం చేసుకోవడం తప్పనిసరి. అందుకు క్రమపద్ధతి ఉండాలి. అప్పుడే బరువు మీరనుకున్నట్లు తగ్గుతారు. అందుకే ఆహారంలో మార్పులూ మొదలుపెట్టాలి. పండ్లూ, కూరగాయలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి.

ఉసిరి నూనెతో పట్టులా..

జుట్టుకి తగిన సంరక్షణ లేకపోతే రాలిపోవడం, చిట్లిపోవడం వంటి ఇబ్బందులెన్నో ఎదురవుతుంటాయి. అందుకే ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి.



- **కొబ్బరి నూనె:** జుట్టు ఏ మాత్రం పొడిబారి పీచులా అయినా సరే! కొబ్బరినూనెను కొద్దిగా వేడిచేసి తలకు మర్దన చేయాలి. ఆపై కాసేపు తలకు ఆవిరిపెడితే చాలు జుట్టు మృదువుగా మారుతుంది. కుదుళ్లూ బలంగా ఉంటాయి. కొబ్బరినూనెలో కరివేపాకు వేసి మరిగించి రాసుకుంటే తల నెరవదు.
- **బాదంనూనె:** దీన్ని తరచూ తలకు రాయడం వల్ల పలు పోషకాలు జుట్టుకు అందుతాయి. కుదుళ్లు గట్టిపడతాయి. దీన్ని ఇతర నూనెలతో కలిపి కూడా తలకు పెట్టుకోవచ్చు. మాడునీ, జుట్టునీ ఆరోగ్యంగా ఉంచుతుంది.
- **ఉసిరి నూనె:** ఈ నూనెను కనీసం వారం రోజులకోసారి పెట్టుకుని మర్దన చేయడం చేయడం వల్ల నిర్జీవంగా ఉన్న జుట్టు పట్టులా మారుతుంది. రాలే సమస్యా తగ్గుతుంది. ఇది అందుబాటులో లేకపోతే గనుక ఉసిరిపొడిని కొబ్బరినూనెలో కలిపి మరిగించి తలకు రాసుకోవచ్చు. ఇలా వారానికోసారి చేస్తే మంచిది.



బంగారం వెండి

23న ముగింపు-క్రితం



	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,540	31,600	31,570	31,300
ఆర్నమెంట్	29,700	29,530	29,300	29,000
వెండి (కిలో)	39,500	39,500	39,800	39,500
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	31,400	31,350	30,860	30,690
ఆర్నమెంట్	29,120	29,070	29,390	29,230
వెండి (కిలో)	39,600	39,600	41,600	41,600
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,490	31,370	-------	-------
ఆర్నమెంట్	29,290	29,180	2,939	2,923 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.60	41.60 గ్రా

నల్లేరును పెంచడం సులువే!

పసిపిల్లల నుంచి వయోవృద్ధుల వరకూ ఎముకల పటుత్వానికైనా, వాటికి సంబంధించిన సమస్యలను తగ్గించడంలోనైనా అగ్రతాంబూలం నల్లేరుకే ఇవ్వాలి. నల్లేరును 'అస్థి సంహార', 'వజ్రవల్లి' అని అంటారు. ఈ రెండు పేర్లూ ఎముకల దృఢత్వాన్ని పెంచడంలో నల్లేరు పాత్రను వ్యక్తపరిచేవే. ఇది మనదేశానికి చెందిన మొక్కే. దీని శాస్త్రీయ నామం సిస్సస్ క్వాడ్రాంగ్యులారిస్.



నల్లేరు ద్రాక్ష కుటుంబానికి చెందిన బహువార్షికం. దీన్ని అడమెంట్ ప్లాంట్ అని కూడా అంటారు. నాలుగు పలకలుగా ఉండే కాండంతో, కణుపులుగా ఉండి, వేగంగా పెరిగే తీగజాతి మొక్క. ఇది దాదాపు రెండు మీటర్ల ఎత్తు వరకూ పెరుగుతుంది. కణుపుల మధ్య దూరం దాదాపు 3-5 అంగుళాలు ఉంటుంది.

గుత్తులుగా పూలూ...

ప్రతి కణుపు దగ్గర ఒకవైపు మూడుగా చీలిన వెడల్పాటి ఆకూ, రెండోవైపు సన్నని నులితీగ ఉంటాయి. ఈ నులితీగల సాయంతోనే నల్లేరు ఆధారాన్ని పట్టుకుని ఎగబాకుతుంది. దీని పూలు తెలుపూ/ లేత పసుపు/ లేతాకుపచ్చ రంగులో చిన్నచిన్న గుత్తుల్లో పూస్తాయి. గుత్తుల్లో కాసే గుండ్రని చిన్న చిన్న కాయలు పండినప్పుడు ఎర్రగా అందంగా ఉంటాయి.

నల్లేరు ఎలాంటి నేలలోనైనా పెరుగుతుంది. మరీ వెలుతురు అస్సలు రాని చోట తప్ప ఎక్కడైనా పెంచుకోవచ్చు. నీళ్లు రోజూ పోయాల్సిన పనిలేదు. చీడపీడల భయంలేదు. అలాగే పెద్దగా ఎరువుల అవసరం కూడా లేదు. మట్టి మిశ్రమంలో కొంచెం కంపోస్టు లేదా పశువుల ఎరువు కలిపితే సరిపోతుంది.

కూరగాయగానూ...

నల్లేరు తరతరాలుగా ఔషధ మొక్కగా ప్రాచుర్యంలో ఉంది. ఎముకలను ఆరోగ్యవంతంగా ఉంచడంలో, విరిగిన ఎముకలు అతికేలా చేయడంలో నల్లేరుకు సాటి వేరే లేదు. ఎముకలు అతకడానికే కాకుండా కండరాలు దెబ్బతిన్నా, లిగమెంట్లు విరిగిపోయినా కూడా నల్లేరు అద్భుతంగా పనిచేస్తుంది. బరువును తగ్గించడంలో కూడా నల్లేరు పాత్ర చెప్పుకోదగ్గదే. ఎముకలూ, కండరాల సమస్యలను త్వరితంగా పరిష్కరించడమే కాకుండా ఆ సమయంలో ఉండే నొప్పుల్నీ, వాపుల్నీ ఈ మొక్క తగ్గిస్తుందట. అలాగే స్త్రీలకు సంబంధించిన వ్యాధుల నివారణలో కూడా నల్లేరు చాలా మంచి ఔషధమట.

ఈ మొక్క వాడకం చాలా సులువు. చక్కగా కూరగాయలా దీన్ని వాడుకోవచ్చు. దీంతో రోటి పచ్చడి చేసుకోవచ్చు. కూర వండుకోవచ్చు. బజ్జీలు వేసుకోవచ్చు. ఇలా మరెన్నో సొంతంగా మీరూ ప్రయత్నించవచ్చు. నల్లేరు తరచూ వాడుతుంటే ఎముకల క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయట. ఇది పైల్స్‌ను తగ్గిస్తుందట. అల్సర్, ఉబ్బసాన్ని అదుపులో ఉంచుతుందట. రక్తహీనతను కూడా అరికడుతుందట. నల్లేరు కొమ్మను కోసి దాంతో తుడిస్తే తుప్పు మరకలు పోతాయట. ఈ మొక్కను కణుపులను నాటుకుని సులువుగా ప్రవర్ధనం చేయవచ్చు. చూడటానికి చక్కగా ఉండి, అద్భుతమైన ఔషధ లక్షణాలున్నాయి. కూరగాయగానూ వాడుకోవచ్చు. ఇంటి శుభ్రతకు పనికొస్తుంది. నల్లేరును తెచ్చుకోవడానికి ఆలోచిస్తారా!





ఈ జాగ్రత్తలు అమ్మలకే!

అమ్మగా మారిన తరువాత ఆనందానికి అంతుండదు. చిన్నారి రాక జీవితంలో ఎన్నో సంతోషాలను తెస్తుంది. వీటితోపాటు కొత్త బాధ్యతలూ పెరుగుతాయి. అయితే చిన్నారి సంరక్షణలో భాగంగా కొన్ని జాగ్రత్తలు మీకంటూ తీసుకోవాలి.

- చాలామంది తల్లులు చిన్నారులను ఎప్పుడూ ఎత్తుకునే ఉంటారు. ఇలా చేయడం వల్ల తరచూ నడుం నొప్పి సమస్య బాధిస్తుంది. ఇప్పుడు పిల్లల్ని ఎత్తుకునేందుకు వీలుగా బేబీ కారియర్స్ దొరుకుతున్నాయి. వాటిని ఎంచుకుంటే నడుమునొప్పి సమస్య చాలామటుకూ అదుపులో ఉంటుంది.
- శిశువులకు పాలిచ్చే సమయంలో తల్లులు ముందుకు వంగుతారు. ఈ స్థితిలో చాలాసేపు ఉండటం వల్ల మెడా, భుజం కండరాలు పట్టేస్తాయి. కాబట్టి కూర్చునే ముందు తలగడకు ఆనుకుంటే మంచిది.
- ఓ వైపు ఇంటిపనులూ, మరోవైపు పాపాయి అవసరాలు తీర్చే క్రమంలో ఒత్తిడీ, అలసటా తప్పదు. ఈ సమస్యకు పరిష్కారం అవకాశం కుదిరినప్పుడల్లా విశ్రాంతి తీసుకోవడమే. కాసేపు ధ్యానం చేసినా, ఒత్తిడి తగ్గుతుంది.
- అన్నిపనులూ మీరే చేయాలని చూడకుండా కొన్నింటిని ఇతర కుటుంబసభ్యులకూ అప్పగించండి.

ఏ పద్ధతి సరైందో తెలియట్లేదు!

నాకు రొమ్ములో గడ్డ ఉన్నట్టు ఈ మధ్యనే గుర్తించా. వెంటనే వైద్యుల్ని సంప్రదిస్తే అన్ని పరీక్షలు చేసి క్యాన్సర్ అని తేల్చారు. అంతేకాదు చికిత్సలో భాగంగా రొమ్మును పూర్తిగా తొలగించొచ్చు, లేదంటే పరిస్థితిని బట్టి కేవలం గడ్డను మాత్రమే తీసేయొచ్చు అని చెప్పారు. అయితే నాకు దేనివల్ల మంచి ఫలితం ఉంటుందో తెలియడం లేదు. దేన్ని ఎంచుకోవచ్చు.

– ఓ సోదరి

డియర్ వసుంధర



డా॥ గీతానాగశ్రీ
క్యాన్సర్ శస్త్రచికిత్సా నిపుణురాలు

మీరిక్కడ కంగారుపడాల్సిన అవసరం లేదు. రొమ్ము తొలగించకుండానే చికిత్స చేయించుకోవడానికే మహిళలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. క్యాన్సర్ నిపుణులూ, అధ్యయనాల ప్రకారం చూస్తే రెండు విధానాల వల్ల కూడా ఒకేలాంటి ఫలితాలు ఉంటాయి. క్యాన్సర్ వచ్చింది అనగానే రొమ్మును పూర్తిగా తొలగించడం పాత పద్ధతి. ఇప్పుడు అలా కాదు. వీలైనంతవరకూ రొమ్మును తీసేయకుండానే చికిత్స చేయడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాం. అంతకన్నా ముందు గడ్డ, రొమ్ము పరిమాణం బట్టి రొమ్ము ఆకృతి ఏ మాత్రం పోకుండానే చికిత్స చేస్తారు. కొన్నిసార్లు గడ్డ పరిమాణాన్ని బట్టి కీమోథెరపీ ద్వారా కూడా దాన్ని కరిగించే ప్రయత్నం చేస్తాం. ఒకవేళ ఆ క్యాన్సర్ లింఫ్ గ్రంథులకూ చేరిందని పరీక్షలో తేలితే... ఏ పద్ధతిలో అవసరం మేరకు ఆ గ్రంథుల్ని కూడా కొంతవరకూ తీసేయాల్సి ఉంటుంది. కాబట్టి మీరు భయపడకుండా మరోసారి వైద్యుల్ని సంప్రదించండి. లోపల ఏర్పడిన గడ్డ, దాని దశ... ఇలా రకరకాల పరీక్షల అనంతరం చికిత్స ఏం విధంగా చేయాలీ అనేది వైద్యులు నిర్ణయిస్తారు. ఆ తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తల్నీ వివరిస్తారు.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.



ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటు ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న రాహుల్‌గాంధీ, ఖర్గే, కేవీపీ, టి.సుబ్బిరామిరెడ్డి తదితరులు

భాజపా 'అసత్యాల పరిశ్రమ' మళ్లీ పనిచేస్తోంది!

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ విమర్శల పరంపర

దిల్లీ: భాజపాపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్విటర్‌లో విమర్శల పరంపర కొనసాగిస్తున్నారు. ఆ పార్టీ 'అసత్యాల పరిశ్రమ' మళ్లీ పనిచేస్తోందంటూ శుక్రవారం విమర్శించారు. 'కేంబ్రిడ్జ్ అనలిటికా' వ్యవహారానికి సంబంధించి - డేటా చౌర్యంపై కేంద్రం కట్టుకథలు అల్లుతోందంటూ గురువారం ఆరోపించిన రాహుల్ కొనసాగింపుగా మరిన్ని విమర్శలు చేశారు. కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తూ భాజపా వాస్తవాలను మరుగున పడేస్తోందని పేర్కొన్నారు. అసత్యాలను ప్రచారం చేసేందుకు కేబినెట్ మంత్రిని రంగంలోకి దించిందని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన 'కేంబ్రిడ్జ్ అనలిటికా భారత్‌తో సంబంధం'పై వచ్చిన ఓ వార్తాకథనాన్ని కూడా జతచేశారు.

కాంగ్రెస్ ఎంపీల నిరసన: రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం ముందు శుక్రవారం నిరసన చేపట్టారు. ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాల నిరోధక చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యపరమైన అసౌకర్యం..
సిమ్లా నుంచి దిల్లీకి సోనియాగాంధీ

సిమ్లా: యూపీఏ సారథి సోనియాగాంధీ(71) గురువారం రాత్రి బాగా పొద్దుపోయాక తనకు ఆరోగ్య పరంగా అసౌకర్యంగా ఉందంటూ చెప్పడంతో ఆమెను వెంటనే దిల్లీకి తరలించారు. వాస్తవానికి ఇక్కడి ఛారాబ్రలో తన కుమార్తె ప్రియాంక నిర్మించుకుంటున్న ఇంటిపనులను చూసే నిమిత్తం సోనియా వచ్చారు. అయితే, అర్ధరాత్రి దాటాకా ఆమె తనకు ఇబ్బందిగా ఉన్నట్లు చెప్పారు. ఆమె వెంటే ఉన్న బృందంలోని వైద్యుడు వెంటనే తనకు ఫోన్‌చేసి చెప్పినట్లు ఇందిరాగాంధీ వైద్యకళాశాల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. రమేష్‌చంద్ చెప్పారు. వెంటనే ఆమె తన సొంతకారులో, వైద్యబృందం ఉన్న అంబులెన్స్ వెంటరాగా దిల్లీకి వచ్చారు. ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళులు అర్పించిన ప్రధాని, పార్లమెంటు

దిల్లీ: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. వారి వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం మోదీ అంజలి ఘటించారు. "భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల బలిదానాలు దేశ చరిత్రలో నిలిచిపోతాయి. వారు భారతీయులైనందుకు.. దేశవాసులంతా గర్వపడుతున్నారు" అని మోదీ ఓ సందేశంలో వ్యాఖ్యానించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు రాజ్యసభ, లోక్‌సభలు కూడా నివాళులు అర్పించాయి. శుక్రవారం రాజ్యసభ కార్యకలాపాల ప్రారంభ సమయంలో సభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు వారి త్యాగాలను స్మరించుకున్నారు.

కలబుర్గి హత్యకేసులో ఎన్ఐఏ దర్యాప్తు కుదరదు

దిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అనేది జాతీయ, అంతర్ రాష్ట్ర ఉగ్రవాద కేసులను దర్యాప్తు చేయడానికి ఉద్దేశించిందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం సుప్రీం కోర్టుకు తెలిపింది. అందువల్ల 2015లో కర్ణాటకలో ప్రముఖ సాహితీవేత్త, హేతువాది ఎం.ఎం.కలబుర్గి హత్య కేసును ఈ సంస్థ దర్యాప్తు చేయజాలదని విన్నవించింది. ఈ కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో దర్యాప్తు జరిపించాలని హతుడి భార్య ఉమాదేవి పిటిషన్ వేశారు. మహారాష్ట్రలో జరిగిన రెండు హత్యలకు తన భర్త కేసుకు మధ్య సారూప్యం ఉందని పేర్కొన్నారు. అందువల్ల మహారాష్ట్ర, కర్ణాటక పోలీసులు, సీబీఐ, ఎన్ఐఏ మధ్య సమన్వయం ఉండాలన్నారు. దీంతో రెండు రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఎన్ఐఏ, సీబీఐల స్పందనను జనవరి 10న కోరింది. ఈ కేసు ఎన్ఐఏ చట్టం పరిధిలోకి రాదని కేంద్రం తరపున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ పింకీ ఆనంద్ తాజాగా విన్నవించారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కేసును జులై మొదటి వారానికి వాయిదా వేసింది.

ఐఎస్ అనుమానితుడి దాడి.. ముగ్గురి మృతి

ఫ్రాన్స్‌లో సూపర్ మార్కెట్‌లో ఘటన

ట్రెబెస్(ఫ్రాన్స్): నైరుతి ఫ్రాన్స్‌లోని ట్రెబెస్‌లోఉన్న ఓ సూపర్ మార్కెట్‌పై శుక్రవారం ఓ సాయుధుడు విరుచుకుపడ్డాడు. తీవ్రవాదిగా అనుమానిస్తున్న ఈవ్యక్తి జరిపిన కాల్పుల్లో ముగ్గురువ్యక్తులు మృతి చెందారు. భద్రతా సిబ్బంది ఆ సాయుధుడిని కాల్చి చంపేశాయి. కాగా, ఈ ఘటనలో గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అసలీ ఘటన తీవ్రవాద ఘాతుకంగా కనిపిస్తున్నట్లు ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్పే పేర్కొన్నారు. మతపరమైన విశ్వాసాన్ని ప్రతిబింబించే నినాదాలు చేస్తూ అతడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ దాడి నిర్వహించింది తామేనని ఇస్లామిక్ స్టేట్ జిహాదీ వర్గం బీరుట్‌లో ప్రకటించుకుంది.

భారత్‌లో ఒక్కొక్కరు 5.1 లీటర్ల బీరు లాగిస్తున్నారు

దిల్లీ: భారత్‌లో ఏడాదికి ఒక్కో వ్యక్తి సగటున 5.1 లీటర్ల చొప్పున బీరు సేవిస్తున్నట్లు ఓ అధ్యయనం తేల్చింది. ఆసియా వ్యాప్తంగా లెక్కగడితే.. ఒక్కొక్కరు సగటున 20.9 లీటర్ల బీరును తాగుతున్నట్లు పేర్కొంది. ఆసియాలో అతితక్కువగా బీరు వినియోగం ఉన్న దేశాల్లో భారత్ కూడా ఉందని.. అయితే డిమాండు పెరిగే అవకాశాలు ఇక్కడ మెండుగా ఉన్నాయని తెలిపింది.

చరిత్ర సృష్టించిన ఎయిర్ ఇండియా!

ఇజ్రాయెల్‌కు తొలి భారతీయ విమానం

టెల్ అవీవ్: భారత్-ఇజ్రాయెల్ సంబంధాల్లో నూతన అధ్యాయం! ఆ దేశానికి తొలిసారిగా ఎయిర్ ఇండియా (ఏఐ) తన విమాన సేవలను ప్రారంభించింది. సౌదీ అరేబియా విధించిన దశాబ్దాల గగనతల నిషేధానికి ముగింపు పలుకుతూ- ఆ దేశం మీదుగా ఏఐ విమానం ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ విమానాశ్రయానికి చేరుకోవడం విశేషం. గురువారం దిల్లీలో బయల్దేరిన ఏఐ139 విమానం- ఒమన్, సౌదీఅరేబియా, జోర్డాన్ మీదుగా కేవలం 7.25 గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకుంది. ఇజ్రాయెల్‌కు చెందిన ఈఐఏఐ విమానం కంటే దీని ప్రయాణ సమయం 2.10 గంటలు తక్కువ! ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో ఏఐ విమానం ఇజ్రాయెల్‌కు వెళ్తుందని ఎయిర్ ఇండియా సీఎండీ ప్రదీప్ ఖరోలా తెలిపారు. ఇదొక చరిత్రాత్మక ఘట్టమనీ, ఇకపై ఉభయ దేశాల మధ్య పర్యాటకుల సంఖ్య భారీగా పెరిగే అవకాశముందని ఇజ్రాయెల్ పర్యాటక మంత్రి యారివ్ లెవిన్ అన్నారు. భారత విమానం తన భూభాగం మీదుగా వెళ్లేందుకు సౌదీ అంగీకరించడం... మనదేశ నూతన ప్రతిష్ఠకు దర్పణం పడుతుందని పౌర విమానయానశాఖ మంత్రి సురేష్ ప్రభు పేర్కొన్నారు.

అమెరికా ఎన్ఎస్ఏను మార్చిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికా జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఏ) పదవి నుంచి లెఫ్టినెంట్ జనరల్ హెచ్ఆర్ మెక్‌మాస్టర్‌ను ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలగించారు. ఆ స్థానంలో గతంలో ఐరాసలో అమెరికా రాయబారిగా పనిచేసిన జాన్ బోల్టన్‌ను నియమించారు. కొద్ది రోజుల క్రితం విదేశాంగమంత్రిని కూడా ట్రంప్ మార్చిన సంగతి తెలిసిందే.

రూ.84.46 లక్షల కోట్ల వ్యయబిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదం: అమెరికా ప్రభుత్వం మరోసారి మూతపడటాన్ని నివారిస్తూ.. రూ.84.46 లక్షల కోట్ల భారీ వ్యయ బిల్లును ఆ దేశ సెనేట్ ఆగమేఘాల మీద ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 65 ఓట్లు రాగా.. వ్యతిరేకంగా 32 ఓట్లు వచ్చాయి. ఫెడరల్ వ్యయానికి శుక్రవారం అర్ధరాత్రితో గడువు తీరుతుండటంతో.. ఆలోపు ఈ బిల్లు ఆమోదం పొందకుంటే మళ్లీ అమెరికా ప్రభుత్వం మూతపడేదే. ఇప్పటికే ఈ ఏడాది రెండు సార్లు ఇలా జరిగింది.

విపక్షాలను ప్రజల్లో ఎండగట్టండి

- అసహనంతో అసత్యాల ప్రచారం
- ప్రజలకు వాస్తవాలను తెలియజేయండి
- భాజపా ఎంపీలకు ప్రధాని దిశానిర్దేశం
- పార్లమెంటులో ప్రతిష్టంభనకు ప్రతిపక్షాలే కారణం
- పాత్రికేయ సమావేశాలు పెట్టి వివరించండి: అమిత్ షా
- మిత్రపక్షాల్లో అసంతృప్తిపై చర్చించిన పార్లమెంటరీ పార్టీ



దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ, అమిత్‌షా, ఎల్‌కేఆడ్వాణీ తదితరులు

ఈనాడు - దిల్లీ

ఎన్నికల్లో ఓటమితో అసహనం చెందిన విపక్షాలు.. ప్రభుత్వంపై అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రజలకు వాస్తవాన్ని తెలియజేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించాలని భాజపా ఎంపీలకు సూచించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు నాలుగు గంటల పాటు ఈ భేటీ జరిగింది. మోదీతోపాటు పార్టీ అధ్యక్షుడు అమిత్ షా కూడా ఈ సమావేశంలో మాట్లాడారు. అనంతరం సమావేశం వివరాలను పార్టీ సీనియర్ ప్రకాశ్ జావడేకర్ విలేఖరులకు వివరించారు. వాటి ప్రకారం..

ఈ సమావేశంలో ఎంపీలను ఉద్దేశించి ప్రసంగించడానికి బదులు.. వారితో ప్రధాని ముచ్చటించారు. పార్టీ కొత్త కార్యాలయాన్ని చూపుతూ.. పార్టీ పని సంస్కృతి జిల్లా స్థాయి ఆఫీసుల నుంచి జాతీయ స్థాయి కార్యాలయాల్లో ప్రతిబింబించాలన్నారు. పార్టీ దివంగత నేత సుందర్ సింగ్ భండారీ ఆ రోజుల్లో అందుబాటులో ఉన్న ఏకైక ప్రసార సాధనమైన రేడియోలో వార్తలను విని, పార్టీని ముందుకు తీసుకెళ్లడంపై కొత్త ఆలోచనలు చేసేవారని చెప్పారు. అదేరీతిలో భాజపా కార్యకర్తలు కూడా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రజలకు వాస్తవాలు చెప్పాలని కోరారు.

మరోవైపు.. పార్లమెంటులో ప్రతిష్ఠంభనకు విపక్షాలే కారణమని పార్టీ అధ్యక్షుడు అమిత్ షా దుయ్యబట్టారు. పార్లమెంటుకు మూడు రోజుల సెలవు దినాలు రావడంతో వాటిని ఉపయోగించుకొని, పార్టీ ఎంపీలందరూ నియోజకవర్గాల్లో పాత్రికేయ సమావేశాలను నిర్వహించి, ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ సన్నద్ధమవుతున్న నేపథ్యంలో.. ఎంపీలు తమ నియోజకవర్గాల్లో బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని అమిత్ షా కోరారు. బూత్ స్థాయిలో సంస్థాగత కసరత్తు, భాజపా సిద్ధాంతాలు, మోదీ నాయకత్వమే పార్టీ విజయాలకు కీలకమని చెప్పారు. దేశంలోని అత్యంత వెనుకబడిన 115 జిల్లాలను అభివృద్ధి చేసే అంశంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఒక ప్రెజెంటేషన్ ఇచ్చారు.

కొత్త కార్యాలయంలో తొలిసారిగా..

ఆనవాయితీకి భిన్నంగా పార్లమెంటు గ్రంథాలయ భవనంలో కాకుండా దిల్లీలోని పార్టీ కొత్త కేంద్ర కార్యాలయంలో భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహించింది. దిల్లీలోని పండిట్ దీన్‌దయాళ్ మార్గ్‌లో ఇటీవలే ఆవిష్కరించిన ఈ భవనాన్ని పార్టీ ఎంపీలు వీక్షించడం కోసమే ఇక్కడ ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

జైట్లీకి బాధ్యత

ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు.. భాజపాలో చర్చనీయాంశంగా మారింది. సామాజిక న్యాయ శాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లోత్ సహా పార్టీకి చెందిన అనేక మంది ఎస్సీ, ఎస్టీ ఎంపీలు దీనిపై రివ్యూ పిటిషన్ వేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ అంశంపై ఎన్డీఏ మిత్రపక్షాల్లో భిన్నాభిప్రాయాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పార్టీ వైఖరిని ఖరారు చేసే బాధ్యతను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి అమిత్ షా అప్పగించారు.

పార్లమెంటులో ప్రతిష్ఠంభనపైనా..

పార్లమెంటు సమావేశాల్లో ఏర్పడుతున్న ప్రతిష్ఠంభన అంశంపై భాజపా అధ్యక్షుడు అమిత్ షా.. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్‌తో చర్చించినట్లు సమాచారం. ఎన్డీఏ మాజీ మిత్రపక్షం తెదేపా సహా పలు విపక్ష పార్టీలు నిరంతరంగా పార్లమెంటులో నిరసనలు తెలిజేయడంపై వారు మాట్లాడుకున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన అవిశ్వాస తీర్మానంతో తలెత్తే పరిస్థితిని పరిశీలించాలని అమిత్ షా కోరినట్లు పార్టీ ఎంపీ ఒకరు చెప్పారు. 'కేంబ్రిడ్జ్ అనలిటికా' వివాదం నుంచి దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ఈ నోటీసు ఇచ్చినట్లు భాజపా సీనియర్ నేతలు భావిస్తున్నారు.

ఎన్డీఏలో లుకలుకలపై..

ఎన్డీఏ కూటమిలో పెరుగుతున్న అసంతృప్తిపై మోదీ, అమిత్ షాలు.. అరుణ్ జైట్లీ, రవి శంకర్ ప్రసాద్‌లు చర్చించారు. "ఎన్డీఏను తెదేపా వీడాక.. మరి కొన్ని మిత్రపక్షాలు కూడా భాజపాపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు శివసేన ప్రకటించింది. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో మెరుగైన సమన్వయం ఉండేలా చూడాలని ఎల్‌జేపీ నేత రామ్ విలాస్ పాసవాన్ కోరుతున్నారు. రాజకీయ సమీకరణాల్లో గణనీయ మలుపులకు ఇది కారణం కావొచ్చు" అని రవిశంకర్ ప్రసాద్ చెప్పినట్లు సమాచారం. దీనికి జైట్లీ బదులిస్తూ.. శివసేన ఒంటరిగా పోటీ చేసే అవకాశం తక్కువేనని చెప్పినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎల్‌జేపీకి 7 సీట్లను భాజపా ఇచ్చేలా చూడటం కోసమే పాసవాన్ ఇలా మాట్లాడుతున్నారని చెప్పారు.

మూడో కూటమికి అవకాశం లేదు..


జైట్లీ సమాధానంపై మోదీ, షాలు అంగీకార సూచకంగా తల ఊపినట్లు తెలుస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చెబుతున్న తృతీయ కూటమికి అవకాశం లేదని అమిత్ షా వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న నేపథ్యంలో కేసీఆర్.. ప్రధానంగా కాంగ్రెస్ వ్యతిరేక కూటమి ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ముస్లిం మద్దతును కూడగట్టడానికే ఆయన భాజపా వ్యతిరేక వాదనను చేస్తున్నారని పేర్కొన్నారు. మమతా బెనర్జీ పరిస్థితి ఇందుకు భిన్నమన్నారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా.. ప్రధాన శక్తిగా ఎదుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో భాజపాయేతర, కాంగ్రెసేతర ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటుపై మమత మాట్లాడుతున్నప్పటికీ ఆమె కాంగ్రెస్‌తో ఒక అవగాహనకు వచ్చే అవకాశ ఉందని చెప్పారు.

రాజ్యసభలో భాజపా బలోపేతం

- ఎన్నికలు జరిగిన 25 స్థానాల్లో 12 కమలనాథుల సొంతం
- యూపీలోని 10 సీట్లలో 9 కైవసం
- పొత్తు కట్టిన అఖిలేశ్-మాయావతిపై ప్రతీకారం తీర్చుకున్న కమలం పార్టీ
- బీఎస్పీ అభ్యర్థికి తప్పని ఓటమి



జయా బచ్చన్



అరుణ్ జైట్లీ



జీవీఎల్ నరసింహారావు



అభిషేక్ మను సింఘ్వీ

దిల్లీ

రాజ్యసభలో అతిపెద్ద పార్టీగా అవతరించిన భాజపా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. 245 మంది సభ్యులున్న పెద్దల సభలో పూర్తిస్థాయి ఆధిక్యం రానప్పటికీ విపక్ష కాంగ్రెస్ కన్నా సంఖ్యాబలంలో మరింత మెరుగైన స్థితికి వచ్చింది. శుక్రవారం ఎన్నికలు జరిగిన 25 స్థానాల్లో 12 స్థానాలను ఆ పార్టీ సొంతం చేసుకుంది. అంతకుముందు ఏకగ్రీవం అయిన స్థానాల్లోనూ 16 కమలనాథుల సొంతం అయ్యాయి.

శుక్రవారం ఎన్నికలు జరిగిన యూపీలోని 10 స్థానాలకు గాను తొమ్మిదింటిని కమలం కైవసం చేసుకోవటం గమనార్హం. ఈ రాష్ట్రంలో కొత్తగా పొత్తుకట్టిన ఎస్పీ-బీఎస్పీల మధ్య ఐక్యతకు గండికొట్టేలా మాయావతి పార్టీకి చెందిన అభ్యర్థిని వ్యూహాత్మకంగా ఓడించింది. మొన్నటి లోక్‌సభ ఉప ఎన్నికల్లో రెండు స్థానాల్లో(గోరఖ్‌పూర్, ఫూల్‌పుర్) జరిగిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంది. శుక్రవారం రాజ్యసభ ఎన్నికలు యూపీలో ఉత్కంఠను రేపాయి. 8 స్థానాల్లో అభ్యర్థులను సునాయాసంగా గెలిపించుకోగల భాజపా 9 మందిని రంగంలోకి దించింది. దీంతో ఎస్పీ, బీఎస్పీల అభ్యర్థులకు చెమటలు పట్టించింది. ఎస్పీ అభ్యర్థిని జయాబచ్చన్ తన స్థానాన్ని నిలబెట్టుకోగలిగారు. ఎస్పీ ఎమ్మెల్యే ఒకరు, బీఎస్పీ ఎమ్మెల్యే ఒకరు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటం, ఈ రెండు పార్టీలకే చెందిన మరో ఇద్దరు శాసనసభ్యులు జైలుతో ఉండటంతో బీఎస్పీ అభ్యర్థి భీమ్‌రావ్ అంబేడ్కర్‌కు ఓటమి తప్పలేదు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులూ చివరిలో భాజపా అభ్యర్థికే ఓటు వేశారు. దీంతో ఓట్లలెక్కింపు సమయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

- పశ్చిమ బెంగాల్‌లోని 5 స్థానాలకు జరిగిన పోలింగ్‌లో నాలుగు స్థానాలను తృణమూల్ కాంగ్రెస్, మిగిలిన ఒక స్థానాన్ని టీఎంసీ మద్దతుతో కాంగ్రెస్ గెలుచుకుంది.
- కర్ణాటక విధానసభ నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ముగ్గురు, ఓ భాజపా అభ్యర్థి విజయాన్ని సాధించారు. జనతాదళ్ అభ్యర్థి పరాజయం పాలయ్యారు.
- తెలంగాణలోని మూడు రాజ్యసభ స్థానాలను తెరాస కైవసం చేసుకుంది.
- ఛత్తీస్‌గఢ్‌లోని ఒక స్థానాన్ని భాజపా సొంతం చేసుకుంది.
- ఝార్ఖండ్‌లోని రెండు స్థానాల్లో భాజపా, కాంగ్రెస్ చెరొక స్థానాన్ని గెలుచుకున్నాయి.
- ఏప్రిల్‌లో ఖాళీ అవుతున్న 58 స్థానాల్లో 33 స్థానాల్లో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. వీటిలో 16 స్థానాలు భాజపా సొంతమయ్యాయి.
- కేరళలో ఉపఎన్నిక జరిగిన ఒక స్థానంలో వామపక్ష కూటమి (ఎల్‌డీఎఫ్) మద్దతిచ్చిన జేడీ(యు-శరద్‌యాదవ్ వర్గం) అభ్యర్థి ఎంపీ వీరేంద్ర కుమార్...కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు.

శుక్రవారం జరిగిన ఎన్నికల్లో గెలిచిన ప్రముఖులు..

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ (భాజపా), జీవీఎల్ నరసింహారావు (భాజపా), జయా బచ్చన్ (ఎస్పీ)... వీరు ముగ్గురూ యూపీ నుంచి ఎన్నికయ్యారు. అభిషేక్ మను సింఘ్వీ (కాంగ్రెస్) పశ్చిమబెంగాల్ నుంచి తృణమూల్ కాంగ్రెస్ మద్దతుతో గెలుపొందారు.

రాజ్యసభలో ఏప్రిల్‌లో ఖాళీ అవుతున్న స్థానాలు: 58

ఏకగ్రీవం అయినవి	: 33
శుక్రవారం ఎన్నికలు జరిగినవి	: 25

ప్రధాని అభినందనలు

రాజ్యసభ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులకు ప్రధాని నరేంద్రమోదీ అభినందనలు తెలియజేశారు. వారు ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలవాలని, సమున్నత పార్లమెంటరీ భవితవ్యం వారికి చేకూరాలని ఆకాంక్షించారు. కాగా రాజ్యసభ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ అవకాశవాద రాజకీయం బయటపడిందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. యూపీలో రాజ్యసభ ఎన్నికల్లో భాజపా అధికారం, ధనబలంతో గెలిచిందని బీఎస్పీ ఆరోపించింది.

వాణిజ్య ఆంక్షలు విధిస్తే ఊరుకోబోం

128రకాల అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాల పెంపునకు సిద్ధమైన చైనా

బీజింగ్: ట్రంప్ సర్కారు విధించిన వాణిజ్య ఆంక్షలకు గట్టి సమాధానం ఇచ్చేందుకు చైనా సిద్ధమైంది! మూడు బిలియన్ డాలర్ల విలువైన 128 రకాల అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాల పెంపునకు రంగం సిద్ధం చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుతం పెద్ద వస్తువుల జోలికి వెళ్లకుండా... చిన్నచిన్న ఉత్పత్తులపైనే దృష్టి సారించినట్లు తెలిపింది.

చైనా దిగుమతులపై వార్షిక సుంకాలను 60 బిలియన్ డాలర్లకు పెంచుతూ ట్రంప్ సర్కారు గురువారం కార్యనిర్వాహక ఆదేశాలిచ్చిన క్రమంలో- చైనా ఈ ఎత్తు వేసింది. ట్రంప్ నిర్ణయం పట్ల చైనా వాణిజ్య, విదేశాంగశాఖలు శుక్రవారం ఘాటుగా స్పందించాయి. అమెరికా తన విన్యాసాలను మానుకుని... ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు చిక్కుల్లో పడకుండా తెలివైన నిర్ణయాలు తీసుకోవాలని వాణిజ్యశాఖ హెచ్చరించింది. న్యాయబద్ధమైన హక్కులు, ప్రయోజనాలకు విఘాతం కలుగుతుంటే చూస్తూ ఊరుకోబోమనీ... తమ ప్రయోజనాల పరిరక్షణకు పూర్తి సంసిద్ధతతో ఉన్నామని వాణిజ్యశాఖ ప్రతినిధి తెలిపారు.

డబ్ల్యూటీవో నియమాలకు బద్ధ విరుద్ధం

మరోవైపు- ట్రంప్ నిర్ణయం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నియమాలకు బద్ధ విరుద్ధమనీ.. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం అమెరికాకు తగదని విదేశాంగ శాఖ ప్రతినిధి హు చున్యాంగ్ నిప్పులు చెరిగారు. తన నిర్లక్ష్యపూరిత నిర్ణయాలకు ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆమె హెచ్చరించారు. "వాణిజ్య యుద్ధానికి చైనా జడిసే రకం కాదు. సవాలు ఎంత పెద్దదైనా, దాన్ని ఎదుర్కొనే సత్తా మాకుంది. ఇందుకు పూర్తిగా సిద్ధమయ్యాం" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. 375 బిలియన్ అమెరికన్ డాలర్ల చైనా వర్తక మిగులును సమర్థించుకుంటూ- చైనా ఉత్పత్తులు అమెరికా వినియోగదారుల మన్ననలు పొందడమే కాకుండా, ధరల నియంత్రణకూ దోహదపడ్డాయని ఆమె అన్నారు. వర్తక పోరుతో అంతిమంగా వినియోగదారుల ప్రయోజనాలు, మార్కెట్లు దెబ్బతినే ప్రమాదముందన్నారు. "చైనా విషయంలో అమెరికా హేతుబద్ధంగా వ్యవహరిస్తుందని భావిస్తున్నాం. చిన్నవాటిపై దృష్టిపెట్టి పెద్ద మొత్తాలను వదులుకోదనుకుంటున్నాం" అని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి దిగుమతయ్యే స్టీలుపై 25%, అల్యూమినియంపై 10% మాత్రమే కాకుండా... మద్యం, పండ్లు తదితరాలపై 15% సుంకాలను విధిస్తామని అంతకుముందు వాణిజ్యశాఖ వెల్లడించింది. ఈ ప్రభావం 128 రకాల అమెరికా ఉత్పత్తులపై పడుతుంది. దీంతో ఇతర విదేశీ ఉత్పత్తులతో చైనాలో అమెరికాకు తీవ్ర పోటీ ఎదురయ్యే పరిస్థితి వస్తుంది.

రాజీ కుదిరితే సరే...

"వర్తక అంశాలపై అమెరికాతో సంప్రదింపులు జరుపుతాం. విఫలమైతే తొలిదశలో 15% దిగుమతి సుంకాన్ని విధిస్తాం. పరిస్థితిని బట్టి తర్వాత దానిని 25 శాతానికి పెంచుతాం" అని చైనా వాణిజ్య వర్గాలు తెలిపాయి.

కేంబ్రిడ్జ్ అనలిటికాకు కేంద్రం తాఖీదు

- ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచార దుర్వినియోగంపై సమాధానమివ్వాలని ఆదేశం

దిల్లీ: ఫేస్‌బుక్‌లో భారతీయ వినియోగదారుల వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి సంబంధించి కేంద్రప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ఈ వివాదంలో కేంద్ర బిందువైన బ్రిటన్‌కు చెందిన కేంబ్రిడ్జ్ అనలిటికాకు తాఖీదునిచ్చింది. సమాచార దుర్వినియోగంలో, భారతీయ ఓటర్ల ఓటింగ్ సరళిని ప్రభావితం చేయటంలో ఆ సంస్థ ప్రమేయంపై వివరణను కోరింది. ఆ సంస్థ సేవలను పొందిన వారి జాబితా, సమాచారాన్ని పొందటానికి అనుసరించిన విధానం, దాని వినియోగం తీరు, ఫేస్‌బుక్ వినియోగదారుల సమ్మతిని ఏమైనా తీసుకున్నారా.. తదితర ప్రశ్నలను ప్రభుత్వం సంధించింది. వీటన్నిటికీ సంస్థ వివరణలను ఈ నెల 31వ తేదీలోగా ఇవ్వాలని కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ ఆ తాఖీదులో పేర్కొంది. సమాచార చౌర్యం ద్వారా భారతీయ ఓటర్లను ప్రభావితం చేసే యత్నాలు జరిగి ఉంటే కఠిన చర్యలు తప్పవని ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌ను కేంద్ర న్యాయ, ఐటీ శాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్ హెచ్చరించిన నేపథ్యంలో ఈ తాఖీదు జారీ అయ్యింది. ఎన్నికల్లో ఓటర్లను అక్రమ పద్ధతుల్లో ప్రభావితం చేసేందుకు జరిగే చట్ట వ్యతిరేక చర్యలను అడ్డుకోవటానికి సంబంధించి దర్యాప్తు సంస్థలతో సమన్వయం ఏర్పరచుకోనున్నట్లు ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఓపీ రావత్ తెలిపారు. దీనికి సంబంధించిన సూచనలు, సలహాలను దర్యాప్తు సంస్థల నుంచి స్వీకరిస్తామని వెల్లడించారు.

ఆస్ట్రేలియా ఆశలకూ గండి!

దిల్లీ: భారతీయ విద్యార్థుల ఆశలు, అవకాశాలను దెబ్బతీసేలా.. ఆస్ట్రేలియా కూడా అమెరికా బాటలోనే పయనిస్తోంది. విదేశీ నైపుణ్య ఉద్యోగాలకు కీలకమైన 457(సబ్‌క్లాజ్) కేటగిరీ వీసాలను తాజాగా రద్దు చేసింది. దీనిస్థానంలో 'టెంపరరీ స్కిల్ షార్టేజి (టీఎస్ఎస్)' వీసా విధానాన్ని ఈనెల 18న తీసుకొచ్చింది. ఇందులో కఠిన నిబంధనలతో విదేశీ నిపుణుల అవకాశాలకు గండి కొట్టింది. దీనికి సంబంధించి తుది నిబంధనలను ప్రకటించాల్సి ఉన్నప్పటికీ.. అమెరికాకే 'ప్రథమ ప్రాధాన్యం' అన్న డొనాల్డ్ ట్రంప్ వైఖరినే ఇది తలపిస్తోంది.

ఏమి 'టీఎస్ఎస్'..!

- కొత్త వీసా విధానంలో ఆస్ట్రేలియాలోని సంస్థలు విదేశీ నిపుణులను తీసుకోవాలంటే 'భారం'గా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 457 వీసా కింద 650కి పైగా ఉద్యోగాలు దొరికేచోట.. కొత్తవిధానంలో ఆ సంఖ్య 200కు పరిమితమవుతుంది.
- ఆంగ్లభాషలో ప్రావీణ్యం, కనీసం రెండేళ్ల అనుభవం అవసరం. నేరచరిత్రనూ పరిశీలిస్తారు. కనీస మార్కెట్ వేతనాలూ ఆస్ట్రేలియన్లకు అనుకూలంగా ఉంటాయి.
- ఆస్ట్రేలియాలో శాశ్వతనివాసం ఏర్పరచుకోవాలని భావించేవారికి పెద్ద అవరోధంగా మారుతుంది.
- విదేశీయులను తీసుకునే సంస్థలు.. ఆస్ట్రేలియన్లకు కూడా అంతే అత్యుత్తమ శిక్షణను అందించాల్సి ఉంటుంది.
Chilkalguda Near Secunderabad Railway Station, Single Bedroom, Hall, BIG Kitchen Attach Bath Room 24 Hrs Water ✆ 9849478320

Duplex 4BHK Flat 2500 Sft N/F 24 Hrs. Manjeera Water Vishwambar Sparkle Hydernagar, Kukatpally. Rent: 20,000 ✆ 9618079875.

DSNR Chaitanyapuri Gr.Flr Indp.House 1400 sft, 2BHK with Drawing, Puja and Car Parking, 24h water ✆ 9493015258

COMMERCIAL

Top Floor Multiplex Space at Nacharam, Mallapur for Pub/Restaurant 3500sft Plus Kitchen, Plus Terrace open area. Only Experienced Contact: 9666081999/ 9704567345.

Nizampet Road Ground Floor 6200 (Sft) Commercial Space for Rent or Lease with Ample Parking. ✆ 8247280881/ 9963851438.

ECIL 'X' Road, More Super Market Building. Commercial Space 3 Stored Building for Rent/ Lease ✆ 9848373845.

Tarnaka, Indp I&II Duplex 3BHK, 3000 SFT 1Car Park for Guest House or FMCG Dealers Stock Cum Distributors/ Off ✆ 9849484363.

Moosarambagh Main Road Near RTO Office (57x12) 684sft, New Constructed Commercial Shop Rent, Car Parking ✆ 7416690990

Commercial Space 8000 sft, Suitable for Offices, Hostels, Company Guest Houses, Software Companys, Main Road, 2nd Bit, Moosapet 'x' Road ✆ 9030966663/ 7702591888

భవిష్యత్తు విద్యుత్తు వాహనాలదే

- హీరో మోటోకార్ప్‌కు ఏపీ సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- దక్షిణాదిన ఇదే తొలి ప్లాంటు
- రూ.600 కోట్ల పెట్టుబడి
- మా పాలన ప్రత్యేకతను మీరే చూస్తారు: ముఖ్యమంత్రి

ఈనాడు – తిరుపతి

భవిష్యత్తు అంతా విద్యుత్తుతో నడిచే (ఎలక్ట్రిక్) వాహనాలదేనని, దానిపైనా 'హీరో' దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. చిత్తూరు జిల్లా సత్యవేడు శ్రీసిటీ సమీపంలోని మదనపాలెం సమీపంలో 636 ఎకరాల్లో నిర్మించబోయే హీరో మోటోకార్ప్ మొదటిదశ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆటోమొబైల్ రంగంలో ప్రపంచంలోనే నంబరు వన్‌గా ఉన్న హీరో దక్షిణ భారతంలో మొదటి యూనిట్‌ను మన రాష్ట్రంలోనే స్థాపించడం ఆనందంగా ఉందన్నారు. మూడు దశల్లో నిర్మితమయ్యే ఈ ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంతానికి కొత్త కళ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 12 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయని చెప్పారు. 'నేను 2002 అక్టోబరు 15న గుర్‌గావ్‌లోని హీరోహోండా ప్లాంటును సందర్శించాను. అందులోని ప్రత్యేకతలను తెలుసుకున్నాను. పదేళ్ల తర్వాత మళ్లీ పవన్ ముంజాల్ ఛైర్మన్ అయిన తర్వాత వారి ప్లాంటును పరిశీలించాను. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వారు తయారు చేసే మోటారు సైకిళ్లు ప్రపంచంలోనే ఉత్తమంగా నిలుస్తున్నాయి. ఈ రోజు ఇక్కడ స్థాపించిన ప్లాంట్‌కు 2019 డిసెంబరు నాటికి మొదటి దశ యూనిట్‌ను పూర్తి చేస్తామని పవన్ ముంజాల్ చెబుతున్నారు. మార్చిలోపే పూర్తి చేయాలని నేను ఆకాంక్షిస్తున్నాను...' అని చంద్రబాబు పేర్కొన్నారు. నిర్మాణ సమయంలో ఏ చిన్న సమస్య వచ్చినా.. తాను, తన మంత్రివర్గం, అధికార యంత్రాంగం వెంటనే స్పందిస్తామని, 24×7 అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. హీరోకు ఇప్పటికే 7 ప్లాంట్లు ఉన్నాయని.... 8వ ప్లాంటు ద్వారా.. ఇతర రాష్ట్రాల పాలనకు, ఏపీలో పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని చూస్తారని వ్యాఖ్యానించారు.



హీరో మోటార్స్‌కు భూమిపూజ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆ సంస్థ ఛైర్మన్ పవన్ ముంజాల్, పక్కన రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి.

> ఆంధ్రప్రదేశ్ ఒక అవకాశాల గని. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే ప్రతి ఒక్కరూ మాకు ఆత్మీయులే. ఇప్పటికే అనంతపురానికి కియా సంస్థ వచ్చింది. చిత్తూరుకు హీరో మోటోకార్ప్‌తో పాటు రిలయన్స్ జియో, అరవింద్, సెల్‌కాన్, కార్బన్ వంటి పెద్దపెద్ద సంస్థలు వస్తున్నాయి. ఈ ప్రాంతాన్ని ఒక లాజిస్టిక్ హబ్‌గా తయారు చేయడమే మా లక్ష్యం.
>
> – ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

తోటి పారిశ్రామికవేత్తలకు సూచిస్తాను

హీరో మోటోకార్ప్ ఛైర్మన్ పవన్ ముంజాల్ మాట్లాడుతూ 37 దేశాల్లో తమ సంస్థ ఉత్పత్తులు ముందంజలో ఉన్నాయని, మొదటిదశ ప్లాంటును రూ. 600 కోట్లతో పూర్తి చేస్తామని చెప్పారు. ప్లాంటు అంటే కేవలం నామమాత్రంగా కట్టడం కాదని, పూర్తి పర్యావరణహితంగా నిర్మించబోతున్నామన్నారు. తాను తోటి పారిశ్రామికవేత్తలకు ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని సూచిస్తానని వెల్లడించారు. పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

> చంద్రబాబునాయుడు మా కుటుంబ శ్రేయోభిలాషి. ఒక రోజు రాత్రి విందుకు మా ఇంటికి వచ్చారు. చాలా సరదాగా మొదలైన మా సంభాషణ గంటసేపు సాగింది. ఆ గంటలోనే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు గురించే మాట్లాడారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, హీరో కంపెనీ ఉత్పాదన యూనిట్లకు అనువైన పరిస్థితులు ఆంధ్రాలో ఉన్నాయని, వాటిని ఒకసారి పరిశీలించాలని కోరారు. ఆ గంట మొత్తం నా పరిశీలనలో చంద్రబాబుకు రాష్ట్ర భవిష్యత్తుపై ఉన్న విజన్, అభివృద్ధిపై మమకారం కనిపించాయి. దాని తర్వాత కొద్దిరోజులకే మేం దక్షిణ భారతదేశంలో మొదలు పెట్టబోయే ప్లాంటును ఆంధ్రప్రదేశ్‌లో పెట్టాలని నిర్ణయించుకున్నాం.
>
> – పవన్ ముంజాల్, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, హీరో మోటోకార్ప్

అమరావతిలో అశోక్ లేల్యాండ్

ఈనెల 31న ముఖ్యమంత్రి భూమి పూజ

హనుమాన్‌జంక్షన్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ రవాణా వాహనాల తయారీ సంస్థ అశోక్ లేల్యాండ్ అమరావతిలో తమ యూనిట్ నెలకొల్పేందుకు రంగం సిద్ధం చేసింది. రాజధాని పరిధిలో ప్రతిష్ఠాత్మక పారిశ్రామికవాడగా భావిస్తున్న కృష్ణా జిల్లా మల్లవల్లిలో బస్ బాడీ బిల్డింగ్ యూనిట్ స్థాపనకు కార్యాచరణ ప్రారంభించింది. ఈనెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికి భూమి పూజ చేయనున్నారు.

రెండేళ్లలో లక్ష విద్యుత్తు వాహనాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: రానున్న రెండేళ్లలో విద్యుత్తుతో నడిచే (ఎలక్ట్రిక్) లక్ష వాహనాలు ప్రవేశపెడతామని, ముందుగా పదివేల వాహనాలను ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఆర్టీసీలోనూ ఈ తరహా వాహనాలను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాదిని 'ఈ వాహనాల తయారీ సంవత్సరం'గా ప్రకటించారు. కాలుష్యాన్ని తగ్గించడం, యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ రంగాన్ని ప్రోత్సహిస్తామని, ఇందుకోసం తయారీదారులకు భారీ ప్రోత్సాహకాలతో పాటు త్వరలోనే ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఈ వాహన రంగం అభివృద్ధికి గల అవకాశాలు, వీటి తయారీకి అందించాల్సిన ప్రోత్సాహకాలపై అధికారులు, తయారీదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం సచివాలయంలో సమావేశమయ్యారు. అంతకుముందు 'ఎలక్ట్రిక్ బస్సు'ను ప్రారంభించిన ముఖ్యమంత్రి అందులో కొంతదూరం ప్రయాణించారు. తర్వాత టాటా సంస్థ తయారు చేసిన కారును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



సీఎం ప్రారంభించిన విద్యుత్తుతో నడిచే(ఎలక్ట్రిక్) బస్సు



పార్లమెంటు హౌస్ వద్ద గల మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్రత్యేక హోదా కోసం ఆందోళన చేస్తున్న తెదేపా ఎంపీలు

కొనసాగిన తెదేపా నిరసనలు

- గాంధీ విగ్రహం వద్ద ఆందోళన

ఈనాడు, దిల్లీ: ప్రజా ఉద్యమంతోనే కేంద్రం మెడలు వంచుతామని తెదేపా స్పష్టం చేసింది. ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు కోసం తెదేపా నేతల నిరసన శుక్రవారమూ కొనసాగింది. పార్లమెంటు ఉభయసభల ప్రారంభానికి ముందు గాంధీ విగ్రహం వద్ద తెదేపా ఎంపీలు ఆందోళన చేశారు. ప్రత్యేకహోదా ఇవ్వాలని, విభజన హామీలు నెరవేర్చాలని నినదించారు. ప్రభుత్వ వైఖరి తమకేమీ ఆశ్చర్యం కలిగించడం లేదని ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందున భవిష్యత్తులో రాష్ట్రాన్ని, తెదేపాను ఎంత ఇబ్బంది పెట్టాలో అంత పెడతారని పేర్కొన్నారు. ఎంపీ శ్రీరాంమాల్యాద్రి కూడా మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ వేధింపుల కేసులకు సంబంధించి సుప్రీంకోర్టులో కౌంటరు దాఖలు చేయాలంటూ గాంధీ విగ్రహం వద్ద నిరసనకు దిగిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని ఎంపీ శివప్రసాద్ పలకరించారు. తాను పోలవరం రైతునని చెప్పగా రాహుల్‌గాంధీ చిరునవ్వుతో రైట్‌రైట్ అంటూ స్పందించారు.

జాతీయస్థాయిలో సిద్దిపేటకు ప్రథమస్థానం

- 'శ్రీసాయితేజ స్లమ్ సమాఖ్య'కు స్వచ్ఛత పురస్కారం

ఈనాడు, దిల్లీ, సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని 'శ్రీసాయి తేజ స్లమ్ సమాఖ్య' చరిత్ర సృష్టించింది. 33 మహిళా సంఘాలు, 345 మంది సభ్యులతో కూడిన ఆ సమాఖ్య జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి 'స్వచ్ఛత ఎక్సలెన్స్' పురస్కారం దక్కించుకుంది. దేశరాజధాని దిల్లీలో కేంద్ర మంత్రి (స్వతంత్ర) హర్దీప్‌సింగ్ చేతుల మీదుగా సిద్దిపేట కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సమాఖ్య అధ్యక్షురాలు నవ్య, కార్యదర్శి విజయ తదితరులు శుక్రవారం పురస్కారం అందుకున్నారు. ఇందులో భాగంగా ఎక్సలెన్స్ అవార్డు, ధ్రువపత్రం, షీల్డుతోపాటు రూ. 1.50 లక్షల నగదును అందజేశారు. శౌచాలయాల నిర్మాణం, స్వచ్ఛత ఉద్యమం, తడి, పొడి చెత్త సేకరణలో చైతన్యం కల్గించి స్ఫూర్తిని చాటిన స్లమ్ సమాఖ్యలకు జాతీయ స్థాయిలో స్వచ్ఛత ఎక్సెలెన్స్ పురస్కారాలు ఇచ్చేందుకు కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలు ఆహ్వానించింది. దేశవ్యాప్తంగా 196 స్లమ్ సమాఖ్యల ప్రతిపాదనలు కేంద్రానికి అందగా సాయితేజ స్లమ్ సమాఖ్యకు ప్రథమస్థానం లభించింది. సాయితేజ స్లమ్ సమాఖ్య జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలవడం స్ఫూర్తిదాయకంగా ఉందంటూ వారికి ఈ సందర్భంగా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి హరీశ్‌రావు అభినందనలు తెలిపారు.



కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, స్లమ్ సమాఖ్య ప్రతినిధులు

చంద్రబాబుపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తాం

వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ధ్వజం


ఈనాడు–దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబుపై పార్లమెంటులో సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వనున్నట్లు వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. ప్రధాని, ఆయన కార్యాలయం, పార్లమెంటు ప్రతిష్ఠను దిగజార్చేలా ముఖ్యమంత్రి శాసనసభ వేదికగా మాట్లాడారని ఆరోపించారు. శుక్రవారం ఆయనిక్కడ మాట్లాడారు. 'అత్యున్నత పదవిలో ఉన్న ఒక గొప్ప వ్యక్తిపై ఉద్దేశాలు ఆపాదిస్తూ సీఎం శాసనసభలో ప్రకటన చేశారు. సభాహక్కులను ఉల్లంఘించారు. దేశ ప్రతిష్ఠనే దిగజార్చారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అలాంటి దుష్ట సంప్రదాయానికి విరామం ఇవ్వాలని, భవిష్యత్తుల్లో చంద్రబాబులాంటి వారు ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ఉండాలనే సభాహక్కుల ఉల్లంఘన నోటీసునిచ్చి ఆయన వివరణ కోరాలనుకుంటున్నా. ప్రజాసమస్యలతోపాటు చంద్రబాబు అవినీతినీ ప్రధాని దృష్టికి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఎంపీగా నాపై ఉంది. ప్రధాని కార్యాలయంపై సీఎం ఆరోపణలు చేస్తూ, నేరగాళ్లకు అడ్డాగా మారిందంటూ అసెంబ్లీ సాక్షిగా చెప్పారు' అని పేర్కొన్నారు. సభలో లేనివారి గురించి సీఎం ఎలా మాట్లాడతారు? ఆయనకు సభా సంప్రదాయాలు తెలియవా? అని ప్రశ్నించారు.

ఎవరినీ కలవద్దు

- కేంద్ర మంత్రులతో మాట్లాడాల్సిన పనిలేదు
- మన డిమాండ్‌లు స్పష్టంగా ఉన్నాయి
- విభజన చట్టంలోని అంశాలు, హామీలు నెరవేర్చాల్సిందే
- ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- ఆంధ్రప్రదేశ్‌పైనా, పోలవరం ప్రాజెక్టుపైనా కుట్ర

ఈనాడు అమరావతి– ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రస్తుత పరిస్థితుల్లో ఎవర్నీ కలవాల్సిన అవసరం లేదని తెదేపా ఎంపీలకు చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం ఎంపీలు, శాసనసభ వ్యూహ కమిటీ ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేఅంశాలు, రాష్ట్రానికి రావలసిన కేంద్ర ప్రభుత్వ సంస్థలు వంటి వాటిపై కేంద్ర మంత్రుల్ని కలసి మాట్లాడవచ్చా?... అని కొందరు ఎంపీలు అడిగారు. దీనిపై... "విభజన చట్టంలోని అంశాల్ని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిందే. ఈ విషయంలో మన డిమాండ్‌లు చాలా స్పష్టంగా ఉన్నాయి. వాటిని సాధించుకోవడానికి కేంద్రంపై మనం పోరాడుతున్నాం. వాటిపై కేంద్ర మంత్రుల్ని కలిసి చర్చించాల్సిన అవసరం లేదు. పార్లమెంటులో ఎదురుపడితే పలకరించడంలో తప్పు లేదు. వారితో ప్రత్యేకంగా మంతనాలు సాగించడమో, వారి దగ్గరకు వెళ్లి మాట్లాడటమో చేయొద్దు..." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రులతో తెదేపా ఎంపీలు మంతనాలు సాగిస్తున్నట్టు వైకాపా అనుకూల మీడియా దుష్ప్రచారం చేస్తోందని, దీనిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. ఎంపీలంతా అనుక్షణం అప్రమత్తంగా, రాబోయే ఇబ్బందుల్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్‌పైనా, పోలవరం ప్రాజెక్టుపైనా కుట్ర చేస్తున్నారు. దక్షిణాదిలో నాయకత్వాల్ని బలహీనపరిచి, సమర్థ నాయకత్వం లేకుండా చూడాలని కుట్రపన్నుతున్నారు. పోరాటంలో వెనుకంజ వద్దు..." అని ఆయన స్పష్టం చేశారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సిన నిధుల్లో కోత పెడుతూ, ఇతర రాష్ట్రాలకు మాత్రం ధారాళంగా నిధులిస్తోందని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. "మనం ఎవరి మీదా కుట్ర, కుతంత్రాలు చేయడం లేదు. ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా, ఎన్డీయే, యూపీయేలపై కోపం లేదు. రెండు జాతీయ పార్టీలు రాష్ట్రానికి అన్యాయం చేశాయన్నదే బాధ..." అని పేర్కొన్నారు. తెదేపా ఎంపీల పోరాటం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని, గురువారం జరిగిన నిరసనలే దానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. తెదేపా బలపడితేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని, బలహీనపరిస్తే రాష్ట్రం నష్టపోతుందని పేర్కొన్నారు. "మనం రాజకీయాల్లోకి వచ్చిందే ప్రజలకు మేలు చేసేందుకు. కుట్రలు, కుతంత్రాలు చేయడానికి కాదు. ఈ విషయాన్ని ఆ మూడు పార్టీల నాయకులు గుర్తుంచుకోవాలి. హోదా ఒక్కటే తీసుకొని ప్రోత్సాహకాలను వదిలేయాలని వైకాపా చూస్తోంది. ప్రత్యేకహోదాలో ప్రోత్సాహకాలు ఉండవని భాజపా అంటోంది. హోదా ఉన్న రాష్ట్రాలకు ఇచ్చిన ప్రోత్సాహకాలన్నీ ఇవ్వాలని మనం అడుగుతున్నాం. దీనిపై అందరిలోను స్పష్టత ఉండాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి..." అని పేర్కొన్నారు. "ఇన్ని ఆందోళనలు జరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. ఈశాన్య రాష్ట్రాలకు రూ. 3 వేల కోట్లు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చే నిధుల్లో కోత పెడుతోంది. ఇది ఏ మాత్రం సరికాదు. నమ్మకంతో చేసేదే రాజకీయం. ఆ నమ్మకాన్నే కోల్పోతే అది అరాజకీయమే. రాజకీయాల్లో విశ్వసనీయత ఎంతో ముఖ్యం. దాని వల్లే 2014లో ప్రజలు తెదేపాని గెలిపించారు. విశ్వసనీయత లేదు కాబట్టే వైకాపాను ఓడించారు. ప్రజల్లో మనపై ఉన్న విశ్వసనీయతను కాపాడుకోవాలి..." అని తెలిపారు. సుజనాచౌదరి మాట్లాడుతూ... రాజ్యసభలో తాను చేసిన ప్రసంగంలో సగభాగం తొలగించడంపై నిరసన వ్యక్తం చేసినట్టు చెప్పారు.

భగీరథ పనులపై వారం వారం సమీక్ష: కేటీఆర్



ఈనాడు, హైదరాబాద్: పట్టణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాల్సిందేనని పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై ఈ పనుల పురోగతిపై వారం వారం సమీక్ష చేస్తానని చెప్పారు. ఏయే పట్టణాల్లో పనులు ఎప్పుడు పూర్తవుతాయనే జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. శుక్రవారం మంత్రి హైదరాబాద్‌లో పురపాలకశాఖ డైరెక్టర్ కార్యాలయంలో మిషన్‌భగీరథ(అర్బన్), అమృత్ పట్టణాల్లో పనులపై సమీక్షించారు. గడువులోపు పనులను పూర్తిచేసేందుకు ప్రభుత్వం నుంచి అన్ని సహకారాలను వర్కింగ్ ఏజెన్సీలకు అందించాలని కోరారు. గడువులోపు పనులను పూర్తి చేసే సంస్థలకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. వర్షాకాలం నాటికి పనులను కీలకదశకు తీసుకురావాలన్నారు. మిషన్‌భగీరథ పనులు మణుగూరులో పనులు దాదాపుపూర్తికాగా ఆర్మూర్‌లో 98%, సిరిసిల్లలో 80% పనులు పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. పనుల్లో జాప్యం జరుగుతున్నా, సమస్యలున్నా తనదృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. మిషన్ భగీరథ(అర్బన్) పనులపురోగతిని వారంవారం సమీక్షించడంతోపాటు త్వరలో ప్రభుత్వ శాఖాధిపతులతో సమన్వయ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

శ్రీరామ రథయాత్ర అనుమతి నిరాకరణపై అప్పీలు

మంగళవారం విచారణ జరుపుతామన్న ధర్మాసనం

ఈనాడు, హైదరాబాద్: ఉగాది నుంచి హనుమాన్ జయంతి వరకు చేపట్టదలచిన శ్రీరామ రథయాత్రకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించడానికి నిరాకరిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) తెలంగాణ కార్యదర్శి గాల్‌రెడ్డి ధర్మాసనం ముందు అప్పీలు దాఖలు చేశారు. దీనిపై అత్యవసరంగా విచారణ జరపాలని శుక్రవారం న్యాయస్థానం ప్రారంభం సమయంలో అప్పీల్‌దారు తరపు న్యాయవాది.. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం ఎదుట అభ్యర్థించారు. అందుకు నిరాకరించిన ధర్మాసనం.. మంగళవారం విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. ఈ నెల 18న బాసర నుంచి ప్రారంభించి ఈ నెల 31న సికింద్రాబాద్ తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వద్ద యాత్ర ముగిసేలా కార్యక్రమం నిర్వహిస్తామని.. అందుకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ గాల్‌రెడ్డి హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జీ.. గురువారం ఆ వ్యాజ్యాన్ని కొట్టేసింది. ఈ నేపథ్యంలో ఆయన ధర్మాసనం ఎదుట అప్పీల్ దాఖలు చేశారు. ప్రజా జీవనానికి ఈ యాత్ర విఘాతం కలిగిస్తుందని పోలీసులు చెప్పిన వివరాల ఆధారంగా సింగిల్ జడ్జీ ముగింపునకు రావడం పొరపాటుతో కూడుకొందన్నారు.

బ్యాంకు కుంభకోణంలో ఇద్దరి అరెస్టు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతోపాటు మొత్తం 8ఆర్థిక సంస్థల నుంచి రూ.313.84 కోట్ల రుణం తీసుకొని ఎగవేసిన హైదరాబాద్‌కు చెందిన టోటెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపకులను సీబీఐ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ సంస్థపై సీబీఐ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. సంస్థ ప్రమోటర్ డైరెక్టర్ తొట్టెంపుడి సలాలిత్, డైరెక్టర్ తొట్టెంపుడి కవితలను అరెస్టు చేసినట్లు సీబీఐ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ప్రధాన కార్యాలయం ద్వారా ఈ సంస్థ నిర్మాణ రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తుంది. వ్యాపార లావాదేవీలకోసం రుణం తీసుకొని వ్యక్తిగతంగా వాడుకున్నారన్నది ప్రధాన అభియోగం.

దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకం రూ.లక్షకు పెంపు

దివ్యాంగులను వివాహం చేసుకునేవారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచింది. ఈమేరకు మహిళాశిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జగదీశ్వర్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ప్రోత్సాహకం పెంపు శుక్రవారం(ఈ నెల 23)నుంచే అమల్లోకి వస్తుందని అందులో పేర్కొన్నారు.

జయపుర వరకు అజ్మీర్ ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్‌నుంచి అజ్మీర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును జయపుర వరకు నడిపేందుకు రైల్వేశాఖ అనుమతి ఇచ్చింది. ఏప్రిల్ 2 నుంచి హైదరాబాద్ నుంచి జయపురకు, ఏప్రిల్ 4నుంచి జయపుర నుంచి హైదరాబాద్‌కు రైలు పొడిగింపు ఆదేశాలు అమల్లోకి వస్తాయి. వారానికి రెండుసార్లు ఈ రైలు హైదరాబాద్-జయపురల మధ్య ప్రయాణిస్తుంది.

యాదవ్‌రెడ్డి బెయిల్ వ్యాజ్యం కొట్టివేత

హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ ప్రణాళిక విభాగం సంచాలకుడు పురుషోత్తమ్‌రెడ్డి ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రెండో నిందితుడైన యాదవ్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే అరెస్టయిన యాదవ్‌రెడ్డికి దిగువ కోర్టు బెయిల్ నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఏసీబీ తరపున న్యాయవాది వి.రవికిరణ్‌రావు వాదనలు వినిపిస్తూ.. పురుషోత్తమ్‌రెడ్డికి చెందిన సొమ్మును యాదవ్‌రెడ్డి నిర్మాణ ప్రాజెక్టుల్లో పెట్టినట్లు ప్రాథమికంగా ఆధారాలున్నాయన్నారు. వారికున్న సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోందని ఈ దశలో బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. ఆ వాదనలనతో ఏకీభవించిన న్యాయమూర్తి.. బెయిల్ వ్యాజ్యాన్ని కొట్టేస్తు ఉత్తర్వులు జారీ చేశారు.

రైతులను విస్మరించడం తగదు

ఈనాడు, దిల్లీ: రైతులను విస్మరించడం ప్రభుత్వాలకు తగదని తెలంగాణ సర్పంచుల ఐక్యవేదిక అధ్యక్షుడు, తెఐకాస సారథ్య సంఘం సభ్యుడు ఆందోళ్ కృష్ణ అన్నారు. శుక్రవారం దిల్లీ రాంలీలా మైదానంలో అన్నాహజరే ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆందోళ్‌కృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గమైన గజ్వేల్‌లోనే వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. 60 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు రూ.5 వేల పింఛను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

కొత్త ఆయకట్టు 8.89 లక్షల ఎకరాలు

- వచ్చే ఖరీఫ్‌నాటికి సాగునీరు
- 2017-18 ఫిబ్రవరి వరకు 3.39 లక్షల ఎకరాలకు
- నీటిపారుదల శాఖ బడ్జెట్ ఫలితాల నివేదికలో వెల్లడి
- శాసనసభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఖరీఫ్ నాటికి భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద 8.89 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరందిస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 15.62 లక్షల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకోగా.. ఫిబ్రవరి వరకు 3.39 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి వసతి కల్పించినట్లు తెలిపింది. ఈ మేరకు శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన భారీ, మధ్య తరహా నీటిపారుదల శాఖ బడ్జెట్ ఫలితాల నివేదికలో ప్రభుత్వం పేర్కొంది.

- 69.72 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి వసతి కల్పించడానికి రూ.1,94,403 కోట్లతో 36 భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు చేపట్టగా వాటిలో పది పూర్తయ్యాయని, 11 ప్రాజెక్టుల కింద పాక్షికంగా నీటిని విడుదల చేసినట్లు నివేదిక వెల్లడించింది.
- గత ఏడాది బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన ఫలితాల నివేదికలో 2017-18లో 13 భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు పూర్తి చేయడంతోపాటు మరో ఏడు భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను 2018-19లో పూర్తి చేసి.. మొత్తం 15.62 లక్షల ఎకరాలకు నీరందించడం లక్ష్యమని ప్రకటించింది. అయితే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్న కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, ఎస్సారెస్పీ రెండోదశ తదితర పథకాల కింద ఓ మేరకు ఆయకట్టు సాగులోకి వచ్చింది. వచ్చే ఖరీఫ్‌నాటికి ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలన్నది లక్ష్యం.
- ప్రస్తుత ఏడాది లక్ష్యంగా పెట్టుకొని పూర్తిచేసిన ప్రాజెక్టుల్లో సింగూరు ఉంది. మరో ఏడు మధ్యతరహా ప్రాజెక్టులు వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యం.
- 2018-19లో ఆరు భారీ, రెండు మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తి చేయాలని కార్యక్రమం రూపొందించినట్లు బడ్జెట్ ఫలితాల నివేదిక పేర్కొంది.
- 2004 నుంచి 2014 వరకు 5.71 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించగా, 2014 నుంచి 2018 ఫిబ్రవరి వరకు 10.95 లక్షల ఎకరాలకు నీరందించినట్లు వెల్లడించింది. ఇందులో చిన్ననీటివనరుల కింద కొత్తగా సాగులోకి వచ్చిన ఆయకట్టు కూడా ఉంది.
- మొత్తం జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన, పునరాకృతి తర్వాత చేపట్టిన ప్రాజెక్టులు ఇలా అన్నింటి కింద కలిపి 16.66 లక్షల ఎకరాల ఆయకట్టు కొత్తగా సాగులోకి వచ్చినట్లు తెలిపింది.
- 2016-17లో రూ.25 వేల కోట్ల బడ్జెట్ కేటాయించగా రూ.15483.09 కోట్లు, 2017-18లో రూ.25 వేల కోట్లు కేటాయించగా ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రూ.11623.34 కోట్లు ఖర్చుచేసినట్లు నివేదిక వెల్లడించింది.

'మిషన్ కాకతీయ'తో 11.41 లక్షల ఎకరాల స్థిరీకరణ

మిషన్ కాకతీయ కింద మూడు దశల్లో చేపట్టిన పనుల వల్ల 11.41 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగిందని నీటిపారుదల శాఖ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఫలితాల నివేదిక వెల్లడించింది. మొదటి దశ కింద 6.71 లక్షల ఎకరాలు, రెండోదశ కింద 3.6 లక్షలు, మూడో దశ కింద 1.1 లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగినట్లు తెలిపింది. చిన్ననీటి వనరుల కింద 2013-14లో గ్యాప్ ఆయకట్టు 42.4 శాతం ఉండగా, మిషన్ కాకతీయ మొదటి దశ అమలు తర్వాత 2016-17 నాటికి అది 23.20 శాతానికి తగ్గిందని పేర్కొంది. సాగునీటి సామర్థ్యంతోపాటు పంటల దిగుబడి, మత్స్య సంపద పెరిగిందని.. మిషన్ కాకతీయ అనేక విజయాలు సాధించిందని వెల్లడించింది.

వచ్చే రెండు ఖరీఫ్‌లలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద ఆయకట్టు లక్ష్యాలు..

ప్రాజెక్టు	2018జూన్ (ఎకరాల్లో)	2019జూన్ (ఎకరాల్లో)
ఎస్సారెస్పీ రెండోదశ	1,26,823	0
కల్వకుర్తి ఎత్తిపోతల	1,64,241	0
భీమా ఎత్తిపోతల	3000	0
నెట్టెంపాడు ఎత్తిపోతల	58,000	0
ఏఎంఆర్-ఎస్ఎల్‌బీసీ	50000	76,286
దేవాదుల ఎత్తిపోతల	1,23,217	2,86,420
శ్రీపాదసాగర్ ఎల్లంపల్లి	75000	78800
కాళేశ్వరం ఎత్తిపోతల	25000	21000
ఎస్సారెస్పీ వరదకాలువ	1,02,882	1,50,000
దిగువ పెన్‌గంగ (చనాఖా-కొరాటాతోపాటు)	29,800	21000
8మధ్యతరహా ప్రాజెక్టులు	71382	22000




పోలీసుల అదుపులో నిందితులు, వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్, డీఈవో టామ్నే ప్రణీత ★ స్వాధీనం చేసుకున్న సామగ్రి

వాట్సాప్‌లో 'పది' భౌతికశాస్త్ర ప్రశ్నపత్రం

- అక్రమాలను బట్టబయలు చేసిన పోలీసులు
- ఏడుగురిపై కేసు నమోదు.. పరారీలో ప్రధాన నిందితుడు

ఖానాపూర్, న్యూస్‌టుడే: పదోతరగతి పరీక్షల్లో చూచిరాతల వ్యవహారం శుక్రవారం నిర్మల్ జిల్లాలో కలకలం రేపింది. ఖానాపూర్ మండల కేంద్రంలో పదోతరగతి భౌతికశాస్త్రం ప్రశ్నపత్రం వాట్సాప్‌లో హల్‌చల్ చేసింది. కొంతమంది వాట్సాప్‌లో ప్రశ్నపత్రం తెప్పించుకుని చూచిరాతలకు తెర తీసినట్లు పోలీసులు గుర్తించారు. పరీక్షలు మొదలైనప్పటి నుంచీ ఇక్కడ ఇదే పద్ధతి సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ (కేటీఎస్) సిబ్బంది తీరు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు నిఘాపెట్టి గుట్టురట్టు చేశారు. ఠాణాలో విలేకరుల సమావేశంలో సీఐ ఆకుల అశోక్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.. స్థానిక వ్యాపారి రమణాప్రశాంత్ కుమార్తె స్థానిక ధ్రువ పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. ఈ పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్నారు. తన కుమార్తెను ఎలాగైనా గట్టెక్కించాలని లక్ష్మణచాంద మండలంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సాదు మన్మథరెడ్డిని సంప్రదించాడు. ప్రశాంత్ కోరిక మేరకు అతడు చరవాణిలో వాట్సాప్ ద్వారా భౌతికశాస్త్ర ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసి పంపించాడు. దీనికి సమాధానాలను స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గుర్తిస్తున్నట్లు ఐడీపార్టీ పోలీసుల నుంచి సమాచారం రావడంతో సీఐ సిబ్బందితో ఆ పాఠశాలను ముట్టడించారు. కేటీఎస్ సిబ్బంది పోలీసులను అడ్డుకొనే ప్రయత్నం చేయడంతో ఆయన లోనికి చొచ్చుకువెళ్లారు. ప్రశాంత్ సహా మరో ఇద్దరు పాఠశాల సిబ్బంది ప్రశ్నలకు సమాధానాలు పుస్తకాల్లో వెతుకుతుండగా వారిని పట్టుకొని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి చరవాణులను, పుస్తకాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనకు కారణమైన సాదు మన్మథరెడ్డి, రమణా ప్రశాంత్, కేటీఎస్ సిబ్బంది సట్ల గంగాధర్, సుతారి రవికుమార్, ఇప్ప సాయన్న, జి.శ్రీనివాస్, జి.రాజేందర్‌లను నిందితులుగా గుర్తించి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ప్రధాన నిందితుడైన మన్మథరెడ్డి పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. ఐడీ పార్టీ పోలీసులను సీఐ అభినందించారు. జిల్లా విద్యాశాఖాధికారి టామ్నే ప్రణీత పాఠశాలను సందర్శించారు. ఈ ఘటనకు కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎన్నికలకు కాంగ్రెస్ కసరత్తు ప్రారంభం

- సంక్షేమ పథకాల రూపకల్పనకు సలహా కమిటీ
- జీవన్‌రెడ్డి ఛైర్మన్‌గా 42 మందికి చోటు

హైదరాబాద్, న్యూస్‌టుడే: రాబోయే ఎన్నికల కోసం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు... ప్రస్తుత తెరాస ప్రభుత్వం పథకాల విషయంలో అనుసరిస్తున్న తీరును బేరీజు వేసుకుంటూనే... వచ్చే ఎన్నికల్లో ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలపై హామీలు ఇవ్వాలనే దానిపై ప్రత్యేక దృష్టి సారించింది. వీటిని అధ్యయనం చేయడానికి సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం సలహా కమిటీని ఏర్పాటు చేసింది. మొత్తం 42 మందితో కూడిన ఈ కమిటీలో పార్లమెంటు సభ్యుడు నంది ఎల్లయ్య, ఎమ్మెల్సీలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఆకుల లలిత, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గీతారెడ్డి, చిన్నారెడ్డి, డి.కె.అరుణ, టి.రాంమోహన్‌రెడ్డి, ఇటీవల ఎమ్మెల్యే సభ్యత్వం కోల్పోయిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్‌లతో పాటు మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, వివిధ జిల్లాల డీసీసీ అధ్యక్షులకు సభ్యులుగా అవకాశం కల్పించారు. ఛైర్మన్ జీవన్‌రెడ్డి అధ్యక్షతన సలహా కమిటీ ప్రాథమిక సమావేశం శుక్రవారం గాంధీభవన్‌లో జరుగగా.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ఎన్నికల్లో తెరాస అనేక సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి హామీలు ఇచ్చి, అమలులో పూర్తిగా విఫలమైందని ఉత్తమ్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు ఎలాంటి పథకాలు అమలు చేయాలి అనే అంశంపై చర్చించి నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచించారు. ప్రధానంగా గృహ నిర్మాణ పథకం, పెన్షన్లు, విద్య, వైద్యం, ఉపాధి తదితర రంగాలలో పథకాలపై లోతుగా అధ్యయనం చేయాలన్నారు. ఏ విధంగా అమలు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది అనే దానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.



అజ్మీర్ దర్గాకు పంపించే చాదర్‌కు ప్రత్యేక పూజలు చేస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

అజ్మీర్ దర్గాకు చాదర్ పంపిన ఉత్తమ్

పవిత్ర అజ్మీర్ దర్గాకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చాదర్ పంపించింది. శుక్రవారం మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గాంధీభవన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఏటా అజ్మీర్ దర్గాకు చాదర్‌ను ఆనవాయితీగా పంపిస్తున్నారు.

నయీం డైరీ.. 50 ప్రశ్నలు

- వీటి చుట్టే సాగుతున్న దర్యాప్తు
- ఆగస్టులోపు పూర్తి చేసేందుకు కసరత్తు

ఈనాడు - హైదరాబాద్

కరుడుగట్టిన నేరగాడు నయీం కేసులో దర్యాప్తు అంతా డైరీ.. ఓ 50 ప్రశ్నల చుట్టూనే కేంద్రీకృతమైంది. దీనికి వచ్చే జవాబులను బట్టే నయీం నేరాల గుట్టురట్టవడమే కాక, అతనితో అంటకాగిన అధికారులు ఎవరో తెలిసే అవకాశముంది. అందుకే ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు ఇప్పుడు ఈ జవాబుల కోసం ఎదురుచూస్తున్నారు. నయీం హతమై ఆగస్టునాటికి రెండేళ్లు పూర్తవుతున్నందున ఈలోపే దర్యాప్తు ముగించాలనే పట్టుదలతో ఉన్నారు.

35కుపైగా హత్యలు చేసి వందల ఎకరాలు ఆక్రమించిన నయీం ఇందుకు పోలీసు అధికారులనూ వాడుకున్నాడు. నయీం తాను చేసే ప్రతీపనీ డైరీలో రాసుకునేవాడు. పోలీసులు అల్కాపురిలోని నయీం ఇంటి నుంచి కొన్ని డైరీలు స్వాధీనం చేసుకున్నారు. అందులో తనకు ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి? ఎవరెవరికి ఎంత చెల్లించింది? వంటి వివరాలు రాసి ఉన్నాయి. డబ్బు చెల్లింపులు, లావాదేవీలకు సంబంధించి మొత్తం 400పేజీలతో ఉన్న డైరీని స్వాధీనం చేసుకున్న పోలీసులు దాన్ని విశ్లేషణకు తెలంగాణ ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపారు. డైరీలో పేర్లు, చెల్లింపులు వంటివి రాసి ఉన్నా.. అది రాసింది నయీమేనని శాస్త్రీయంగా నిర్ధారించాల్సి ఉంటుంది. లేకపోతే పోలీసులు తమకు గిట్టనివారి పేర్లు రాశారనే వాదన లేవనెత్తే అవకాశముంది. అందుకే డైరీని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. అందులో రాత నయీందేనని నిర్ధారించడానికి అతను విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన పరీక్ష పత్రాల నుంచి చేతిరాత నమూనా సేకరించారు. అయితే అన్నిపేజీలు చూసి ప్రతి లైను విశ్లేషించడం సాధ్యంకాదనడంతో.. సిట్ అధికారులు డైరీ నుంచి తమకు కావాల్సిన అంశాలకు సంబంధించి 50 ప్రశ్నలను రూపొందించి ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపారు. అందులోని అధికారుల పేర్లు, ఎవరెవరికి ఎంత చెల్లించింది? ఇతరత్రా లబ్ధి పొందిందెవరు? వంటి వివరాలు కావాలని కోరారు. అన్నీ నయీమే స్వయంగా రాసినట్లు నిర్ధారించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం సిట్ అధికారుల ప్రశ్నలకు సమాధానాలు రూపొందించే పని జరుగుతోంది. దర్యాప్తులో ఇదే కీలకం. నయీంతో ఎవరెవరికి సంబంధాలున్నాయో నిరూపించాలంటే ఇంతకు మించిన ఆధారం ఏమీ ఉండదు. వచ్చేనెలలో ఈ వివరాలు అందే అవకాశముందని భావిస్తున్నారు.

నయీంకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 246 కేసులు నమోదు చేశారు. ఇప్పటికే దాదాపు 70కేసులలో అభియోగపత్రాలు దాఖలు చేయగా మిగతావాటిలో దర్యాప్తు చురుగ్గా సాగుతోంది. వచ్చే ఆగస్టునాటికి వీటి దర్యాప్తు పూర్తిచేసి అభియోగపత్రాలు దాఖలు చేయాలని పోలీసులు పట్టుదలతో ఉన్నారు. సిట్‌లో పనిచేస్తున్న అధికారులు తరచూ బదిలీ అవుతుండటమూ దర్యాప్తుపై ప్రభావం చూపుతోంది. అయినా కేసు కొలిక్కి తేవాలని అధికారులు భావిస్తున్నారు.

నిను వీడి నేనుండలేను

భార్య మరణం జీర్ణించుకోలేక కానిస్టేబుల్ ఆత్మహత్య



రవికుమార్, రజిత (పాతచిత్రం)

మహబూబ్‌నగర్(నేరవిభాగం), న్యూస్‌టుడే: అన్యోన్యంగా ఉన్న ఆ దంపతులను చూసి విధికి కన్ను కుట్టింది. ఇద్దరినీ వేరు చేయాలనుకొంది. కానీ వారి ప్రేమానురాగాల ముందు విధే ఓడిపోయింది. సంతానం కలుగలేదని భార్య ఆత్మహత్యకు పాల్పడగా.. ఆమె లేని జీవితం వద్దను కొని భర్త మరుసటి రోజు తెల్లవారు జామున బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ దుర్ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకొంది. మహబూబ్‌నగర్ పట్టణం పాత పాలమూరుకు చెందిన రవికుమార్(28) జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం ఫోరెన్సిక్ విభాగంలో పనిచేస్తున్నారు. ఈయనకు అదే పట్టణానికి చెందిన రజితతో రెండేళ్ల కిందట వివాహమైంది. అన్యోన్యంగా జీవనంసాగిస్తున్నారు. సంతానం కలుగలేదన్న కారణంతో మనస్తాపానికి గురైన రజిత గురువారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలిసి రవికుమార్ దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె మరణాన్ని తట్టుకోలేక శుక్రవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు.

భాజపా కిసాన్‌మోర్చ 'చలో అసెంబ్లీ' భగ్నం

- కేసీఆర్ సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయి: లక్ష్మణ్
- నిజాం నియంతృత్వ పాలనకు నిదర్శనం: కిషన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్, గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అధికార తెరాస ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన 'చలో అసెంబ్లీ' నిరసన ప్రదర్శనను పోలీసులు భగ్నం చేశారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శనకు పూనుకున్న భాజపా రాష్ట్ర నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని గోషామహల్ పోలీసు స్టేడియానికి, శాసనసభ్యులను శాసనసభకు తరలించారు. దీంతో పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. పార్టీ కార్యకర్తలను బలవంతంగా వాహనాలలో తరలిస్తుండగా పోలీసులు, కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. చలో అసెంబ్లీ కార్యక్రమం కోసం ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ రామచంద్రారావు, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు గోలి మధుసూధన్‌రెడ్డి, నాయకులు బద్దం బాల్‌రెడ్డి, నందీశ్వర్, యెండల లక్ష్మీనారాయణ, ప్రేమేందర్‌రెడ్డి, ఆకుల విజయ, ఛాయా దేవీ, పుష్పలీల, తదితర నేతలు పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరగానే పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయని, త్వరలోనే ప్రజలు తగిన బుద్ధిచెబుతారన్నారు. రాష్ట్రంలో తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రైతులకు, వ్యవసాయానికి ఎలాంటి ప్రయోజనాలు జరగలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. నగరానికి భాజపా కార్యకర్తలు రాకుండా ముందస్తుగానే ఎక్కడికక్కడ అరెస్టులు చేశారని ఆరోపించారు. పార్టీ శాసనసభాపక్షనేత కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అణచివేత విధానాల ద్వారా నిజాం నియంతృత్వ పరిపాలనను తలపిస్తుందని ఆరోపించారు. కేసీఆర్ సర్కారు ప్రజల హక్కులను కాలరాస్తుందని ధ్వజమెత్తారు. ఇది ప్రభుత్వ పతనానికి దారి తీస్తుందని హెచ్చరించారు.



అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న భాజపా నాయకులు ప్రభాకర్, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి

ఆదివాసీలను విడుదల చేయాలి: తెలంగాణ పౌర హక్కుల సంఘం

ఈనాడు, హైదరాబాద్: ఆదివాసీల అక్రమ నిర్బంధం ఆపాలని, వారి పట్ల నియంతృత్వ వైఖరిని విడనాడాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో ఛత్తీస్‌గఢ్ నుంచి అనారోగ్యంతో హైదరాబాద్‌కు వచ్చిన ఆదివాసీ ప్రజలను తిరిగి వెళ్తున్న సమయంలో పోలీసులు అరెస్టు చేశారని, వారిని బేషరతుగా విడుదల చేయాలని సంఘం తెలంగాణ అధ్యక్షుడు ప్రొ.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అరెస్టుఅయినవారిలో సుక్మా జిల్లాకు చెందిన కుంజం ఊరయ్య, మహేశ్, సురేశ్, నంది(మహిళ)ఉన్నారని పేర్కొన్నారు. వీరిని మావోయిస్టులుగా ముద్ర వేసి చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు వారి బంధువులు చెబుతున్నారని తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ జోక్యం లేదు

- **గ్రూప్-2 వ్యవహారంలో న్యాయవాదుల కమిటీ నివేదిక**

ఈనాడు, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ చేపట్టిన గ్రూప్-2 పరీక్షల ఓఎంఆర్ షీట్లలో దొర్లిన పొరపాట్లను సరిదిద్దడం ద్వారా నియామక ప్రక్రియ ప్రభావితమయిందా, లేదా అనే అంశంపై నిర్ణయాన్ని న్యాయస్థానానికి వదిలేస్తున్నట్లు ఓఎంఆర్ షీట్లను పరిశీలించిన న్యాయవాదుల కమిటీ పేర్కొంది. ఓఎంఆర్ షీట్లలో టీఎస్‌పీఎస్సీ జోక్యం కనిపించలేదని నివేదించింది. కమిటీ పలు అంశాలపై స్పష్టతనిస్తూ న్యాయస్థానానికి నివేదిక అందజేసింది. ఓఎంఆర్ షీట్లలోని పార్ట్-ఏలో అభ్యర్థులు రోల్‌నంబరు, ప్రశ్నాపత్రం బుక్‌లెట్ నంబరు, టెస్ట్‌బుక్ సిరీస్ నంబర్లో.. తప్పుగా బబ్లింగ్ చేయడం, బబ్లింగ్ చేయకపోవడం, రెండుసార్లు బబ్లింగ్ చేయడం గుర్తించామంది. వీటికి సంబంధించిన దిద్దుబాట్లను మాత్రమే టీఎస్‌పీఎస్సీ సరిచేసిందని, ప్రశ్నలకు సమాధానాలుండే పార్టు-బిలో ఎలాంటి దిద్దుబాట్లు చేయలేదని పేర్కొంది. పార్ట్-ఏలో పొరపాట్లు చేసిన అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాల్సి వచ్చేదని కమిటీ తెలిపింది. కానీ వారి వివరాలు సరిదిద్ది టీఎస్‌పీఎస్సీ.. వారందరినీ మూల్యాంకన పరిధిలోకి తీసుకొచ్చినట్లు చెప్పింది. పొరపాట్లు పార్ట్-ఏ వరకే ఉన్నాయని తెలిపింది. ఈ వ్యాజ్యంపై ఈ నెల 28న తదుపరి విచారణ చేపడతామని న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు పేర్కొన్నారు.

కమిటీ సభ్యుల నివేదికలోని వివరాలు

★ ఓఎంఆర్ షీట్లలో పొరపాట్లు చేసిన 55 వేల మందిని గుర్తించి వారందరి వివరాలు సరిచేయాలని కమిషన్ నిర్ణయం తీసుకుంది. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేసిన 3,147 మందిలో కూడా కొందరు ఓఎంఆర్ షీట్లలో పొరపాట్లు చేశారని, వారివి కూడా దిద్దుబాటు చేసినట్లు న్యాయవాదుల కమిటీ గుర్తించింది.

★ గ్రూప్-2లో 3,147 మందిని 1:3 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేశారని.. వీరిలో ఓఎంఆర్ పార్ట్-ఏలో పొరపాట్లు చేసిన 120 మంది కూడా ఉన్నట్లు న్యాయస్థానానికి వివరించింది.

★ ఓఎంఆర్ షీట్లను మాన్యువల్‌గా పరిశీలించడం ద్వారా అభ్యర్థి సామర్థ్యాన్ని ప్రభావితం చేసే పరిస్థితులు ఉత్పన్నం కావడం లేదని టీఎస్‌పీఎస్సీ చెప్పినదాన్ని బట్టి తెలుస్తోందని వెల్లడించింది.

★ ఇద్దరు అభ్యర్థులకు చెందిన ఓఎంఆర్ షీట్లు తారుమారవడం వల్ల పొరపాట్లు దొర్లాయా అన్న విషయాన్ని పరిశీలించగా అందుబాటులోని సమాచారం ఆధారంగా గుర్తించలేదని తెలిపింది. పొరపాట్లు కంగారులో చేసినట్లు ఉన్నాయని, సున్నాకు బదులుగా ఒకటిని బబుల్ చేయడం ఆ తరువాత తప్పును గుర్తించి సరిచేయడం లాంటివి జరిగినట్లు గుర్తించామని వివరించింది.

ప్రకృతి సంపదకు ముప్పు తెస్తూ...

మానవాళే మునిగిపోతోంది?



- **ఐపీబీఈఎస్ నివేదిక ఆవేదన**
- **పగడపు దిబ్బలకూ పొంచి ఉన్న ప్రమాదం**
- **పక్షులు, క్షీరదాలు అంతర్ధానం?**
- **మత్స్య జాతుల మనుగడ ప్రశ్నార్థకం?**
- **మేలుకుంటేనే తేరుకుంటాం**

మెడెలిన్(కొలంబియా): ప్రకృతి సంపదకు ఎనలేని హాని చేయడం ద్వారా మానవుడే తనకు తాను ఇబ్బందిని కొని తెచ్చుకుంటున్నట్లు పర్యావరణ శాస్త్రవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 550 మందికి పైగా శాస్త్రవేత్తలు మూడేళ్లపాటు అహర్నిశలు శ్రమించి నిర్వహించిన అధ్యయన నివేదికను శుక్రవారం విడుదల చేశారు. దీనిప్రకారం 2048 నాటికి ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో మత్స్యసంపద కాస్తా హరించుకుపోతుంది. 2050 నాటికి ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని ప్రవాళభిత్తికలు(పగడపు దిబ్బలు) 90శాతం వరకూ క్షీణిస్తాయి. 2100 నాటికల్లా ఆఫ్రికాలోని పక్షులు, క్షీరదజాతులు సగానికిపైగా అంతరించిపోతాయి. భీతిగొలిపే ఈ పరిణామాల ప్రభావం ఆర్థికవ్యవస్థలు, ఆహారభద్రత, జీవనోపాధికి పెను ప్రమాదకారులుగా పరిణమిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ' మనమే(మానవజాతి) స్వయంగా మన భవిష్యత్‌ను, బాగోగులను దెబ్బతీసుకుంటున్నాం' అని 'ఇంటర్ గవర్నమెంటల్ సైన్స్-పాలసీ ప్లాట్‌ఫారం ఆన్ బయోడైవర్సిటీ, ఎకోసిస్టమ్ సర్వీసెస్'(ఐపీబీఈఎస్) వ్యాఖ్యానించింది. ఐపీబీఈఎస్ సారథి రాబర్ట్ వాట్సన్ మాటల్లో చెప్పాలంటే... మానవాళి ప్రకృతిని విచక్షణ రహితంగా వినియోగించుకుంటున్న తీరును మార్చుకుంటే తప్ప పరిస్థితి మెరుగుపడదు. జీవవైవిధ్యాన్ని మానవజాతి విపరీతరీతిలో వినియోగించుకుంటున్న తీరు జీవజాతులు అంతరించిపోవడానికి కారణమౌతోంది. గతశతాబ్ద కాలంలో సగటున ఏటా రెండు రకాల వెన్నెముక జాతి జంతుజాలం అంతర్ధానమై పోతోంది. తాజాగా..., సూడాన్‌లో ప్రపంచంలోనే ఆఖరిదైన తెల్లని ఖడ్గమృగం మృతిచెందడం ఇందుకు తాజా ఉదాహరణ.

ముఖ్యంగా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని జీవవైవిధ్యానికి పెనుముప్పు పొంచి ఉందని ఐపీబీఈఎస్ నివేదిక హెచ్చరించింది. శిలాజ ఇంధనాలను మానవ అవసరాల కోసం విచక్షణ రహితంగా మండించడం కనీవినీ ఎరుగని రీతిలో వాతావరణ మార్పులకు కారణమౌతోంది. ఇప్పటికీ సమయం మించిపోలేదు.

ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, వ్యక్తులు అంతా ఒక్కటిగా యోచించాలి. తమ నిర్ణయాల్లో జీవవైవిధ్య పరిరక్షణ అంశాలకు ప్రాధాన్యతనివ్వాలి. వ్యవసాయం, మత్స్య సంపద, అటవీ, మైనింగ్, మౌలికవసతుల కల్పన వంటి అంశాల దిశగా ఈ కోణం నుంచే నిర్ణయాలు తీసుకోవాలి. మానవాళి ఈ పరిస్థితి మొత్తాన్నీ సంపూర్ణంగా మెరుగుపరచలేకపోవచ్చు. అయితే, ప్రమాదకర పరిణామాల ప్రక్రియ వేగానికి అడ్డుకట్ట వేయవచ్చునని ఐపీబీఈఎస్ సారథి అభిప్రాయపడ్డారు.

అత్యంత ఖరీదైన ఏడాది 2017!

ఐక్యరాజ్య సమితి: కొన్నిదేశాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ప్రకృతివిపత్తులు కలగలిసి మొత్తం మీద 2017వ సంవత్సరంలో 320 బిలియన్ డాలర్ల మేరకు వ్యయానికి కారణమైనాయి. భారత ఉపఖండంలో సంభవించిన భారీ వరదలు...తూర్పు ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితుల రీత్యా జరిగిన వ్యయాన్ని బట్టి చూస్తే 2017ను అత్యంత ఖరీదైన సంవత్సరంగా పేర్కొనవచ్చు. ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యుఎంవో) నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికాను ఒక్క ఊపు ఊపేసిన తుపాను బీభత్సం భారీ వ్యయానికి కారణమైంది.

2017లో బంగ్లాదేశ్, నేపాల్, ఉత్తరభారత్‌లో సంభవించిన వరదలు లక్షలాది ప్రజల బతుకులను కడగండ్ల పాల్జేశాయి. భారీగా జననష్టమూ జరిగింది. మూడు దేశాల్లోనూ జనం నిరాశ్రయులై చెట్టూపుట్టా పట్టిపోయారు.

ఉత్తర హిందూ మహాసముద్రంలో గత మేలో సంభవించిన 'మోరా'..... డిసెంబరు మాసారంభంలో ఉక్కిరిబిక్కిరి చేసిన 'ఓఖీ' తుపాన్లు జననష్టానికి కారణమైనాయి. ఈ రెండు తుపానులూ శ్రీలంకను కకావికలు చేశాయి. భారీ సంఖ్యలో మత్స్యకారులు గల్లంతైపోయిన విషయాన్ని డబ్ల్యుఎంవో నివేదిక ప్రస్తావించింది.

లింగాయతులు ఇక అల్పసంఖ్యాకులు

ఉత్తర్వులు జారీచేసిన కర్ణాటక ప్రభుత్వం

ఈనాడు, బెంగళూరు: లింగాయతులు, బసవతత్వాన్ని నమ్మిన వీరశైవుల్ని మత అల్పసంఖ్యాకులుగా కర్ణాటక ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. కర్ణాటక మత అల్పసంఖ్యాకుల, హజ్, వక్ఫ్ శాఖ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతమున్న అల్పసంఖ్యాకులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌలభ్యాలకు ఇబ్బంది కల్గించరాదనే ఆంక్షలకు లోబడి లింగాయతులు, బసవతత్వాన్ని నమ్మిన వీరశైవుల్ని మత అల్పసంఖ్యాకులుగా గుర్తించినట్లు అందులో పేర్కొంది. లింగాయతులను అల్పసంఖ్యాకులుగా గుర్తించాలంటూ కేంద్రానికి ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించింది.

ఔషధాల కొనుగోలుకు ఆన్‌లైన్ వ్యవస్థ

- **ఉద్యోగుల ఆరోగ్య పథకంలో కీలక నిర్ణయం**

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగులు, పింఛనుదారులు, పాత్రికేయుల ఆరోగ్య పథకంలో ఔషధాల కొనుగోలు ప్రక్రియను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఔషధ ప్రతిపాదనలు పంపించే వ్యవస్థ లేకపోవడంతో.. ఎంత మొత్తంలో ఔషధాల నిల్వలున్నాయి? ఎన్ని రోజులకు సరిపోతాయి? ముందస్తుగా ఎప్పుడు ప్రతిపాదనలు రూపొందించాలి? అనే స్పష్టత కొరవడింది. దీంతో సమయానికి రోగులకు ఔషధాలను అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇది రోగులకు ఇబ్బందిగా పరిణమిస్తోంది. దీనిపై దృష్టిపెట్టిన వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అత్యవసరంగా ఉద్యోగుల ఆరోగ్య పథకానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. ఓపీ సేవల కేంద్రాల్లో వసతులు, ఔషధ నిల్వలపై తక్షణమే సమీక్షించి నివేదికను అందించాలని ఆదేశించారు. ఆ అధికారి శుక్రవారం వనస్థలిపురం, ఖైరతాబాద్‌లోని ఓపీ సేవల కేంద్రాలను సందర్శించి, సమస్యలపై సిబ్బందితో మాట్లాడారు. ఔషధ నిల్వల్లో తలెత్తిన లోపాలను గుర్తించడంతో తక్షణ సర్దుబాటు దిశగా కార్యాచరణ రూపొందించారు. ముందుగా నిమ్స్‌లో అమలు చేస్తున్న ఔషధ ధరల ఒప్పంద విధానాన్ని ప్రాతిపదికగా తీసుకొని తక్షణం అవసరమైన ఔషధాలను కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా ఔషధాల కొనుగోలుకు ఆన్‌లైన్ వ్యవస్థను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని ఇతర ఉద్యోగుల, పాత్రికేయుల ఓపీ సేవల కేంద్రాల్లోనూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఔషధ నిల్వల సమాచారాన్ని ఇప్పటికే సేకరించారు. ఔషధ నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టుతున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

కేసీఆర్ ప్రగతి ప్రాంగణం పుస్తకావిష్కరణ

ఈనాడు, దిల్లీ : రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జీవితంలో అనేక ఘట్టాలను పొందుపరుస్తూ భూపాలపల్లికి చెందిన ఆర్టీసీ కండక్టర్ బొట్ల మహర్షి రచించిన 'కేసీఆర్ ప్రగతి ప్రాంగణం' పుస్తకాన్ని శుక్రవారం దిల్లీలో జేఎన్‌యూ వీసీ జగదీశ్ కుమార్ ఆవిష్కరించారు. తెలంగాణలోని అన్ని వర్సిటీ గ్రంథాలయాల్లో ఈ పుస్తకం ఉండాలని మహర్షి ఆకాంక్షించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జేఎన్‌యూ వీసీ జగదీశ్ (కుడి వైపు), చిత్రంలో మహర్షి

సాహిత్య అకాడమీ సలహామండలి సభ్యుడిగా యాకూబ్



ఈనాడు, హైదరాబాద్: కేంద్ర సాహిత్య అకాడమీ ఇటీవల ఏర్పాటు చేసిన తెలుగు సలహామండలిలో ప్రముఖ కవి యాకూబ్‌కు స్థానం కల్పించారు. 2018 నుంచి 2022 వరకు సలహామండలిలో ఆయన సభ్యుడిగా కొనసాగుతారు. బుధవారం దిల్లీలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో యాకూబ్‌ను ఎంపిక చేసినట్లు అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. సాహిత్య అకాడమీ తెలుగుకు సంబంధించి నిర్వహించనున్న కార్యక్రమాలు, ప్రచురణల విషయంలో ఆయన సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు.

ఏపీ గ్రూప్-1 టాపర్‌గా నిషాంత్

- **మార్కులు ప్రకటించిన ఏపీపీఎస్సీ**

ఈనాడు, అమరావతి, డిజిటల్: ఏపీ గ్రూపు-1 (2016) మౌఖిక పరీక్షలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. మొత్తం 151 మంది వీటికి హాజరయ్యారు. వీరికి ప్రధాన పరీక్షల్లో సబ్జెక్టుల వారీగా... మౌఖిక పరీక్షలో వచ్చిన మార్కులను విడివిడిగా, అలాగే కలిపి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం... అనంతపురం జిల్లా అభ్యర్థి నిషాంత్‌రెడ్డి 522.5 మార్కులను సాధించి తొలిస్థానాన్ని దక్కించుకున్నారు. 2011 నోటిఫికేషన్ ద్వారా మంచి ఉద్యోగాలు పొందిన వారు కూడా 2016 మౌఖిక పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో పలువురికి ఎక్కువ మార్కులు రాగా... కొందరికి తగ్గాయి. ఉద్యోగ స్థాయి అనుసరించి పాత మార్కుల ప్రకారం ఉద్యోగాన్ని ఎంచుకోవాలా లేక తాజా మార్కుల్ని అనుసరించి ఎంపిక చేసుకోవాలా అనేది అభ్యర్థులు నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

ఐఏఎస్ సాధించాలన్నదే నా కల...



"ఐఏఎస్ సాధించాలన్నదే నా కల. రెండు సార్లు సివిల్స్ రాసినా ప్రణాళికాబద్ధమైన సన్నద్ధతలేక మెయిన్స్‌లో విఫలం అయ్యాను. గ్రూపు-1లో ప్రథమ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టరు అయితే పదోన్నతిపై కలెక్టరు కావచ్చని అంచలంచెలుగా ఎదిగి రాష్ట్ర స్థాయిలో కూడా సేవలు అందించవచ్చని అనుకున్నా. ఆ ఆశయం నెరవేరే దిశగా ఫలితాలు రావడం ఆనందంగా ఉంది"

– నిషాంత్‌రెడ్డి, గ్రూపు-1లో ప్రథమ ర్యాంకర్, అనంతపురం జిల్లా

పోలవరంపై ఎన్జీటీ తీర్పు సుప్రీంలో సవాలు

విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం

ఈనాడు, దిల్లీ: పోలవరం పర్యావరణ అనుమతులు, నిబంధనల ఉల్లంఘనపై జాతీయ హరిత ట్రైబ్యునల్ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. ఎన్జీటీ తీర్పును సవాలు చేస్తూ రేలా అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్‌గుప్తాలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. పిటిషన్ విచారణకు స్వీకరించిన ధర్మాసనం పోలవరం అథారిటీ, కేంద్ర పర్యావరణ శాఖ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలకు నోటీసులిచ్చింది.

ప్రభుత్వానికి మూడు కాగ్ నివేదికలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి మూడు కాగ్ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం శుక్రవారం అందజేసింది. ఈ 2017 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక, ఆర్థిక, రెవెన్యూ రంగాలకు సంబంధించిన నివేదికలు అందజేసినట్లు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) అజైబ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాసనసభలో ఈ నివేదికలను ప్రవేశపెట్టనున్నారు.

రెవెన్యూ డివిజన్‌గా పరకాల

ఈనాడు, హైదరాబాద్: వరంగల్ గ్రామీణ జిల్లా పరకాలను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం దస్త్రంపై సీఎం కేసీఆర్ సంతకం చేశారు. ఈ మేరకు పరకాల, ఆత్మకూరు, శాయంపేట, దామెర, నడికుడి మండలాలతో కొత్త రెవెన్యూ డివిజన్ రూపుదిద్దుకుంది. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీసిటీలో 'లిబరల్ ఆర్ట్స్' విశ్వవిద్యాలయం

- **ఆర్‌బీఐ పూర్వ గవర్నర్ రఘురాం రాజన్, వ్యాపార దిగ్గజాలు, విద్యారంగ నిపుణుల పథక రచన**
- **రూ.750 కోట్లతో యూనివర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు**

ముంబయి: ఆంధ్రప్రదేశ్ సిగలో మరో విశ్వవిద్యాలయం చేరనుంది. రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్, మరికొందరు వ్యాపార దిగ్గజాలు, విద్యారంగ ప్రముఖులు కలిసి... చిత్తూరు జిల్లా శ్రీసిటీలో 'లిబరల్ ఆర్ట్స్' విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంకల్పించారు. స్నాతక (డిగ్రీ) స్థాయి విద్యలో సమూల మార్పులకు నాంది పలుకుతూ- అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తామని శుక్రవారం వారిక్కడ వెల్లడించారు.

''కార్పొరేట్ సంస్థలు తమ సామాజిక బాధ్యతగా ఆంధ్రప్రదేశ్‌లో లిబరల్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. తొలిదశలో రూ.750 కోట్లను సమీకరించాలన్నది లక్ష్యం. ఇప్పటికే ఇందులో 70-80% వరకూ నిధులకు స్పష్టత వచ్చింది'' అని ఇండస్ బ్యాంకు ఛైర్మన్, వర్సిటీ పర్యవేక్షక మండలి అధ్యక్షులు ఆర్.శేషసాయి తెలిపారు.

ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు...

"2019లో తొలి బ్యాచ్ ప్రారంభమవుతుంది. ప్రవేశ ప్రక్రియ మాత్రం ఈ ఏడాది నవంబరులోనే ఉంటుంది. నాలుగేళ్ల ఆర్ట్స్ (బీఏ ఆనర్స్), సైన్స్ (బీఎస్సీ ఆనర్స్) కోర్సులను అందుబాటులోకి తెస్తున్నాం. ఇప్పటికే వీటి అనుమతుల కోసం యూనివర్సిటీ నిధుల సంఘానికి దరఖాస్తు చేశాం. కేవలం 'ప్లస్ టూ' స్థాయిలో సాధించిన మార్కులే ప్రాతిపదిక కాకుండా... పూర్తిగా విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తాం. తొలుత ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ (ఐఎఫ్ఎంఆర్) భవనంలో తరగతులను ప్రారంభిస్తాం. 2020 నాటికి శ్రీసిటీలో 200 ఎకరాల్లో సొంత భవనాలు సిద్ధమవుతాయి. తర్వాత అక్కడికి మార్చుతాం" అని శేషసాయి వివరించారు. వసతిగృహ సదుపాయంతో కలిపి ఒక్కో విద్యార్థి ఫీజు రూ.7-8 లక్షలు ఉంటుందన్నారు. అయితే, పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా వారికి ఆర్థిక సహాయం అందించే విషయాన్నీ పరిశీలిస్తున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయ పాలక మండలి ఛైర్మన్‌గా బ్యాంకు పూర్వాధికారి ఎన్.వాఘుల్, ఉపకులపతిగా ప్రముఖ విద్యావేత్త సుందర్ రామస్వామి వ్యవహరిస్తారని సమాచారం.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.